అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

సమగ్ర తెలుగు దినపత్రిక

సోమవారం 11-9-2023

సంపుటి : 9 | సంచిక : 202 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం కమ్యూనిస్టుల వారసత్వం

భారతదేశ భవిష్యత్తుకు దిశానిర్దేశం



చరిత్రకు మసిపూయలేరు

సాయధ పోరాటానికి మతం రంగు పులుముతున్నారు • మోడీ సర్కార్ చెప్పేదొకటి...చేసేదొకటి...

- అబద్ధాలు...వక్రీకరణలతో కేంద్రంలో పాలన
- విద్వేషాలతో విభజన రాజకీయాలు ...
- బుల్డోజర్ రాజకీయాలను అడ్డుకునేది ఎర్రజెండానే : తెలంగాణ రైతాంగ సాయుధపోరాట వార్షికోత్సవ సభలో బృందాకరత్
- కమ్యూనిస్టుల నేతృత్వంలో సాగిన ప్రజాయుద్ధమది
- ఏ సంబంధమూలేని శక్తులు వక్రీకరణలకు పాల్పడుతున్నాయి
- ఏ అర్హతతో సాయుధ పోరాటం గురించి మాట్లాడుతున్నారు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. వీరయ్య



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్రంలోని ప్రభుత్వం ప్రజలకు చెప్పేదొకటి... చేసేది మరొకటి అని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్ అన్నారు. పూర్తి అబద్ధాలు, వక్రీకరణలు, విద్వేష ప్రసంగాలతో వారు దేశాన్ని పాలిస్తున్నారని చెప్పారు. కులమతాలతో సంబంధం లేకుండా, భూమికోసం, భుక్తి కోసం, విముక్తి కోసం జరిగిన చారిత్రక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను కూడా ముస్లిం రాజుపై హిందువులు చేసిన పోరాటంగా చిత్రీకరించే ప్రయత్నం చేయడం దానిలో ...11లో



తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం

అజరామరం...

- బాంచెన్ దొరా అన్నోళ్లతోనే బరిసెలెత్తించిన ఉద్యమం
- విముక్తి పోరాటాలకు ఆ చరిత్ర స్ఫూర్తి..
- ఉద్యమ స్మృతులను కండ్లకు కట్టిన చిత్ర ప్రదర్శన
- ప్రారంభించిన హైకోర్టు న్యాయవాది విద్యాసాగర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం అజరామరం... అది విముక్తి ఉద్యమాలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని హైకోర్టు సీనియర్ న్యాయవాది జి విద్యాసాగర్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ...11లో

బీజేపీ, దాని మిత్రపక్షాలను ఓడించడమే

సీపీఐ(ఎం) లక్ష్యం

బీజేపీ పంచన చేరడానికి కేసీఆర్ ప్రయత్నాలు

- ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటం
- పేదల పక్షాన పోరాడేది ఎర్రజెండానే : తమ్మినేని వీరభద్రం




నవతెలంగాణ-పాలకుర్తి

దేశాన్ని, ప్రజలను మోసం చేస్తున్న మతోన్మాద బీజేపీ, దాని మిత్రపక్ష పార్టీలను ఓడించడమే సీపీఐ(ఎం) లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టంచేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 38వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం జనగామ జిల్లా పాలకుర్తిలోని ఐలమ్మ కాంస్య విగ్రహానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్, జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డితో కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి సీపీఐ(ఎం) కార్యకర్తలు ఎర్రజెండాలు చేత పట్టి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కార్యదర్శి మాచర్ల సారయ్య అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో తమ్మినేని మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ఘటన ఐలమ్మ పోరాటమని తెలిపారు. సెప్టెంబర్ 17న నైజాం సర్కార్ కూలిపోయిన దినం సందర్భంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచి 17వ తేదీ వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్స వాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తూ హిందూ ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా ప్రచారం చేస్తోందని విమర్శించారు. అందుకే 17వ తేదీని బీజేపీ విమోచన దినంగా పరిగణిస్తారని, ఈ సందర్భంగా ఈ నెల 17న హైదరాబాద్‌లో జరిగే అమిత్ షా పర్యటనను వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. బీజేపీని ఓడించేందుకు దేశంలో 'ఇండియా' కూటమిని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. బీజేపీతో సీఎం కేసీఆర్ లోపాయికారి ఒప్పందం చేసుకొని ఇండియా కూటమికి దూరంగా ఉంటున్నారన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తానని గతంలో సీఎం కేసీఆర్ ప్రకటించారని, కమ్యూనిస్టులతో మైత్రి కొనసాగిస్తామని చెబుతూనే మాట మార్చి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం ...11లో

చంద్రబాబుకు రిమాండ్

40 గంటల ఉత్కంఠ అనంతరం ఏసీబీ కోర్టు తీర్పు

- రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలింపు
- నేడు రాష్ట్ర బంద్‌కు ఏపీ టీడీపీ పిలుపు



విజయవాడ : ఏపీ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకు స్కిల్ డెవలప్‌మెంట్ స్కాము కేసులో ఏపీ ఏసీబీ కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఆరు గంటల సుదీర్ఘ విచారణ అనంతరం ఆదివారం సాయంత్రం 6.50 గంటలకు న్యాయమూర్తి హిమబిందు తీర్పు వెలువరించారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించాలని ఆదేశించారు. నంద్యాలలో శనివారం తెల్లవారుజామున చంద్రబాబును అరెస్టు చేస్తారని అర్ధరాత్రి సమయంలో వార్తలు ...3లో



బ్రెజిల్‌కు జీ-20

అధ్యక్ష బాధ్యతలు

మహిళా సాధికారతకు పెద్దపీట.. అందరికీ ఆహార భద్రతపై తీర్మానాలు

- డిక్లరేషన్‌పై ఏకాభిప్రాయం కోసం సుదీర్ఘ చర్చ..ముగిసిన సదస్సు



బ్రెజిల్ ప్రెసిడెంట్ లూయిజ్ ఇనాసియో డా సిల్వాకు అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : దేశ రాజధానిలో రెండు రోజుల పాటు అట్టహాసంగా జరిగిన జీ-20 సదస్సు ముగిసింది. సమావేశాల ముగింపు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగిస్తూ నవంబర్‌లో సభ్య దేశాల అధినేతలు వర్చువల్‌గా సమావేశమవ్వాలని, ప్రస్తుత సదస్సులో తీసుకున్న నిర్ణయాలను, వచ్చిన సూచనలను మరోసారి సమీక్షించుకోవాలని ప్రతిపాదించారు. జీ-20 అధ్యక్ష పదవిలో భారత్ నవంబర్ 30వ తేదీ వరకూ అధికారికంగా కొనసాగుతుందని చెప్పారు. అంతకుముందు ఆయన జీ-20 అధ్యక్ష బాధ్యతలను బ్రెజిల్‌కు అప్పగించి, శుభాకాంక్షలు తెలిపారు. బ్రెయిల్ ఈ బాధ్యతలను డిసెంబర్ 1న అధికారికంగా చేపడుతుంది. ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించిన వివాదాస్పద పేరాగ్రాఫ్‌లపై సభ్య దేశాలు ఏకాభిప్రాయానికి వచ్చాయి. ఈ పరిణామాన్ని ప్రధాని నరేంద్ర మోడీ స్వయంగా ప్రకటించారు. కాగా అతిథుల గౌరవార్థం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విందు ఏర్పాటు చేశారు. చారిత్రక సదస్సును నిర్వహించినందుకు భారత్‌ను బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ అభినందించారు. జీ-20 సదస్సు సందర్భంగా ప్రధాని మోడీ కెనడా అధ్యక్షుడు జస్టిన్ ట్రుడెయూతో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. కాగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చైనా ఆర్థిక మంత్రి లీ కున్‌తో సమావేశమయ్యారు. ఉక్రెయిన్‌పై జీ-20 సదస్సు ఆమోదించిన తీర్మానాన్ని జపాన్ ప్రధాని కిషిడా తోసిపుచ్చారు. ఇది బలహీనమైన తీర్మానమని వ్యాఖ్యానించారు. అయితే ఈ తీర్మానాన్ని రష్యా కొనియాడింది. మాస్కోపై నేరుగా విమర్శలు చేయకుండా సమతూకం పాటించారని తెలిపింది. వివాదాస్పదమైన ఉక్రెయిన్ అంశంపై చివరి వరకూ సంప్రదింపులు కొనసాగాయని యూరోపియన్ యూనియన్ అధికారులు తెలిపారు. భారత్‌తో అత్యున్నత ...11లో



జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించండి

బీఆర్ఎస్ శ్రేణులకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఈనెల 17వ తేదీ జరిగే జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారక రామారావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం భారత సమాఖ్యలో విలీనమైన 17వ తేదీని జాతీయ సమైక్యత దినోత్సవంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలు జరుపుకుంటున్నారని ఆయన గుర్తుచేశారు. హైదరాబాద్‌లో జరిగే వేడుకల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా ...2లో



కార్పొరేట్ల దురాశకు బీజేపీ అండదండలు

- మణిపూర్ జాతుల ఘర్షణకు ప్రధాన కారణం అదే : సీపీఐ పార్లమెంటరీ పార్టీ నాయకులు బినోయ్ విశ్వం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సహజ సంపద, వనరుల లూటీ చేయాలనే కార్పొరేట్ దురాశకు బీజేపీ నేతృత్వంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అందిస్తున్న రాజకీయ అండదండలే మణిపూర్ ...11లో



మర్రి రాజశేఖర్‌రెడ్డి

17న కాంగ్రెస్‌లోకి మైనంపల్లి

ఆయన వెళ్లాక మర్రి రాజశేఖర్‌రెడ్డి పేరు ప్రకటించే అవకాశం

నవతెలంగాణ-సిటీబ్యూరో

మల్కాజిగిరి నియోజకర్గంలో ఏం జరుగుతోంది..? బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరు..? సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి దారెటు..? అనే ప్రశ్నలకు మరో వారం రోజుల్లో ఓ క్లారిటీ రానుంది. ఈ నెల 17వ తేదీన సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి కాంగ్రెస్‌లో చేరుతుండటంతో బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డికి లైన్ క్లియర్ కానుంది. త్వరలోనే బీఆర్ఎస్ అధిష్టానం రాజశేఖర్‌రెడ్డి పేరును ప్రకటించనున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే పలువురి పేర్లను పరిశీలించిన బీఆర్ఎస్ అధిష్టానం 'మర్రి' వైపే మొగ్గు చూపుతున్నట్టు విశ్వసనీయ సమాచారం.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రాజకీయం మొత్తం మల్కాజిగిరి నియోజకవర్గం చుట్టే తిరుగుతోంది. బీఆర్ఎస్ అదిష్టానం టికెట్లు కేటాయించటానికి ముందే సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మంత్రి హరీశ్‌రావుపై ఘాటు వ్యాఖ్యలు చేయడంతో మొదలైన వివాదం, చర్చ ఇప్పటి వరకు కొనసాగుతూనే ఉన్నాయి. మైనంపల్లి వ్యాఖ్యలు బీఆర్ఎస్‌లో దుమారం రేపడంతో ఆయన బీఆర్ఎస్‌ను వీడుతున్నట్టు సంకేతాలు అందాయి. తిరుమల దర్శనం తర్వాత హైదరాబాద్ చేరుకున్న మైనంపల్లి వారం, పది రోజుల్లో భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తానని చెప్పడంతో పార్టీ మారుతున్నాడనే విషయానికి ఊతం ఇచ్చినట్టయింది. దీంతో మల్కాజిగిరి సీటుపై బీఆర్ఎస్ ఆశావహులు కొందరు కన్నేశారు. బరిలోకి దిగేందుకు ఆసక్తి చూపుతూ అధిష్టానం పెద్దల వద్దకు చక్కర్లు కొడుతున్నారు.

'రాజశేఖర్‌రెడ్డి'వైపే అధిష్టానం మొగ్గు

బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి వైపే బీఆర్ఎస్ అధిష్టానం మొగ్గు చూపినట్టు సమాచారం. గతంలో ఎంపీగా పోటీ చేసిన అనుభవం ఉండటం, నియోజకవర్గంలో ప్రచారం చేయడం, దాదాపు నాలుగేండ్లకు పైగా ఏ పదవీ ఆశించకుండా ఉండటం, పదవి లేకపోయినా పార్టీ మారే ఆలోచన చేయకపోవడం లాంటి ...11లో



మైనంపల్లి హన్మంతరావు

నవతెలంగాణ

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.


అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

బుల్డోజర్ రాజ్యం!

ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై మూకుమ్మడి దాడి

అధినేత మాటే శిలాశాసనం

- ప్రతిపక్షాలకు విలువే లేదు
- అన్ని వ్యవస్థలూ నిర్వీర్యం



న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం 'బుల్డోజర్' దాడికి గురవుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే భారత రాజకీయాలలో ఇది బుల్డోజర్ శకం. అది ప్రజాస్వామ్యం, రాజ్యాంగం అనే భవనాల పునాదులను కూల్చేస్తోంది. ఆ సౌధాలు పూర్తిగా నేలమట్టమయ్యే వరకూ అది పని చేస్తూనే ఉంటుంది. దేశంలో బుల్డోజర్ పాలన వేగవంతంగా వ్యాప్తి చెందుతూ అనతికాలంలోనే అన్ని వ్యవస్థలనూ సర్వనాశనం చేస్తోంది. ఆ దాడికి సిద్ధపడేందుకు, స్పందించేందుకు ప్రతిపక్షాలకు కనీసం సమయం కూడా దొరకడం లేదు. సాధారణంగా యుద్ధ సమయాలలో శత్రు దేశాలపై ఇలాంటి వ్యూహాలనే అమలు చేస్తుంటారు. శత్రు దేశాలు కోలుకోలేని విధంగా ఒక్కసారిగా విరుచుకుపడతారు. ఆ సమయంలో శత్రువులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో పడిపోతారు. మన దేశంలో జరుగుతోంది కూడా ఇదే. మోడీ ప్రభుత్వం, బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు మూకుమ్మడిగా ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా తమ అజెండాను అమలు చేయడం ప్రారంభించాయి. ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) మొదలు కొని ఒకే దేశం...ఒకే ఎన్నిక నినాదం వరకూ ప్రభుత్వం తన అజెండాను అమలు చేసేందుకు కుయుక్తులు పన్నుతూనే ఉంది. ఐపీసీ, సీఆర్‌పీసీ స్థానంలో హిందూ కోడ్‌ను రుద్దేందుకు చేస్తున్న ప్రయత్నాలను కూడా ఈ కోణంలోనే చూడాల్సి ఉంటుంది. ఆర్ఎస్ఎస్, బీజేపీలు చాలా కాలం నుండి తమ చుట్టూ రాజకీయ గూడు అల్లుకుంటున్నాయి. ప్రతి పక్షాలను అందులో చిక్కుకుని విలవిలలాడేలా చేయాలని చూస్తున్నాయి.

ఏ అవకాశాన్నీ వదులుకోరు

సాధారణంగా బుల్డోజర్ ఒకే దశలో ప్రయాణించి అడ్డువచ్చిన దానిని కూల్చేస్తూ ముందుకు సాగుతుంది. కానీ రాజకీయ బుల్డోజర్ అలా కాదు. అది విభిన్న దిశలలో ప్రయాణిస్తూ సున్నితమైన రాజ్యాంగ, న్యాయపరమైన ఆలోచనలకు సమాధి కడుతుంది. జీ-20 సదస్సు గురించి విదేశాంగ మంత్రి జై శంకర్ మాట్లాడుతూ 'ఇది గ్లోబల్ శకం. దానిని ఎక్కడైనా ఉపయోగించుకోవచ్చు' అని వ్యాఖ్యానించారు. ప్రధాని మోడీ ఈ సమావేశాలను ఎలా ఉపయోగించుకుంటున్నారో చూడాలని సూచించారు. అది గతంలో దేశాన్ని పాలించిన ప్రభుత్వాలకు చేతకాలేదని కూడా చెప్పుకొచ్చారు.

పాత ఆయుధాలకే పదును

వాస్తవానికి ఒకే దేశం...ఒకే ఎన్నిక విధానం 2014లోనే బీజేపీ ఎన్నికల ప్రణాళికలో ఉంది. దేశంలోని మైనారిటీలపై ద్వేష భావనను వ్యాపింపజేసేందుకు ముందుకు తెచ్చిన యూసీసీ కూడా పాత ఆయుధమే.

ఫెడరల్ నిర్మాణమే లక్ష్యంగా...

ఒక విషయం మాత్రం సుస్పష్టం. ప్రజల అభిప్రాయాలతో పాలకులకు పని లేదు. వారు ఎలాంటి పెద్ద పెద్ద నిర్ణయాలనైనా ఎవరినీ సంప్రదించకుండానే తీసుకోగలరు. అంటే వ్యవస్థపై ప్రజల ఒత్తిడికి, వారి అభిప్రాయాలకు విలువే లేదు. ఇప్పుడు దేశంలో బుల్డోజరే రాజకీయ అజెండాను నిర్దేశిస్తోంది. ఇందులో ప్రజలకు సంబంధించిన విషయాలకు తావే లేదు. రాజ్యాంగంలో ప్రతిపక్షాల మాటకు, విమర్శలకు విలువ ఉంది. కానీ నేటి పాలకులకు ఆ దృష్టి లేదు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఫెడరల్ నిర్మాణాన్నే లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నారు. ఇది ఆందోళనకర, ప్రమాదకర పరిణామం అనడంలో ఎలాంటి సందేహం లేదు.

పాతబడి దుమ్ముకొట్టుకుపోయిన ఈ ఆయుధాలను లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తెర పైకి తేవడం విశేషం. ప్రజాస్వామ్య మౌలిక నిర్మాణాన్ని ధ్వంసం చేయడం ద్వారా రాచరిక వ్యవస్థను తిరిగి ప్రతిష్టిం చేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్ని స్తోంది. మరోవైపు దేశంలోని బహు భాషా సంస్కృతికి విఘాతం కలిగించి హిందీ, సంస్కృత భాషలను బలవంతంగా జనం పైన రుద్దే కుట్ర జరుగుతోంది. జాతీయ భాషగా హిందీకి ప్రాచుర్యం కలిగించడం, అనేక ప్రభుత్వ పథకాలకు సంస్కృత పేర్లు తగిలించడం ఇందులో భాగమే. జాగ్రత్తగా గమనిస్తే ఇందుకోసం చాలా కాలం నుండే కసరత్తు జరుగుతోందని అర్థమవుతుంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నుండే ఈ అంశాలన్నింటినీ దూకుడుగా ముందుకు తెస్తున్నారు.

ఆయన మాటే వేదం

తాజాగా ఇండియా వర్సెస్ భారత్ వివాదం దేశాన్ని కుదిపేస్తోంది. ఇండియా పేరునే చెరిపేసి భారత్ అని నామకరణం చేసేందుకు మోడీ ప్రభుత్వం తహతహలాడుతోంది. పాలకుడి మనసులో ఏముందో...పాలకుడి కోరిక ఏమిటో...దానినే ఆచరణలో పెట్టేందుకు వ్యవస్థ మొత్తం ఆతృత ప్రదర్శిస్తోంది. పాలకుడే సుప్రీం...ఆయన చెప్పిందే వేదం అన్న విధంగా అధికార యంత్రాంగం యావత్తూ వ్యవహరిస్తోంది. కొందరు నేతలు అత్యుత్సాహంతో అధినేత అజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధపడుతున్నారు. కళాకారులు, క్రీడాకారులు సైతం ఇందుకు తానా తందానా అంటున్నారు.

ప్రపంచ గమనం

మొరాకోలో భూకంపం
వేలాది మరణాలు

రాబట్: శుక్రవారం సాయంత్రం మొరాకోలో సంభవించిన భూకంపంలో వేలాది ముంది ప్రజలు మృతి చెందారు. అనేక వేలమంది గాయపడ్డారు. అధికారిక లెక్కల ప్రకారం 2012మంది చనిపోయారు. 2059మంది గాయపడ్డారు. వీరిలో 1404మంది పరిస్థితి విషమంగా ఉందని ప్రభుత్వం ప్రకటించింది. ప్రాథమిక అంచనాల ప్రకారం 269మంది మాత్రమే మరణించినట్టు ప్రకటించారు. అయితే ఈ సంఖ్య గంటగంటకూ పెరగటం మొదలయింది. చేరుకోవటానికి కష్టతరమైన మర్రాకేచ్‌కు దక్షిణానగల అట్లాస్ పర్వత శ్రేణుల్లో భకంపం కేంద్రీకృతం అవటంవల్ల ప్రాణ, ఆస్తి నష్ట పరిమాణాలు మరింతగా పెరిగే అవకాశం ఉంటుంది. మొరాకో రాజధాని రబట్‌లోను, మర్రాకేచ్ కాసాబ్లాంకా, అగదీర్, కనిట్రా వంటి ఇతర నగరాలలో కూడా ప్రకంపనలు వచ్చాయి. అనేకమంది ప్రజలు తమ ఆవాసాలను వదిలి రాత్రంతా రోడ్లపైనే ఉండి శిథిలాలను తొలగించటానికి సహాయపడ్డారు. సోషల్ మీడియాలో షేర్ చేసిన విడియోలను బట్టి చూస్తే వేలాది భవనాలు పాక్షికంగానో, పూర్తిగానో దెబ్బతిన్నాయి.

మర్రాకేచ్ పాత నగరంలోని జెమా ఎల్ ఫ్నా స్క్వేర్ ప్రాంతంలో ఒక మసీదు, ఒక యునెస్కో వరల్డ్ హెరిటేజ్ నిర్మాణం, అనేక చారిత్రక భవనాలు దెబ్బతిన్నాయి. ప్రకంపనలు రాగానే ప్రజలు తమ నివాస ప్రాంతాలను వీడి పారిపోతున్న దృశ్యాలు కూడా విడియోలలో కనపడుతున్నాయి. మొరాకో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ జియోఫిజిక్స్ భూకంపాన్ని కొలిచి 7.0 స్థాయిదని తేల్చింది. ఈ భూకంపం కేంద్రకం అల్ హౌజ్ రాష్ట్రంలో ఉందని పేర్కొంది.

జి-20లో ఆఫ్రికన్ యూనియన్‌కు శాశ్వత సభ్యత్వం

న్యూఢిల్లీ: ప్రపంచ ప్రముఖ ఆర్థిక వ్యవస్థల గ్రూపు జి-20లో ఆఫ్రికన్ యూనియన్(ఏయు)కు శాశ్వత సభ్యత్వం ఇవ్వటం జరిగింది. అంటే ఇకపైన జి-20 గ్రూపు జి-21గా మారిందన్నమాట. ఇందుకు సంబంధించిన ప్రకటనను భారత ప్రధాని నరేంద్ర మోడీ జి-20 శిఖరాగ్ర సమావేశంలో ప్రకటించాడు. ఇంతకు ముందు యూరోపియన్ యూనియన్ కి మాత్రమే శాశ్వత సభ్యత్వం ఉండేది. ఇప్పుడు యూరోపియన్ తోపాటు ఆఫ్రికన్ యూనియన్ కు కూడా జి-20లో శాశ్వత సభ్యత్వం లభించింది. ఆఫ్రికా యూనియన్ కు శాశ్వత సభ్యత్వం రాకముునుపు ఈ గ్రూపును 'ఆహ్వానించబడిన అంతర్జాతీయ సంస్థ' అని పిలిచేవారు.

'అందరి ఆమోదంతో నేను ఆఫ్రికన్ యూనియన్ అధినేతను శాశ్వత సభ్యులుగా తమ ఆసనాన్ని అధిష్టించవలసినదిగా కోరుతున్నాను' అని భారత ప్రధాని నరేంద్ర మోడీ తన ప్రారంభ ఉపన్యాసంలో ప్రకటించాడు. ఆ తరువాత ఆఫ్రికన్ యూనియన్ అధినేత అజలి అస్సౌమని ప్రపంచ నాయకుల సరసన ఆశీనుడయ్యాడు. 1999లో ఉనికిలోకి వచ్చిన ఆఫ్రికన్ యూనియన్ లో 55ఆఫ్రికా దేశాలు ఉన్నాయి. ఆఫ్రికన్ యూనియన్ యావత్ ఆఫ్రికా ఖండానికి ప్రాతినిధ్యంవహిస్తోంది. ఆఫ్రికన్ యూనియన్ లోని సభ్య దేశాలు సమిష్టిగా రాజకీయ, ఆర్థిక నిర్ణయాలు తీసుకుంటాయి. వలసవాద అవశేషాలను, వర్ణ వివక్షను అంతంచేయటమేకాకుండా సభ్యదేశాల మధ్య ఐక్యతను, సంఘీబావాన్ని పెంపొందించే లక్ష్యంతో ఆఫ్రికన్ యూనియన్ పనిచేస్తుంది. ఆఫ్రికా ఖండం నుంచి జి-20లో గతంలో ఒక్క దక్షిణ ఆఫ్రికా మాత్రమే సభ్యదేశంగా ఉండేది.

జి-20గ్రూపులో ఆఫ్రికన్ యూనియన్ సభ్యత్వం తీసుకోవాలనే ఆలోచనను మొట్టమొదటిసారిగా సెనెగలీస్ అధ్యక్షుడు మాస్కీ సాల్ 2022 సెప్టెంబర్ లో ఐక్యరాజ్య సమితి సాధారణ అసెంబ్లీలో సమర్థించాడు. 140కోట్ల ఆఫ్రికన్లు ప్రభావితమయ్యే నిర్ణయాల్లో అంతిమంగా ఆఫ్రికాకు ప్రాతినిధ్యం లభించనున్నదని ఆయన అన్నాడు.

జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని...

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొంటారని తెలిపారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో జాతీయ పతాకాలు ఎగురేయాలని చెప్పారు. వేడుకల్లో ప్రజల్ని భాగస్వాముల్ని చేస్తూ, గడిచిన పదేండ్లలో ప్రభుత్వం సాధించిన ప్రగతిని వారికి వివరించాలన్నారు. కొన్ని పార్టీలు దీన్ని కూడా రాజకీయాలు చేస్తూ కుట్రలు చేస్తున్నాయనీ, మతాన్ని జోడించి సమాజంలో చిచ్చుపెట్టే విచ్ఛిన్నకర శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

హిందూ సాహిత్యంలో బీజేపీ అనుసరిస్తున్న
హిందూ ఎక్కడా లేదు

పారిస్‌లో విద్యావేత్తలు, విద్యార్థులతో ముఖాముఖిలో రాహుల్



పారిస్ : హిందూ సాహిత్యంలో బీజేపీ అనుసరిస్తున్న 'హిందూ' ఎక్కడా లేదని కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ విమర్శించారు. ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవాలన్నదే బీజేపీ విధానమని అన్నారు. శనివారం పారిస్‌లో విద్యావేత్తలు, విద్యార్థులతో ముఖాముఖీ చర్చలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను రాహుల్ ట్వీట్ చేశారు. 'భారతదేశ యొక్క ఆత్మ' కోసం పోరాడటానికి ప్రతిపక్షాలు కట్టుబడి ఉన్నాయని, దేశం 'ప్రస్తుత అల్లకల్లోలం' నుంచి సమర్థవంతంగా బయటపడుతుందని' రాహుల్ తెలిపారు. 'నేను గీత చదివాను, ఎన్నో ఉపనిషత్తులు చదివాను, ఎన్నో హిందూ పుస్తకాలు చదివాను కానీ.. బీజేపీ చెబుతున్న 'హిందూ' వాటిల్లో లేదు' అని అన్నారు. 'మీ కంటే బలహీనమైన వ్యక్తులను భయభ్రాంతులకు గురిచేయాలని, హాని చేయాలని నేను హిందూ పుస్తకాల్లో ఎక్కడా చదవలేదు, ఏ హిందూ పండితుడి వద్ద వినలేదు. కాబట్టి బీజేపీ చేస్తున్నది హిందూ కాదు. వారు హిందూ జాతీయవాదులు కాదు. వారికి హిందూ మతంతో సంబంధం లేదు. వారు ఎంతటి మూల్యానికైనా అధికారాన్ని పొందేందుకు సిద్ధంగా ఉన్నారు. అధికారం కోసం వారు ఏదైనా చేస్తారు' అని అన్నారు.గత ఎన్నికల్లో దేశంలోని ఓటర్లల్లో 60 శాతం మంది ప్రతిపక్ష పార్టీలకు ఓటేయగా, కేవలం 40 శాతం మంది అధికార పార్టీకి ఓటు వేశారని రాహుల్ గుర్తు చేశారు. 'కాబట్టి మెజారిటీ కమ్యూనిటీ బీజేపీకి ఓటు వేస్తోందనేది తప్పుడు ఆలోచన' అని రాహుల్ స్పష్టం చేశారు. ప్రస్తుతం రాహుల్ గాంధీ యూరప్ పర్యటనలో ఉన్నారు. ఇప్పటికే యూరోపియన్ పార్లమెంట్ సభ్యులతో సంభాషించారు. పారిస్ పర్యటనకు ముందు బ్రస్సెల్స్‌లో మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

ద్యుతీచంద్‌కు ప్రభుత్వ సాయం నిల్

- ప్యారిస్ ఒలంపిక్స్‌లో పాల్గొంటా
- డోపింగ్ నుంచి బయటపడటమే నా లక్ష్యం
- ద్యుతీచంద్ స్పష్టీకరణ



న్యూఢిల్లీ : భారత పరుగుల రాణి ద్యుతీచంద్ ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నది. ప్రభుత్వం నుంచి కావాల్సిన సాయం కూడా అందటం లేదు. ద్యుతీచంద్‌ను గతంలో 'కాంతి'తో పోల్చిన మోడీ.. ఆమెకు కావాల్సిన ఆర్థిక సాయం మాత్రం అందించటం లేదని క్రీడా నిపుణులు, విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, ద్యుతీచంద్ ప్రస్తుతం డోపింగ్ ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ఈ ఆరోపణల నుంచి బయటపడటమే ప్రస్తుతం తన ముందున్న లక్ష్యమని ఆమె అన్నారు. 2024లో జరిగే ప్యారిస్ ఒలంపిక్స్ తర్వాత ద్యుతీచంద్ రిటైర్‌మెంట్‌కు సిద్ధమవుతున్నారు. ఈ ఒలంపిక్స్‌లో బంగారు పతకం సాధించటమే లక్ష్యమని ఆమె చెప్తున్నారు.

ద్యుతీచంద్.. 2018 ఆగస్టులో ఆసియా క్రీడల్లో వంద మీటర్ల పరుగు పందెంలో జాతీయ రికార్డు సృష్టించి రజతం పొందింది. అయితే, 2022లో నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ(నాడా).. ఆమె నిషేధిత పదార్థాలు తీసుకున్నదని నాలుగేండ్ల పాటు నిషేధం విధించింది. ఆమె ఈ నిషేధాన్ని స్విట్జర్లాండ్‌లోని లాసాన్‌లోని కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్‌లో సవాలు చేసి గెలవాలని యోచిస్తున్నది. " నా జీవితం ఇలాగే ఉన్నది. నేను నా దేశానికి పతకాలు తెచ్చాను. కష్టపడి పని చేశాను" అని ద్యుతీ తెలిపింది. దేశం కోసం ఎంతో పాటుపడిన ద్యుతీకి ప్రభుత్వం సాయమందించాలని క్రీడానిపుణులు అన్నారు.

సీబీఐ కేసుల్లో వాంగ్మూలాల నమోదుకు మేజిస్ట్రేట్‌ల నియామకం

ఇంఫాల్ : మణిపూర్‌లో జాతి హింసకు సంబంధించి సీబీఐ విచారిస్తున్న 27 కేసుల్లో సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసేందుకు మణిపూర్ హైకోర్టు 13 మంది మేజిస్ట్రేట్‌లను నియమించింది. మణిపూర్ రాష్ట్రంలోని మొత్తం పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని, వారి ప్రాదేశిక అధికార పరిధితో సంబంధం లేకుండా వారు(మేజిస్ట్రేట్‌లు) స్టేట్‌మెంట్‌లను రికార్డ్ చేస్తారని హైకోర్టు వివరించింది. ఆగస్టు 25న సుప్రీంకోర్టు వెలువరించిన ఆదేశాలకు అనుగుణంగానే హైకోర్టు తాజా నోటిఫికేషన్ వెలువడింది. సీబీఐ కేసుల్లో తమ పనిని ఎలా ప్రారంభించాలనే దానిపై మణిపూర్ హైకోర్టు నుంచి తదుపరి సూచనల కోసం వేచి ఉండటంతో పాటు, ఈ న్యాయమూర్తులు స్థానికంగా దర్యాప్తు చేస్తున్న 6,000 కేసులలో కూడా సెక్షన్ 164 ప్రకారం స్టేట్‌మెంట్‌లను నమోదు చేయడంలో పెద్దగా పురోగతి లేదని కోర్టు పేర్కొన్నది.

శాంతి కోసం ఐక్యంగా పని చేయండి
లేదా రాజీనామా చేయండి

కుకీ-జో ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి అల్లుడి హుకుం



ఇంఫాల్ : మణిపూర్‌లో శాంతి కోసం ఐక్యంగా పని చేయాలని పది మంది కుకీ-జో ఎమ్మెల్యేలను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ అల్లుడు, అధికార బీజేపీ ఎమ్మెల్యే రాజ్‌కుమార్ ఇమో సింగ్ కోరారు. రాష్ట్రం నుంచి విడిపోవాలనే తమ డిమాండ్‌ను ముందుకు తీసుకురావాలంటే మాత్రం వారు తమ పదవులకు రాజీనామా చేయాలని పేర్కొన్నారు.

ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. గతంలో కాంగ్రెస్‌లో ఉన్న రాజ్‌కుమార్ ఇమో సింగ్.. 2021లో బీజేపీలో చేరారు. ప్రస్తుతం ఆయన పోస్టు రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. కాగా, రాష్ట్రంలోని 10 మంది కుకీ-జో ఎమ్మెల్యేలలో ఏడుగురు బీజేపీ ఎమ్మెల్యేలే కావటం గమనార్హం. వారిలో ఇద్దరు మంత్రులు ఉన్నారు. రాష్ట్రంలో జాతుల మధ్య హింస చెలరేగిన అనంతరం ఈ 10 మంది కుకీ-జో ఎమ్మెల్యేలు ఇంఫాల్‌కు దూరంగా ఉన్నారు. రాష్ట్రంలో మే 3న చెలరేగిన హింస ఇప్పటికీ కొనసాగుతున్నది. దాదాపు నాలుగు నెలలకు పైగా రాష్ట్రంలో అశాంతి కొనసాగుతున్నది. ఇప్పటి వరకు కనీసం 179 మంది మరణించారు. 67 వేల మందికి పైగా నిరాశ్రయులయ్యారు.

మహిళా సాధికారతకు పెద్ద పీట

డిజిటల్ కార్యకలాపాలలో మహిళలకు మరింత భాగస్వామ్యం

- డిక్లరేషన్‌ను ఆమోదించిన జీ-20 సదస్సు



న్యూఢిల్లీ : మహిళా సాధికారతకు పెద్ద పీట వేయాలని జీ-20 సదస్సు నిర్ణయించింది. వేతన వ్యత్యాసాలు, లైంగిక హింస, ఉద్యోగావకాశాలు, ఆహార భద్రత వంటి విషయాలలో చొరవ తీసుకోవాలని, ముఖ్యంగా డిజిటల్ కార్యకలాపాలలో మహిళలు అధిక సంఖ్యలో భాగస్వాములయ్యేలా చూడాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సదస్సు చివరి రోజైన జీ-20 దేశాధినేతలు డిక్లరేషన్‌ను ఆమోదించారు.

జీ-20 దేశాలలోని మహిళా మంత్రిత్వ శాఖలకు బాసటగా నిలిచేందుకు మహిళా సాధికారతపై కొత్తగా కార్యాచరణ బృందాన్ని ఏర్పాటు చేయాలని డిక్లరేషన్‌లో తీర్మానించారు. బ్రెజిల్‌లో జరిగే తదుపరి జీ-20 దేశాల సదస్సులో ఈ కార్యాచరణ బృందం తొలి సమావేశాన్ని నిర్వహిస్తుంది. ప్రస్తుతం డిజిటల్ కార్యకలాపాలను మహిళలతో పోలిస్తే పురుషులే ఎక్కువగా నిర్వహిస్తున్నారు. ఈ వ్యత్యాసాన్ని తొలగించి, మహిళలు కూడా ఆ కార్యకలాపాలలో క్రియాశీలకంగా పాల్గొనేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సదస్సు నిర్ణయించింది. 2030 నాటికి డిజిటల్ కార్యకలాపాలలో మహిళలు, పురుషుల మధ్య వ్యత్యాసాలను సాధ్యమైనంత వరకూ తగ్గించాలని సదస్సులో తీర్మానించారు. డిజిటల్ కార్యకలాపాల నిర్వహణలో మహిళలకు ఎదురవుతున్న అడ్డంకులను తొలగించాలని, అందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని వారికి అందించాలని, మహిళలకు డిజిటల్ కార్యకలాపాలు అందుబాటు ధరలో ఉండేలా చూడాలని సదస్సు తీర్మానించింది. డిజిటల్ అక్షరాస్యత, నైపుణ్యాలను పెంచడం సహా జాతీయ డిజిటల్ వ్యూహాల రూపకల్పన, అమలులో మహిళలు, బాలికలు మరింత క్రియాశీలకంగా పాల్గొనేందుకు అవసరమైన విధానాలను రూపొందించాలని ప్రతిపాదించారు.

డిజిటలీకరణ ప్రక్రియలో భద్రతాపరంగా మహిళలు, బాలికలకు ఎదురయ్యే ముప్పును సదస్సు గుర్తించింది. ఆయా సమస్యలను గుర్తించి, వాటిని తొలగించాలని డిక్లరేషన్ ప్రతిపాదించింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతుల ద్వారా మహిళలను కించపరిచే ప్రయత్నాలు జరగవచ్చునని, డిజిటల్ సాధనాలు, సాంకేతిక పరిజ్ఞానాలలో సురక్షితమైన విధానాలను రూపొందించుకొని వీటిని నివారించవచ్చునని అభిప్రాయపడింది. ముఖ్యంగా మహిళల నేతృత్వంలో, వారి యాజమాన్యంలోని వ్యాపారాలలో వివక్షకు తావులేని డిజిటల్ ఎకానమీని ఆచరణలో పెట్టాలని తీర్మానించింది.

మహిళలు, బాలికలపై వాతావరణ మార్పులు, జీవ వైవిధ్య నష్టాలు, కాలుష్యం వంటివి చూపే ప్రభావాన్ని జీ-20 సదస్సు గుర్తించింది. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు మహిళల భాగస్వామ్యం, నిర్ణయాలు తీసుకోవడంలో వారి ప్రమేయం, నాయకత్వ లక్షణాలను మరింతగా పెంచాలని నిర్ణయించింది. పర్యావరణానికి సంబంధించిన విషయాలలో నష్టాన్ని తగ్గించే వ్యూహాలను, విధానాలను రూపొందించుకోవాలని జీ-20 సదస్సు తీర్మానించింది.

వ్యవసాయ, ఆహార రంగాలలో పెట్టుబడులు పెంచాల్సిన అవసరం ఉన్నదని సదస్సు అభిప్రాయపడింది. పాఠశాల విద్యార్థులకు సురక్షితమైన, పోషక విలువలతో కూడిన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. మహిళా రైతులు చేపట్టే ఆధునిక పద్ధతులను ప్రోత్సహించాలని తీర్మానించింది. డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి కేంద్రీకరించి బాలికలకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించింది. మహిళలకు మరిన్ని ఉద్యోగావకాశాలు కల్పించాలని, వేతనాల చెల్లింపులో పురుషులు, మహిళల మధ్య వ్యత్యాసాన్ని తగ్గించాలని జీ-20 సదస్సు తీర్మానించింది.

అందరికీ ఆహార భద్రత... పోషకాహారం

జీ-20 దేశాధినేతల తీర్మానం

న్యూఢిల్లీ : ఆకలిని, పోషకాహార లోపాన్ని పాలద్రోలే విషయంలో దృఢ చిత్తంతో ఉన్నామని జీ-20 దేశాధినేతలు స్పష్టం చేశారు. ఆహారం, ఇంధనం సహా నిత్యావసరాల ధరలు పెరగడంతో ప్రజల జీవన ప్రమాణాలపై ఒత్తిడి ఏర్పడుతోందని అంటూ ప్రపంచ వ్యాప్తంగా అందరికీ ఆహార భద్రత కల్పించేందుకు, పోషకాహారాన్ని అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఈ మేరకు ముగిసిన జీ-20 సదస్సులో డిక్లరేషన్ ఆమోదించారు. పేదరికం, అసమానతలు, వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు, ఘర్షణలు వంటి పరిణామాలు మహిళలు, చిన్నారులపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయని డిక్లరేషన్ అభిప్రాయపడింది.

'ఉక్రెయిన్ యుద్ధం, దాని ప్రభావం కారణంగా ప్రజలు ఎన్నో అవస్థలు పడుతున్నారు. ఆహార, ఇంధన భద్రతకు ముప్పు వాటిల్లింది. సరఫరాలు నిలిచిపోయాయి. ఆర్థిక అస్థిరత ఏర్పడింది. ద్రవ్యోల్బణం పెరిగింది. అభివృద్ధి నిలిచిపోయింది. ఈ పరిణామాలు సభ్య దేశాలలో విధానపరమైన వాతావరణాన్ని సంక్లిష్టం చేశాయి. ముఖ్యంగా కోవిడ్ మిగిల్చిన నష్టాల నుండి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న వర్థమాన, పేద దేశాలపై ఎక్కువగా ప్రభావం పడింది. ఆర్థిక విధ్వంసం అభివృద్ధిని కుంటుపరచింది' అని డిక్లరేషన్ వివరించింది. రష్యా ఆహార ఉత్పత్తులు, ఎరువులు ప్రపంచ మార్కెట్‌కి చేరడంలో తుర్కియే, ఐరాస మధ్యవర్తిత్వంలో కుదిరిన ఒప్పందాలు చేసిన కృషిని కొనియాడింది. ఉక్రెయిన్ నుండి ఆహారధాన్యాలు సురక్షితంగా రవాణా అయ్యేందుకు కూడా ఈ ఒప్పందాలు ఉపకరించాయని తెలిపింది. రష్యా, ఉక్రెయిన్‌ల నుండి ఆహార ధాన్యాలు, ఆహార పదార్థాలు, ఎరువులు వంటివి పూర్తి స్థాయిలో, సకాలంలో సరఫరా జరగడంతో వర్థమాన దేశాలు, ఆఫ్రికా వంటి పేద దేశాల అవసరాలు తీరాయని వివరించింది.

అందరికీ ఆహార భద్రత, పోషకాహారం అందించేందుకు జీ-20 సదస్సు ఆరు సూత్రాల కార్యక్రమాన్ని రూపొందించింది. ప్రతికూల వాతావరణాన్ని తట్టుకొనే, పోషకాహారాన్ని అందించే పంటలపై పరిశోధనల్లో సహకారాన్ని మరింత పటిష్టపరచుకోవాలని పిలుపునిచ్చింది. స్థానికంగా ఎరువుల ఉత్పత్తిని పెంచాలని, భూ ఆరోగ్యాన్ని మెరుగుపరచాలని సూచించింది. వ్యవసాయ ఉత్పాదకతను పెంచి ఆహార నష్టాన్ని, వృథాను తగ్గించేందుకు ఆధునీకరణ పద్ధతులు, పెట్టుబడులపై దృష్టి సారించాలని అభిప్రాయపడింది. ఆహార భద్రతా సవాళ్లను ఎదుర్కోవడంలో వర్థమాన దేశాలకు చేయూత అందించాలని నిర్ణయించింది.

ఆహార, ఇంధన ధరలు గరిష్ఠ స్థాయి నుండి పడిపోవడంతో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో అస్థిరత ఏర్పడిందని జీ-20 సదస్సు తెలిపింది. ఈ సంవత్సరాంతానికి వ్యవసాయాభివృద్ధి వనరుల కోసం అంతర్జాతీయ నిధిని పరిపుష్టం చేయాలని నిర్ణయించింది.

రజాకార్ల రాక్షసకాండకు పరాకాష్ట

గుండ్రాంపల్లి దురంతాలు





నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నైజాం పోలీసుల, రజాకారు మూకల అరాచకాలను ప్రతిఘటించి చరిత్రలో తన స్థానాన్ని పదిలిపర్చుకుంది చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి గ్రామం. ఖాసీం రజ్వీ నాయకత్వంలోని రజాకారు మూకలు ఇక్కడ క్యాంపు పెట్టి ఈ ప్రాంత ప్రజలను తీవ్రమైన ఇబ్బందులకు గురి చేశాయి. ఆ క్యాంపుపై కమ్యూనిస్టు పార్టీ ప్రజా దళాలు దాడి చేసిన సంఘటనలను ఈ ప్రాంత ప్రజలు నేటికీ కథలు కథలుగా చెప్పుకుంటారు. రజాకార్ క్యాంపుకు సయ్యద్ మక్బూల్ అనే వాడు నాయకత్వం వహించేవాడు. గుండ్రాంపల్లిని కేంద్రంగా చేసుకుని చుట్టుపక్కల అనేక గ్రామాల్లో రజాకారు మూకలు అనేక దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతుండేవి. సూర్యాపేట తాలుకాలోని వర్ధమాను కోట గ్రామానికి చెందిన మక్బూల్ నిజాం సైన్యంలో పని చేస్తున్న సమయంలో భార్య చనిపోగా ముగ్గురు ...లతో గుండ్రాంపల్లిలో ఉన్న తన అక్క ఇంటికి 1938లో వచ్చాడు. ఆతర్వాత ఖాసీం రజ్వీ స్థాపించిన మజ్లిస్ ఇత్తెహదుల్ ముసల్మాన్ సంస్థలో మక్బూల్ చేరాడు. కొంత మందిని కూడగట్టి రజాకారు గుంపు ఏర్పాటు చేసి గ్రామాలపై పడి దోపిడీలకు దౌర్జన్యాలకు దిగుతుండేవాడు. గుండ్రాంపల్లి చుట్టు పక్కల అనేక గ్రామాల్లో ఈ రజాకారు మూకల దాడికి ప్రజలు ఊరొదిలి వెళ్లారు. గ్రామంలో గృహ నిర్మాణానికై ఇద్దరు నిండు గర్భిణీలను సజీవంగా పునాదిలోనే పాతిపెట్టించిన క్రూరుడు మక్బూల్. పరిసర గ్రామాల్లో మక్బూల్ మూక చేయని అరాచకాలు లేవని చెప్పవచ్చు.

తృటిలో తప్పించుకున్న కిరాతకుడు

అలాంటి మక్బూల్‌కు బుద్ధి చెప్పాలని కమ్యూనిస్టు పార్టీ గెరిల్లా దళాలు నిర్ణయించాయి. 1948 జూన్ 19వ తేదీన కోదండరామిరెడ్డి నాయకత్వాన పాటివానిగూడెం నుంచి పాలి లక్ష్మయ్య, పాలి ఎల్లయ్య, గుండ్రాంపల్లికి చెందిన కంకలి బక్కయ్య, పలివెల గుర్నాలు, పానగంటి ఎలమంద దళం మక్బూల్‌పై దాడి చేసింది. కానీ, చిన్న పొరపాటు మూలంగా మక్బూల్ తప్పించుకున్నాడు.

ఈ సంఘటన అనంతరం మక్బూల్ అరాచకాలకు అంతులేకుండా పోయింది. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలను తమ ఇష్టానుసారం రజాకారు మూకలు హత్యగావించి గుండ్రాంపల్లి మసీదు సమీపాన గల బావిలో వేసేవారు. తన అరాచకాలను వ్యతిరేకించినందుకు అమీర్ అలీ, మహబూబ్ అలీ, అబ్బాస్ అలీ, మదీన, బనిగి సాబ్‌లను హతమార్చడానికి మక్బూల్ ప్రయత్నించాడు. ఆ అరాచకాలు భరించలేక ముస్లింలయినప్పటికీ వారు మక్బూల్‌ను మట్టుబెట్టడానికి ప్రయత్నించారు.

గెరిల్లా దళాలకు భయపడి పరార్

గుండ్రాంపల్లి సమీపాన గల చిన్నకాపర్తి గ్రామానికి చెందిన పాశం పుల్లారెడ్డి రజాకార్లకు పూర్తి సహాయ సహకారాలందిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేసేవాడు. ఇది సహించలేని కోదండరామిరెడ్డి నాయకత్వంలోని గెరిల్లా దళం దాడి చేసి, పుల్లారెడ్డి తలనరికి గ్రామాల్లో ఊరేగింపుగా తీసుకొచ్చి గుండ్రాంపల్లి రహదారి బంగ్లాకు వేలాడదీసి వెళ్లారు. దీనికి భయపడిన మక్బూల్ రాత్రికి రాత్రే గుండ్రాంపల్లి నుంచి సొమ్మును తీసుకుని పరారయ్యాడు. మక్బూల్ పారిపోయిన విషయం తెలిసిన గ్రామస్థులంతా మక్బూల్‌పై కోపంతో వాడున్న ఇంటిని నేలమట్టం చేశారు. వెలిమినేడు గ్రామానికి చెందిన గడ్డం రామయ్య, సప్పిడి రామయ్య మక్బూల్‌కు తోడ్పడే వారు. ఆ కిరాతకులను గ్రామస్థులే చంపేశారు. మక్బూల్ వివిధ గ్రామాల నుంచి సుమారు 200 మంది వరకు తనను ఎదురించిన వారిని తెచ్చి హతమార్చి బావిలో వేశాడు. ఇలా హత్య చేయబడిన వారిలో కేవలం 26 మందిని మాత్రమే గుర్తించగలిగారు. మిగతా వారిని గుర్తించలేక పోయారు. ఈ అమరవీరుల పేరు మీద 1993 జూన్ 4వ తేదీన అక్కడ స్మారక స్థూపాన్ని ఆవిష్కరించారు.

22న కల్లుగీత కార్మికుల మహాధర్నా

- పోస్టర్ ఆవిష్కరణ
- కల్లుగీత కార్మిక సంఘం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 22న హైదరాబాద్‌లోని గీత కార్మికుల మహాధర్నా నిర్వహించనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పోస్టర్‌ను అవిష్కరించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారనీ, తాళ్లు ఎక్కే క్రమంలో ప్రమాదం జరిగి వందలాదిమంది చనిపోతున్నారని తెలిపారు. కాళ్ళు, చేతులు విరిగి విగతజీవులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజులకు ఒకరిచొప్పున చనిపోతున్నారని తెలిపారు. ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలనీ, సేఫ్టి మోకులు ఇవ్వాలనీ, ద్విచక్ర వాహనాలు అందజేయాలని పలు సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చినా ఫలితం లేకుండా పోతుందని విమర్శించారు. 2023- 24 బడ్జెట్‌లో గీత కార్మికులకు కేటాయించిన డబ్బులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 22 న జరిగే మహాధర్నాకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో గోప రాష్ట్ర ఉపాధ్యక్షులు ముద్దగొని రామ్మోహన్ గౌడ్, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, కేజీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. వెంకట నరసయ్య, కార్యదర్శి బూడిద గోపి, గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ యం. కృష్ణ స్వామి, సీనియర్ నాయకులు అబ్బ గాని బిక్షం, పొన్నం రాజయ్య, సీహెచ్ రమేష్ పాల్గొన్నారు.

చంద్రబాబుకు రిమాండ్

(మొదటిపేజీ తరువాయి)

వచ్చినప్పటినుంచి మొదలైన ఉత్కంఠ ఆదివారం సాయంత్రం ఏడు గంటలకు వీడింది. రాత్రి తొమ్మిదిన్నర గంటల సమయంలో విజయవాడ కోర్టు నుండి రాజమండ్రికి పటిష్ట భద్రత మధ్య తరలించారు. రిమాండు వార్త తెలిసిన వెంటనే సోమవారం నాడు రాష్ట్ర బంద్ నిర్వహించాలని ఏపీ టీడీపీ పిలుపునిచ్చింది. దీనికి జనసేన మద్దతు ప్రకటించింది. సీపీఐ సంఘీభావం తెలిపింది. శనివారంనాడు మొదలైన టీడీపీ శ్రేణుల నిరసనలు ఆదివారం రాత్రి కూడా కొనసాగాయి. కోర్టు తీర్పు వెలువడ్డాక ఎకడికక్కడ రాస్తారోకోలు, ముఖ్యమంత్రి దిష్టిబొమ్మలు దహనం వంటివి జరిగాయి. మరోవైపు వైసిపి కార్యకర్తలు టపాసులు పేల్చి, స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్ విధించినట్టు వార్తలు వచ్చినా డీజీపీ కార్యాలయం తాము అటువంటి ఆదేశాలు ఇవ్వలేదని తెలిపింది. జిల్లా అధికారులు ఎక్కడికక్కడ నిర్ణయం తీసుకుంటారని పేర్కొంది. తీర్పు నేపథ్యంలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు అప్రమత్తమయ్యారు,

చంద్రబాబు నాయుడు తరపున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదించగా, ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకరరెడ్డి వాదనలు వినిపించారు. ఈ నెల 22వ తేదీ వరకూ జ్యుడీషియల్ రిమాండు విధించిన న్యాయమూర్తి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించాలని ఆదేశించడంతో అప్పటికే పోలీసులు రెండు కాన్వాయ్‌లను సిద్ధం చేసి ఉంచారు. అయితే తీర్పు ఇచ్చిన వెంటనే చంద్రబాబు తరపు న్యాయవాదులు బెయిల్ పిటీషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం ఆయనకు 73 సంవత్సరాలని, మధుమేహం, రక్తపోటుతో బాధపడుతున్నారని, అదుపులోకి తీసుకున్నప్పటి నుంచి తీర్పు ఇచ్చే వరకూ సుమారు 36 గంటలపాటు నిద్ర కూడా లేదని, మాజీ ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తి అలాగే కూర్చుండిపోయారని, ఆయన ఆరోగ్య పరిస్థితి రీత్యా బెయిల్ ఇవ్వాలని, లేదా హౌస్ అరెస్టుకు అవకాశం ఇవ్వాలని, ఎన్ఎస్‌జీ భద్రతలో ఉన్న నేపథ్యంలో ఈ అంశాన్ని పరిశీలించాలని న్యాయమూర్తిని కోరారు. సాధ్యంకాని పక్షంలో జైలులో సౌకర్యాలు ఉండే గది కేటాయించాలనీ మరోపిటీషన్ దాఖలు చేశారు. తీర్పు అనంతరం కోర్టుకు చేరుకున్న చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి కంటతడి పెట్టుకున్నారు. కోర్టులోనే లోకేష్ కూడా కొంత ఉద్విగ్నతకు లోనయ్యారు. ఏపీలో అవినీతి ఆరోపణలతో రిమాండుకు గురైన తొలి మాజీ సీఎం చంద్రబాబే.

కస్టడీకి ఇవ్వాలని సీఐడీ పిటీషన్

చంద్రబాబుకు జ్యుడీషియల్ రిమాండు విధించిన వెంటనే ఆయనను పోలీసు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ ఏపీ ఏసీబీ కోర్టులో సీఐడీ తరపు న్యాయవాదులు పిటీషన్ దాఖలు చేశారు. పిటీషన్‌ను పరిశీలించిన న్యాయమూర్తి సోమవారం దీనిపై విచారణ జరుపుతామని తెలిపారు. అలాగే కౌంటర్ దాఖలు చేయాలనీ సూచించారు.

నేడు బంద్‌కు ఏపీ టీడీపీ పిలుపు

చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా ఏపీ టీడీపీ సోమవారం రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చింది. చంద్రబాబు అక్రమ అరెస్టు, ఆ సందర్భంలో నిరసన తెలిపిన పార్టీ శ్రేణులపై జరిగిన పోలీసు దమనకాండ, జగన్ కక్షపూరిత రాజకీయాలకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా బంద్ చేపట్టాలని నిర్ణయించామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్య రక్షణ కోసం జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్యవాదులందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

రాజమహేంద్రవరంలో పోలీసుల హై అలర్ట్

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు. టీడీపీ అధినేత చంద్రబాబును రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలిస్తుండడంతో ఉత్కంఠ నెలకొంది. నగరంలో 37 చోట్ల పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు. సెంట్రల్ జైల్ రోడ్డును మూడు కిలోమీటర్ల మేర బ్లాక్ చేశారు. నగరంలోని టీడీపీ ముఖ్య నాయకులందరినీ గృహ నిర్బంధం చేశారు. నంద్యాలలో మాదిరిగా ఘర్షణలు జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నారు. నగరం మొత్తం పోలీసులు మోహరించారు.

మరోసారి రక్తసిక్తమైన జాతీయ రహదారి

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఉపాధ్యాయులు మృతి

నవతెలంగాణ నార్సింగి

మెదక్ జిల్లా నార్సింగి మండలంలోని జాతీయ రహదారి 44 మరోసారి రక్తసిక్తమయింది. ఎలాంటి సూచికలు లేకుండా మరమ్మతు కోసం నిలిపిన లారీని అతివేగంగా వచ్చిన కారు ఢీ కొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. నార్సింగి ఎస్ఐ అహ్మద్ మోహీమూద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట్ మండలం నార్లాపూర్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు పెంటపర్తి బాబురెడ్డి(62) ఆదివారం సాయంత్రం జరగబోయే తన కొడుకు వివాహ రిసెప్షన్ ఏర్పాట్లకు అతని బంధువులు, ఉపాధ్యాయులు దోమకొండ మండలం అంబర్‌పేట్ గ్రామానికి చెందిన సరికొండ లింగారెడ్డి(50), సిద్దిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన ముత్యాల వెంకటరమణ రెడ్డి (56)ని వెంట తీసుకుని తన కారులో చేగుంట నుంచి రామాయంపేటకు బయలుదేరారు. రాజస్థాన్‌కు చెందిన లారీ కోడూరు నుంచి బొప్పాయి పండ్లను నింపుకుని ఢిల్లీకి బయలుదేరగా.. మార్గమధ్యలో మండలంలోని జప్తి శివనూర్ వద్ద జాతీయ రహదారి-44పై చెడిపోయిపోవడంతో మరమ్మతు కోసం ఎలాంటి సూచికలు ఏర్పాటు చేయకుండా రోడ్డుపైనే నిలిపారు. మధ్యాహ్నం 3.30 ప్రాంతంలో అతివేగంగా తన కారును నడిపిస్తున్న బాబురెడ్డి నిలిపి ఉంచిన లారీని గమనించక వెనుక వైపు నుంచి ఢీ కొట్టాడు. దాంతో కారు.. లారీ వెనుక వైపు కిందకు చొచ్చుకుపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడు. ప్రమాద తీవ్రత వల్ల ముత్యాల వెంకటరమణారెడ్డి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. కొన ఊపిరితో ఉన్న లింగారెడ్డి, తీవ్రంగా గాయపడిన బాబురెడ్డిను వెంటనే అంబులెన్స్‌లో రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లింగారెడ్డి ఆస్పత్రిలో ప్రాణాలు వదిలాడు. బాబురెడ్డిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ అహ్మద్ మోహీయుద్దీన్ తెలిపారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో జనసేవాదళ్

- సంఘపరివార్ శక్తులు రెచ్చిపోతున్నాయి : జాతీయస్థాయి శిక్షణా శిబిరాన్ని ప్రారంభించిన సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ



నవతెలంగాణ-ఖమ్మం

ప్రజాస్వామ్య పరిరక్షణ, మతోన్మాద శక్తులను నిలువరించాలంటే జనసేవాదళ్ కార్యకర్తలు ముందు వరుసలో నిలవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మంలో సీపీఐ జనసేవాదళ్ జాతీయ శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జన సేవాదళ్ కార్యకర్తలతో కలిసి పెరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాన్యుల ఆస్తుల పరిరక్షణ, భూపోరాటాలు, మతోన్మాద శక్తులను ఎదుర్కొనేందుకు చండ్ర రాజేశ్వరరావు జన సేవాదళ్‌ను ఏర్పాటు చేశారని, నాలుగు దశాబ్దాల కాలంలో దేశవ్యాప్తంగా జనసేవాదళ్ చారిత్రక కార్యక్రమాలను నిర్వహించిందని తెలిపారు. దేశంలో జన సేవాదళ్ కార్యక్రమాలను విస్తరించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ సంస్థలు ప్రజల మధ్య మత చిచ్చును రేపుతున్నాయని, దాన్ని ఎదుర్కొనే సత్తా కమ్యూనిస్టు పార్టీ, జనసేవాదళ్ కార్యకర్తలకే ఉన్నదని తెలిపారు. కులం, మతం ప్రాతిపదికన బీజేపీ వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టాలని, మతశక్తులను నిలువరించాలంటే అంకింతభావంతో పాటు క్రమశిక్షణ అవసరమన్నారు. భూ పోరాటాల్లో ప్రజలకు అండగా నిలవాలని, ప్రజా ఆందోళనలో, ఉద్యమాలకు దండుగా నిలవాలని, ఆపదలో ఆదుకోవాలని, అదే జనసేవాదళ్ ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 100 ఏండ్లు పూర్తి కావస్తున్న సందర్భంగా 2024లో ఢిల్లీలో లక్ష మంది కవాత్ చేసే లక్ష్యంగా ఖమ్మంలో శిక్షణ ప్రారంభమైందన్నారు. జాతీయ స్థాయి శిక్షణ ముగిసిన తరువాత, రాష్ట్ర, జిల్లా మండల స్థాయిల్లో శిక్షణా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. 10 రోజుల పాటు జరిగే ఈ శిక్షణా కార్యక్రమానికి ఆతిథ్యమించిన ఖమ్మం జిల్లా సమితిని అభినందించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సహాయ కార్యదర్శి దండి సురేష్, కంట్రోల్ కమిషన్ చైర్మెన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితిసభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఎస్.కె. జానిమియా, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కరకుమార్, ఏఐఎస్ఎస్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శులు ఇటికాల రామకృష్ణ, నానబాల రామకృష్ణ, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు తాటి నిర్మల, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పగిడిపల్లి ఏసు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి బోడా వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ వైద్యానికి బాలుడు బలి

- ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యులు, బంధువుల ఆందోళన



నవతెలంగాణ - నాంపల్లి

ఓ ఆర్ఎంపీ డాక్టర్ చేసిన తెలిసి తెలియని వైద్యానికి ఓ బాలుని నిండు ప్రాణం బలయిన ఘటన నల్లగొండ జిల్లా నాంపల్లి మండలంలో ఆదివారం జరిగింది. మృతిచెందిన బాలుని కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి మండలం జాన్ తండా గ్రామపంచాయతీకి చెందిన సపావట్ రత్యా- సాలి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు జశ్వంత్(13) నాంపల్లి ఆదర్శ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నాడు. కాగా, జశ్వంత్‌కు జలుబు, దగ్గు ఉండటంతో రత్యా తండ్రి భీమ్లా జశ్వంత్‌ని వెంటబెట్టుకుని ఆదివారం ఉదయం సుమారు 9 గంటల సమయంలో నాంపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న శ్రీనివాస ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌కి తీసుకెళ్లాడు. దాంతో అక్కడ పనిచేస్తున్న డాక్టర్(ఆర్ఎంపీ) జశ్వంత్‌కు ఏదో ఇంజక్షన్ చేతి నరానికి ఇవ్వగా, బాలుడు క్షణాల్లోనే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. దాంతో డాక్టర్ భయపడి.. బాబుకు సీరియస్‌గా ఉందని, పెద్ద ఆస్పత్రికి తీసుకువెళ్లాలని అతనే.. కారు పిలిపించి చండూరు మండల కేంద్రంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ డాక్టర్ బాబును పరిశీలించి మృతి చెందాడని చెప్పడంతో.. వెంటనే ఆర్ఎంపీ పరారయ్యాడు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు, బంధువులు నాంపల్లి మండల కేంద్రంలోని శ్రీనివాస ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ముందు ఉంచి పెద్ద బంధువులతో కలిసి బస్టాండ్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఆర్ఎంపీ డాక్టర్‌ను వెంటనే అరెస్టు చేసి చనిపోయిన బాలుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని ఆందోళన చేస్తున్న వారిని సముదాయించి వారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాలుని మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు పోలీసులు చెప్పారు. మృతుని తండ్రి రత్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.లచ్చిరెడ్డి వెల్లడించారు. నాంపల్లి సీఐ అనంతుల నవీన్ కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

విద్యా రంగ పరిరక్షణ కోసం పోరాటాలు

- 29 అంశాలపై తీర్మానాల ఆమోదం
- జయప్రదంగా ముగిసిన ప్లీనరీ
- రాబోయే కాలంలో సమరశీల పోరాటాలు : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు





నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

విద్యా రంగ పరిరక్షణ, విద్యార్థుల సమస్యలపై పోరాటాలు నిర్వహించేందుకు భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించినట్టు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు తెలిపారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు ఆదివారం జయప్రదంగా ముగిశాయి. మూడో రోజు ప్రతినిధుల సభలో నాగరాజు మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు జరిగిన ప్లీనరీ సమావేశాలు విద్యా రంగానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించిన 29 తీర్మానాలను ఆమోదించినట్టు తెలిపారు. యూనివర్సిటీలు, సంక్షేమ, గురుకుల హాస్టళ్లు, ప్రభుత్వ స్కూల్స్ సమస్యలు, విద్యార్థినుల రక్షణ, ప్రయివేట్ విద్యా సంస్థల ఫీజుల నియంత్రణ, నూతన జాతీయ విద్యా విధానం రద్దు వంటి అంశాలపై చర్చించినట్టు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.5177 కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు చదువుల్ని మధ్యలోనే ఆపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా రాష్ట్రంలో ఉన్న సంక్షేమ హాస్టళ్ళ, గురుకులాల్లో నెలకొన్న సమస్యల్ని వెంటనే పరిష్కరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు ఓసీల్లోని పేద విద్యార్థులు చదువుతున్న హాస్టల్స్, గురుకుల విద్యార్థులకు పెంచిన మెస్ ఛార్జీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ మార్చిన మెనూ అమలు కావడంలేదన్నారు. కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడిని అరికట్టాలని, ప్రభుత్వం వెంటనే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేంద్రం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆ దిశగా నిర్ణయాలు చేయాలని, రాష్ట్రంలో ఎన్ఈపీని అమలు చేయకూడదని సూచించారు. విద్యారంగంలో ఎదురవుతున్న సమస్యలపై ఎస్ఎఫ్ఐ రాబోయే కాలంలో సమరశీలంగా ఉద్యమాలు నిర్వహించేలా భవిష్యత్ కర్తవ్యాల్ని రూపొందించినట్టు తెలిపారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతర పోరాటాలు చేస్తుందన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు మూడు రోజుల పాటు జయప్రదంగా నిర్వహించిన ఆహ్వాన సంఘం కృషిని అభినందించారు.

రాష్ట్ర కమిటీలో పనిచేసిన కొందరు రిలీవ్ కాగా ఉద్యమ అవసరాల రీత్యా కొత్తవారిని రాష్ట్ర కమిటీలోకి తీసుకోవడం జరిగిందన్నారు. సమావేశాల్లో రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, రాష్ట్ర నాయకులు పూజ, రజినీకాంత్, దాసరి ప్రశాంత్, సంతోష్, కిరణ్, అశోక్‌రెడ్డి, కమ్మంపాటి శంకర్, రాజు, నల్లవల్ల రమేష్, ఎర్రోళ్ల సతీష్, అరవింద్, సాక్షి, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట వీర వనిత చాకలి ఐలమ్మ

- ఆమె జీవితం నేటి యువతకు స్ఫూర్తి
- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్ కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ సాయుధ పోరాట వీర వనిత, తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటి చెప్పి, మహిళా లోకానికి స్ఫూర్తినిచ్చిన చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకమని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం చాకలి ఐలమ్మ 38వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన మంత్రుల నివాసంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, దోపిడీ, పీడన నుంచి విముక్తి కోసం జరిగిన ఆనాటి సాయుధ రైతాంగ పోరాటంలో దొరల గడీలను ఐలమ్మ గడగడలాడించిందని గుర్తు చేశారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తి యావత్ సమాజం ఎప్పటికీ మరువదని, ఆమె చూపిన మార్గంలో యువత ముందుకు సాగాలని వినోద్ కుమార్ పేర్కొన్నారు.

పోరాట దివిటి చిట్యాల ఐలమ్మ

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉద్యమ సాహసి, పోరాట దివిటి చిట్యాల ఐలమ్మ అని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో ఐలమ్మ 35వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఉపాధ్యక్షులు కేఎన్ ఆశాలతతో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లక్ష్మి మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన నిప్పు కణిక చాకలి ఐలమ్మ అని కొనియాడారు. కుల, మత ప్రాంతీయ విభేదాలకు అతీతంగా సాగినది తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమని చెప్పారు. పేదలకు 10 లక్షల ఎకరాలు పంచిన ఘనత ఆ పోరాటానికి దక్కిందని తెలిపారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తితో యువతి, యువకులు హక్కుల కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆమె ధైర్యం తెగువ మహిళా లోకానికి ఆదర్శనీయమన్నారు. అంతటి గొప్ప పోరాటానికి బీజేపీ , ఆర్ఎస్ఎస్ మతం రంగు పులుముతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బత్తుల హైమావతి, రాష్ట్ర సహాయ కార్యదర్శి శశికళ వి. సుధారాణి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు మస్తాన్ బి. వరలక్ష్మి ఐద్వా నాయకులు కవిత . పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

- రైతులు ఆందోళన చెందొద్దు
- మంత్రి నిరంజన్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో యూరియాతోపాటు అన్ని ఎరువులు సరిపడినన్ని ఉన్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరమని లేదని తెలిపారు. ఈమేరకు ఆదివారం మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 2.18 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా, ప్రయివేటు డీలర్ల వద్ద 90వేల మెట్రిక్ టన్నులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్ద 41వేల మెట్రిక్ టన్నులు, మార్క్‌ఫెడ్ వద్ద 81వేల మెట్రిక్ టన్నులు, కంపెనీ గోడౌన్లలో ఆరువేల మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నట్టు పేర్కొన్నారు. మొత్తం 7.57 లక్షల మెట్రిక్ టన్నుల ఇతర ఎరువులున్నాయని తెలిపారు. రాబోయే నాలుగు రోజుల్లో అందుబాటులోకి మరో 18 వేల మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని పేర్కొన్నారు. ఎవరైనా కృత్రిమ కొరత సృష్టిస్తే ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నదని హెచ్చరించారు.

నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించండి

- 18న ఇంటింటికి గ్యారంటీ కార్డులు అందజేయాలి
- కార్యకర్తలతో కలిసి భోజనాలు చేయండి
- సమన్వయంతో సభను విజయవంతం కోసం కృషి
- జూమ్ మీటింగ్‌లో రేవంత్‌రెడ్డి పిలుపు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

విజయభేరి సభకు నాయకులు, కార్యకర్తలు ప్రజలతో మమేకం కావాలని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అన్ని నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించాలని కోరారు. ఈనెల 17న విజయభేరి సభలో ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ ఐదు హామీలను ఇస్తారని తెలిపారు. వాటన్నింటిని 18న ఇంటింటికి కార్డుల రూపంలో అందజేయాలని సూచించారు. ఆదివారం డీసీసీ అధ్యక్షులతో రేవంత్‌రెడ్డి జూమ్ మీటింగ్‌లో మాట్లాడారు. ఈనెల 11 నుంచి అన్ని మండలాల్లో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలోని 35వేల బూత్‌ల నుంచి సభకు తరలివచ్చేలా కృషి చేయాలని కోరారు. సోమవారం పార్లమెంట్ నియోజకవర్గాల ఇంచార్జిలు, ఉపాధ్యక్షులతో సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ నెల 12,13,14 తేదీల్లో పార్లమెంటు పరిధిలో అన్ని నియోజకవర్గాల్లో సమీక్షలు చేస్తామన్నారు. 18న ఉదయం 11 గంటలకు 119 నియోజకవర్గాలకు జాతీయ నాయకులు చేరుకుంటారనీ, వారితో కలిసి ఐదు హామీలకు సంబంధించి పోస్టర్లు అతికించాలని సూచించారు.

మనసు ఖాళీగా లేదు

మనిషెంత ఖాళీగా ఉన్నా
మంచానికి పరిమితమైనా
కోర్కెల తాచులు కాటేస్తుంటే
ఆశలు రేసు గుర్రాలపై స్వారీ చేస్తుంటే
వయసు కిరీటం తొడుక్కున్నా
ఒంటరితనం చెట్టుకు వేలాడుతున్నా
సకల దాహాలు దండిగా తీరుతున్నా
సకల సౌకర్యాల ఉయ్యాలలో ఊగుతున్నా
మనసు ఖాళీగా ఉండదు
బురదలోంచి కారు వేగంగా నడిచినట్లు

బట్టలు తడిపే చెమట కారుస్తేనే
ఇంట్లో ముద్ద దిగేవారికి
చెమటను వడి పెట్టి పిండుకుంటూనే
చెమటను అసహ్యించుకునే వారికి
శరీరాన్ని బంగారు పళ్లెంలా పూజించుకుంటూ
ఏసీల గుడ్డులో దాక్కునే వారికి



శ్రమ అసౌందర్యం అనుకునే వారు
సాఫ్ట్‌వేర్ ట్యాగ్ మౌస్‌గా మారినవారు
రంగాలేవైనా రంగంలోకి
దిగినవారు, దిగనివారు
సమూహంలో బిజీబిజీగా ఉన్నా

ఆలోచనల ప్రవాహంలా మనసు
కొన్ని ఆలోచనలు మనసును పొక్కిలి చేస్తాయి
కొన్ని ఈదరగాలిలా వెంటాడుతాయి
భయం ముసురు కమ్ముకుంటాయి
ఉన్నచోట ఉండనీయవు,
నిద్రపట్టనీయని దుస్థితి
ఆవేశం, ఆగ్రహం పొయ్యి మండిస్తాయి
అన్నింటి నుంచి మనసు
ఖాళీ అయితేనే ప్రశాంతత

మనసు ఖాళీ చేసేందుకు
ఆశ్రయించాలి మౌనాన్ని
నిలకడ నీటిలో చినుకు పడకుండా చూడాలి
రాళ్లు కాదు, రూపాయలు పడ్డా సమస్యే
యోగ, ధ్యానం తోవలో పడితే
ఏకాగ్రత నిలువెల్లా నిలిస్తే
మనసు ఖాళీ, మనిషి తేజవంతం

- కొమురవెల్లి అంజయ్య
9848005676

అమృతా ప్రీతం: సాహిత్య జీవితం

అమృతాప్రీతమ్ 20వ శతాబ్దపు ప్రథమ ప్రముఖ మహిళా పంజాబీ రచయిత్రి, కవయిత్రి. ఆమె రచనలను భారతదేశం, పాకిస్తాన్ ప్రజలు సమానంగా ఇష్టపడతారు. ఆమె తన 6 దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌లో కవిత్వం, వ్యాసాలు, నవలలు, జీవిత చరిత్రలు మొదలైనవి వందకు పైగా రచనలు రచించింది.

అమృతా పంజాబ్‌లోని గుజ్రాన్‌వాలాలో ఆగస్టు 31, 1919న అమృతకౌర్‌గా జన్మించింది. తల్లి రాజ్ బీబీ, స్థానిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేసేవారు. తండ్రి కర్తార్ సింగ్ హిత్కారీ సాహిత్య పత్రిక సంపాదకునిగా పని చేసే వారు. వీరిది సాంప్రదాయ సిక్కు కుటుంబం. అమృతకు 11 ఏండ్లు ఉన్నపుడు ఆమె తల్లి మరణశయ్యపై ఉంది. తల్లి ఆరోగ్యం కోసం ఆమె దేవున్ని ఎంతగానో వేడుకుంది. పసి పిల్లల ప్రార్థనలను దేవుడు వింటాడని నమ్మింది. కానీ తల్లి చనిపోయింది. దేవునిపై విశ్వాసం కోల్పోయింది. తల్లి మరణం తర్వాత అమృత లాహోర్‌కు వెళ్లి తండ్రితో సమయం గడపసాగింది.

అమృత చాలా చిన్న వయసులోనే రాయడం ప్రారంభించింది. కేవలం 17 ఏండ్ల వయసులో ఉన్నప్పుడు 'అమృత్ లెహ్రాన్' (1936) (అమర తరంగాలు) పేరుతో తన తొలి కవితా సంకలనాన్ని విడుదల చేసింది. ఆ తర్వాత 1936 నుండి 1943 వరకు కనీసం ఆరు కవితా సంకలనాలను ప్రచురించింది. తన సాహిత్య రచనల ద్వారా ప్రజలను ప్రేరేపించడానికి 'ప్రగతిశీల రచయితల ఉద్యమం'లో చేరింది. 1944లో 'లోక్‌పీడ్' (ప్రజల వేదన) రచనల సంకలనాన్ని రూపొందించింది. ఇది '1943 బెంగాల్ కరువు', దేశంలోని అప్పటి యుద్ధం వల్ల దెబ్బ తిన్న ఆర్థిక వ్యవస్థకు కారణమైన బ్రిటిష్ రాజ్‌ను విమర్శించింది.

అమృత లాభాపేక్షలేని అనేక సంస్థలలో చురుకైన సభ్యురాలు. స్వచ్ఛంద సేవా కార్యక్రమాల కోసం పని చేసేది. 1947లో భారతదేశ విభజనకు ముందు కొంతకాలం 'లాహోర్ రేడియో స్టేషన్'లో పని చేయడం ద్వారా ప్రజలతో ఆమెకు నేరుగా సంబంధం ఏర్పడింది. తర్వాత కాలంలో అమృతా ప్రీతమ్ జీవితంలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. అవి ఆమెను స్త్రీవాదిని చేశాయి. ఆమె రాసిన కథలు, కవితలు ఎక్కువ శాతం తన వైవాహిక జీవితంలోని దుర్భర అనుభవాల నేపథ్యంలో రాసినవే. ఆమె స్వీయచరిత్రలైన 'బ్లాక్ రోజ్', 'రసిది టిక్కెట్' (రెవెన్యూ స్టాంప్) ఆ కోవకు చెందినవే. 'రసిది టిక్కెట్' లో ముఖ్యంగా తన ప్రణయ గాథలను ధైర్యంగా వివరించింది. తను రాసిన చాలా కథల్లో ప్రముఖ ఉర్దూ షాయర్, సినీ గేయ రచయిత సాహిర్ లూధియాన్వితో తన ప్రేమవ్యవహారం తొంగి చూస్తుంది. మంచి పేరున్న పెయింటర్ ఇమ్రోజ్‌తో గడిపిన సహ జీవనం గురించిన ప్రస్తావన కూడా ఉంటుంది.



1947లో భారతదేశ విభజన తర్వాత అమృతా ప్రీతమ్ లాహోర్ నుంచి ఢిల్లీకి వలస వెళ్లింది. 1947లో ఆమె డెహ్రాడూన్ నుండి ఢిల్లీకి ప్రయాణిస్తున్నప్పుడు దేశ విభజనపై ఒక కాగితంలో తన వేదనను వ్యక్తం చేసింది. అది ఒక కవితగా మారింది. అదే 'అజ్ ఆఖాన్ వారిస్ షా ను' కవిత. ఈ కవితలో అమృతా ప్రీతమ్ భారతదేశం విభజన సమయంలో జరిగిన ఘోరాలను చిత్రించింది. అమృత అత్యంత ప్రసిద్ధ నవలల్లో ఒకటి 'పింజార్' (1950). అదే పేరుతో చలనచిత్రంగా రూపొందించబడింది (2003). అవార్డు కూడా పొందింది.

విదేశాలలో అవార్డులు, గౌరవ పురస్కారాలు

1979లో రిపబ్లిక్ ఆఫ్ బల్గేరియా ఆమెను బల్గేరియన్ కవి, విప్లవకారుడి పేరు మీద 'ఇంటర్నేషనల్ వాప్ట్సరోవ్ గౌరవ అవార్డు'తో సత్కరించింది. ఫ్రెంచ్ ప్రభుత్వం 1987లో ఆమెకు 'ఆర్డ్రే డెస్ ఆర్ట్స్ ఎట్ డెస్ లెటర్స్' (Ordre das Arts et des Letters) తో పురస్కరించింది. పాకిస్తాన్‌కు చెందిన 'పంజాబీ అకాడమీ' కూడా ఆమెను సత్కరించింది.

నవలలు : ధర్తి, కోరే కాగజ్, ఉంచాస్ దిన్, సాగర్ ఔర్ సీపియాన్, దిల్ కి గలియ, డాక్టర్ దేవ్, తేర్ వా సూరజ్, జిలవతన్, యాత్రి, రంగ్ క పత్త.

ఆత్మ కథలు : రసిది టికెట్,(1976) కాల గులాబ్ (1968), అక్షరో క సాయ (2004). 'లోక్ పీడ్' (ప్రజల వేదన 1944) సంకలనంలో ఆమె పడిన బాధ, వ్యథ స్పష్టంగా కనిపించింది. ఇది 1943 బెంగాల్ కరువు తర్వాత ఆర్థిక వ్యవస్థను బహిరంగంగా విమర్శించిన రచన.

కథల సంకనాలు : కహానియా జో కహానియా నహి, స్టెంచ్ ఆఫ్ కిరోసిన్

కవితా సంకలనాలు : అమ్రిత్ లెహ్రన్ (1936), జిఉంద జివన్ (1939), త్రెల్ ధొతె ఫుల్ (1942), ఓ గీతన్ వలియ (1942), బద్లాం ది లాలి (1943), సంజ్ ది లాలి (1943), లోక్ పీర (1944), పథర్ గీతే (1946), పంజాబి ది ఆవాజ్ (1952), సునేహెరే (1955), అశోక చెట్టి (1957), కస్తురి (1957), నగ్మని (1964), ఇక్ సి అనిత (1964), చక్ నంబర్ చట్టి (1964), ఉనింజ దిన్ (1979), కాగజ్ తె కన్వాస్ (1981).



1947లో భారతదేశ విభజన తర్వాత అమృతా ప్రీతమ్ లాహోర్ నుంచి ఢిల్లీకి వలస వెళ్లింది. 1947లో ఆమె డెహ్రాడూన్ నుండి ఢిల్లీకి ప్రయాణిస్తున్నప్పుడు దేశ విభజనపై ఒక కాగితంలో తన వేదనను వ్యక్తం చేసింది. అది ఒక కవితగా మారింది. అదే 'అజ్ ఆఖాన్ వారిస్ షా ను' కవిత. ఈ కవితాలో అమృతా ప్రీతమ్ భారత దేశం విభజన సమయంలో జరిగిన ఘోరాలను చిత్రించింది. అమృతా అత్యంత ప్రసిద్ధ నవలల్లో ఒకటి 'పింజార్' (1950). అదే పేరుతో చలన చిత్రంగా రూపొందించబడింది (2003). అవార్డు కూడా పొందింది.

పంజాబీ, హిందీలో రాసిన ఆమె రచనలు చాలా వరకు స్వీయచరిత్రతో సహా ఇంగ్లీష్, ఫ్రెంచ్, డానిష్, జపనీస్, ఉర్దూ భాషలలోకి అనువదించబడ్డాయి. ఆమె కథలు కొన్ని తెలుగులో కూడా అనువాదమవుతున్నాయి. వీటిని తెలుగు పాఠకులు ఇష్టపడుతున్నారు. సాహిత్య రంగంలో ఇంత సేవ చేసిన అమృతా ప్రీతం అక్టోబర్ 31, 2005 లో తుదిశ్వాస విడిచి వెళ్లి పోయినా ఆమె రచనలు మాత్రం మన మధ్య తిరుగాడుతూనే ఉన్నాయి.



- అమ్జద్
+966 507662638
amjuali1993@gmail.com

సొంత దేశంలో అవార్డులు, గౌరవ పురస్కారలు

- అమృతా ప్రీతమ్ తన కెరీర్‌లో అనేక ప్రతిష్టాత్మక అవార్డులతో సత్కరించబడింది. పంజాబ్ ప్రభుత్వం అందించే 'పంజాబ్ రత్తన్' ప్రతిష్టాత్మక అవార్డును పొందిన మొదటి గ్రహీత అమృతా. ఈ అవార్డు కళ, సాహిత్యం, సైన్స్, టెక్నాలజీ, సంస్కృతి, రాజకీయ రంగాలలో గుర్తింపు పొందిన వారికి ఇవ్వబడుతుంది.
- 1956లో 'సాహిత్య అకాడమీ' అవార్డు అందుకున్న మొదటి మహిళ. 'సునేహాదే' (సందేశాలు) అనే తన కవితా సంకలనానికి అందుకున్న అవార్డ్ ఇది. 'సునేహాదే' ఆమె గొప్ప రచనగా పరిగణించబడుతుంది.
- 1982లో భారతదేశంలో అత్యున్నత సాహిత్య పురస్కారంగా పరిగణించబడే 'జ్ఞానపీఠ్ అవార్డు'ను అందుకుంది. 'కాగజ్ తే కాన్వాస్' అనే పుస్తకానికి గానూ ఆమెకు ఈ అవార్డు లభించింది.
- 2004లో 'సాహిత్య అకాడమీ' (ఇండియన్ నేషనల్ అకాడమీ ఆఫ్ లెటర్స్) అందించే అత్యున్నత సాహిత్య పురస్కారమైన 'సాహిత్య అకాడమీ ఫెలోషిప్'ని అందజేసింది.
- 1973లో 'జబల్‌పూర్ విశ్వవిద్యాలయం', 'ఢిల్లీ విశ్వవిద్యాలయం' ఆమెకు డి.లిట్‌ని ప్రదానం చేశాయి.
- 1987లో సాహిత్య రంగంలో ఆమె చేసిన కృషికి 'భారతి విశ్వవిద్యాలయం' నుండి గౌరవ డిగ్రీ డి.లిట్‌ను అందుకుంది.
- 1969లో కళలు, సాహిత్యంలో ఆమె చేసిన కృషికి భారతదేశపు నాల్గవ అత్యున్నత పౌర పురస్కారం 'పద్మశ్రీ'ని అందుకుంది.
- 2004లో దేశంలోని రెండవ అత్యున్నత పౌర పురస్కారమైన 'పద్మవిభూషణ్'తో ఆమెను సత్కరించారు.
- 1986-92 వరకు రాజ్యసభ సభ్యురాలిగా నామినేట్ చేయబడింది.

సాహితీ వార్తలు

జాతీయ స్థాయి జయప్రద, జమున అవార్డులకు నానీలు, నవలా సంపుటాలకు ఆహ్వానం

జాతీయస్థాయి జమున స్మారక నానీల సంపుటి అవార్డు, డాక్టర్ పెళ్లకూరు జయప్రద సోమిరెడ్డి నవలా అవార్డులకు గాను నానీలు, నవలా సంపుటలు ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు సోమిరెడ్డి వెంకట శేషారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్తమ నానీల సంపుటికి రూ.10,000/-, ఉత్తమ నవలకు రూ.15,000/- ఇవ్వనున్నారు. 2022 నుంచి 2023 ఆగస్టు వరకు పబ్లిష్ అయిన నానీల సంపుటులు, నవలా సంపుటులు 3 కాపీలు పంపించాల్సి ఉంటుంది. ఆసక్తి కలిగిన వారు అక్టోబర్ 31లోగా అవ్వారు శ్రీధర్ బాబు, 23-1-57, పెండెం వారి వీధి, ఫతేఖాన్ పేట, నెల్లూరు - 524003 చిరునామాకు పంపవచ్చు. వివరాలకు 8500130770 నంబరు నందు సంప్రదించవచ్చు.

విమలక్క, నలిమెల భాస్కర్‌లకు పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారం

పొన్నం సత్తయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందించే 'పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారం' ఈ ఏడాదికిగాను కళాకారుల విభాగంలో ప్రజా కళాకారిణి విమలక్క, సాహిత్య విభాగంలో బహూ భాషా కోవిదుడు నలిమెల భాస్కర్‌కు ప్రధానం చేయ నున్నట్లు ట్రస్ట్ ఛైర్మన్ పొన్నం ప్రభాకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెలలో పురస్కార ప్రదానోత్సవం వుంటుందని, కార్యక్రమ పూర్తి వివరాలు త్వరలో తెలియ చేస్తామని ఆయన పేర్కొన్నారు.

ఏనుగు నరసింహారెడ్డికి ఉదారి నాగదాసు స్మారక సాహితీ పురస్కారం

ప్రముఖ తత్వ కవి ఉదారి నాగదాసు స్మారక సాహితీ పురస్కారాన్ని 2023కి గానూ ప్రముఖకవి, విమర్శకుడు ఏనుగు నరసింహారెడ్డికి ఇవ్వనున్నట్లు పురస్కార నిర్వాహకులు డా.ఉదారి నారాయణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పురస్కార ప్రదానోత్సవం ఈ నెల 24 ఆదివారం నాడు అదిలాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో అందజేయనున్నట్లు వారు తెలియజేశారు. వివరాలకు 9441413666 నంబరు నందు సంప్రదించవచ్చు.

నేత పోగుల రంగుల కల

కాలం
కూలీ గిట్టని
ఎనకటి పాటే పాడుతున్నది

రాత్రంతా అల్లుకున్న
జరీ అంచు కవిత్వం
ఎవరికీ నచ్చని దుఃఖమయితున్నది

బడిబాట మానేసి
గువ్వల చెన్న గీతం ఎత్తుకుంటే
ఇద్దరు పిల్లలు
ఇద్దరు పెద్దలు
ఎంత చేసినా
ఏ మూల నుండి చూసినా
ఏ రూపమూ అగుపడని ఆనందం
ఏ ఉలితో చెక్కాలి

నలుగురు చుట్టాలు వస్తే
కూరాడు కుండకు నైవేద్యం పెట్టిన అమ్మ
పొద్దు పొద్దున్నే
పొద్దు మీద వాలిన కాకి
కావు కావు మంటుంటే రందివడుతున్నది

ఇంటిదాకా వచ్చిన పరాయీ సైకిల్
బతిమాలి
కాంచి తొక్కుడు నేర్చుకున్నట్టు
సందు దొరికితే
సరదాగా జొర్రిన నాయిన మగ్గం
బంకలాగా అంటుకున్నది

మగ్గం
నిత్యం
పెద్ద పాము మింగిన పందెం

పోగుకూ పేగుకూ నడుమ
బిగుసుకున్న ఆకలిముడి
రేపటి వసంతానికి స్వాగతం పలికే
ఎండుకొమ్మల ఎదురుచూపు

సూర్యుని చుట్టూ తిరిగే భూమిలా
అందరూ
మిల్లు బట్టలకు ఎగబడుతూ వుంటే

చీకటి తరువాత వెలుగంటూ
కష్టనష్టాలు దాటితే సుఖమంటూ
ఏదో ఒకనాడు
కన్నీరు పన్నీరు అవుతుందని
కలగంటూ...

- గజ్జెల రామకృష్ణ, 8977412795


మొలకల శిశువులను ప్రసవిస్తుంది ..!

నాగలి కర్ర సర్రున
భూమిలోకి దిగగానే...
పుడమి కడుపులో వున్న
జీవధాతువులు మెల్లగా కదులుతాయి..!

కోలా "హలం"గా రైతన్నలు
చాలు చాలును కలియ దున్నగా
మట్టి పెళ్ళలు చిట్లిపోయి
చీడపురుగులు చెదిరిపోయి ..
అదునుకు పదునెక్కుతుంది మేదిని.

రైతులు చల్లని మేలైన విత్తనాలను
నేలతల్లి కేలతో అందుకొని
ధరణి గర్భంలో దాచుకుంటుంది...!

ఆకుమడి ఆసుపత్రిలో
అన్నదాతలు మమతతో కప్పిన
నీటి పరజాలను కప్పుకొని



మొలకల శిశువులను ప్రసవిస్తుంది ..!

మడిలోని మొక్కలను తీసి
కృషీవలులు క్షేత్రంలో నాట్లు వేస్తే
కనుచూపు దూరమంతా..
పచ్చల హరితమవుతుంది..!
ధరిత్రికి కుప్పలు కొద్దీ ఆహారమౌతుంది..!!!!

- జి.సూర్యనారాయణ, 6281725659.

సినిమా కూడా సాహిత్యమే అని నమ్మి సినిమాను బాధ్యత, నిబద్ధతగల మీడియంగా గుర్తించి సినీ విశ్లేషణ, పరిచయాలను ఓ దీక్షగా నిర్వహిస్తున్న ప్రసేన్ సినీ సమీక్షల సంకలనం ఈ "ప్రసేన్@సినిమా" "నేను తెలుగు సినిమాను తిట్టినా, ఎటకరించినా, విమర్శించినా కేవలం మంచి సినిమా కోసమే, సినిమా మంచి కోసమే, మంచి సినిమా రావాలన్న తపనతోనే. మంచి సినిమా వస్తుందన్న ఆశతోనే" అంటారు ప్రసేన్ ఈ పుస్తకం ముందుమాటలో.

ప్రసేన్ @సినిమా
The Immediate Experience

సినీ విమర్శకులపై ఎందరికో కోపం ఉంటుంది. ముఖ్యంగా ఏ ప్రలోభాలకు, మార్కెటింగ్ మాయా జాలానికీ, ఫాన్ ఫియర్‌కి లొంగకుండా సినిమాని విమర్శించే వారు ఎదుర్కొనే కోపతాపాలు చాలా ఎక్కువ. అయినా సినిమా గురించి కొందరు రాస్తూనే ఉంటారు. దీనికి కారణం మంచి సినిమాపై ఆశ, ప్రేమ వారిలో నిండుగా ఉండడమే. ప్రస్తుతం సినిమాను విపరీతంగా మార్కెట్ చేసి అర్హతలేని సినిమాలకు కూడా ప్రతిష్టాత్మకమైన అవార్డులు ఇప్పించేసి ఇక ఆ సినిమాలో ఏం ఉందీ అన్న ఆలోచన రానీయకుండా సామాన్యుల నోర్లు మూయించే ట్రెండ్ ఎక్కువగా నడుస్తూ ఉంది. ప్రేక్షకుల నోర్లు మూయించి మెదళ్ళు పని చేయనీయకుండా చేసి సినిమా స్థాయిని దిగజార్చే సంస్కృతి ప్రస్తుతం తెలుగు సినిమాలో రాజ్యం ఏలుతుంది. ఇది కళకు జరుగుతున్న అతిపెద్ద ద్రోహం. దీన్ని ఎదిరించడానికి శక్తివంతమైన విమర్శకుల అవసరం ఉంది. వీరు ఎమోషన్లతో కొట్టుకుపోతున్న అభిమాన సంఘాలతోనూ, సినిమాను ధనార్జనకు సాధనంగా మాత్రమే చూసే వ్యవస్థ తోనూ పోరాడవలసి వస్తుంది. ఓ పెద్ద హీరో సినిమా బాలేదంటే ఎందరినో శత్రువులను చేసుకోవలసి వస్తుంది. చాలా సందర్భాలలో వీరిది ఒంటరి పోరాటమే.


బాధ్యతతో ప్రవర్తించే సినీ విమర్శకుల కొరత తెలుగు సినిమాలో ఉంది. సినిమా మార్కెటింగ్ కోసం వనరులుగా ఉపయోగపడే సినీ విమర్శకుల మధ్య సినిమాను ఏ ప్రలోభాలకూ లొంగకుండా ఉన్నది ఉన్నట్టుగా చెప్పే ప్రసేన్ ఈ సంక్షిప్త సినీ పరిచయాలను చదివి, తెలుగు సినిమా ఎంతటి అధోగతిలోకి పడిపోయి ఉందో తెలుసుకుంటే తప్ప మళ్ళీ తెలుగు సినిమాకు మంచి రోజులు వచ్చే అవకాశం లేదు. మన మెదళ్ళు పనిచేయకుండా మ్యూట్‌లోకి నెట్టేసే మార్కెటింగ్ మాయాజాలనికి దూరంగా, నిజాన్ని నిజాయితీతో చూసి ప్రశ్నించే ఇటువంటి సినీ విమర్శల అవసరం తెలుగు సినిమాకు ప్రస్తుతం ఎంతో ఉంది. అందుకే తెలుగు సినిమాను ఆయన చీల్చి చెండాడారు, ప్రశ్నించవలసిన సమయంలో సూటిగా ప్రశ్నించారు.

'ఆచార్య' కు సాష్టాంగ సలాం ఇచ్చినా, 'వీరసింహారెడ్డి' ని వీర హింసారెడ్డి అని చెప్పినా, 'ఎఫ్' అనగా ఫెయిల్యూర్ ప్రేక్షకుడు, పాడిందే సర్కారు వారి పాట అని వ్యంగ్యోక్తులు విసిరినా, 'ఆర్ ఆర్ ఆర్' ని సప్పుడెక్కువ సరుకు తక్కువ, 'కశ్మీర్ ఫైల్స్' ని చెడ్డ కషాయం రేపటి అపాయం, 'వకీల్ సాబ్' ని ఏ కీలు కా కీలు విరిచేసారు కదా సాబ్ అంటూ విమర్శించినా అందులో వీరి సినిమా ప్రేమ మాత్రమే కనిపిస్తుంది.

కొన్ని సినిమాలను సమీక్షిస్తూ ఆయన కలం ఎన్నో ఆలోచనలనూ రెకెత్తించింది. "భావోద్వేగాలు 24 ఫ్రేముల్లో ఒక్కటంటే ఒక్కదాంట్లో మచ్చుకయినా లేకపోవడం "ఆఫీసర్"లో లోపం అని చెప్పడం వెనుక సినిమాలో భావోద్వేగాలపై దృష్టి పెట్టండని సినీవర్గాన్ని కోరే ఓ సినీ ప్రేమికుడు కనిపిస్తాడు. 'సినిమా చూసే వాళ్లను ఫాన్స్ అనీ, ప్రేక్షకులనీ రెండు ముక్కలు చేసి ఫ్యాన్స్‌కు పెద్దపీట వేసి, ప్రేక్షకులను చిన్నచూపు చూస్తున్నందుకూ... సినిమా మధ్యమాన్ని కేవలం మానసిక దౌర్బల్యాలను ప్రేరేపించే 'మాత్ర'గా మాత్రమే స్థిరీకరించినందుకూ, సకల దౌర్భాగ్యాలనూ వెండితెర మీద విజయవంతంగా పులిమి కూడా బాహుబలిగా బతికేస్తున్నందుకూ.. ఇంకా చాలా చాలా వాటికి క్షమించాలి తెలుగు సినిమాను" అంటారు ప్రసేన్. సినీ ప్రపంచం దీని తర్వాత కూడా ఆలోచించకపోతే అది ప్రేక్షకుల పట్ల వారికున్న చులకన భావం మాత్రమే.

గ్రామాలను దత్తత తీసుకోవాలనే నేపథ్యంతో వచ్చిన ఓ సినిమాను సమీక్షిస్తూ అయన "టెల్గు సినిమాను ఎవరు దత్తత తీసుకోవాలిట" అని ప్రశ్నించే విధానం నవ్వు తెప్పించినా, అందులో అంతర్లీనంగా ఉన్న బాధ సినీ ప్రేమికులకే అర్థం అవుతుంది. "సమూహాలు పరిష్కరించుకోవలసిన సమస్యలను వ్యక్తులే దేవదూతలుగా వచ్చి లెక్కలు తేల్చిపారేస్తున్న అసహజతను మనం గమనించలేమా" అంటూ ఆయన ఆవేదన చూపించడంలో ప్రేక్షకులకు కనీస గౌరవం ఇవ్వని ప్రస్తుత తెలుగు సినిమాపై కోపం కూడా ఉంది.

ఓ సినిమా హిట్ అవడం వెనుక ఎన్నో కారణాలు ఉంటాయి. కాని సినిమా హిట్ అయిందని సంతోషించలేక పోతున్నాడు విజ్ఞత గల ప్రేక్షకుడు. "సినిమా హిట్టే... కాని జరగకూడందేదో జరుగుతోంది. గెలవాల్సిన వాడు గెలువకపోయినా పర్వాలేదు కాని ఓడాల్సినవాడు గెలుస్తున్నాడు. తస్మాత్ జాగ్రత్త." అంటూ హిట్ అవుతున్న సినిమాల వల్ల జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించడానికి సంకోచించట్లేదు ప్రసేన్ అనే ఈ సినీ ప్రేమికుడు.



'హీరోయిన్లు వేశ్య పాత్ర పట్ల ఎంత పాషన్‌తో ఉంటారో ఇప్పుడు హీరోలు విలన్ పాత్రల పట్ల అంతే పాషన్ చూపిస్తున్నారు' అంటూ మరో చోట రాస్తూ మారుతున్న హీరో స్థానాన్ని చూపిస్తున్నారు. చెడు పట్ల ఆకర్షణను కమర్షియలైజ్ చేస్తున్న తెలుగు సినిమా స్థితికి కారణాలు వెతకవలసిన అవసరం ఇంకానూ రాలేదంటారా?

"సామాజిక సమస్యలను వ్యాపార సినిమా ప్రతిబింబిస్తోందని సంబరపడాలో పిచ్చి పరిష్కారాలు చూపించి చేతులు దులుపుకుంటోందని బాధపడాలో అర్థంకాని స్థితిలోకి తెలుగు ప్రేక్షకుడిని నెడుతున్న సినిమాల పరంపరలో ఇంకో సినిమా 'మహర్షి', 'రక్తమాంసాలు', రూపురేఖలూ అందచందాలూ అన్నీ ఉండి ఆత్మలేని సినిమా 'రంగస్థలం'." సినిమా ఎంత బాగుందంటే 'సైరా' పాత్రను లార్జర్‌దాన్ లైఫ్‌గానే ప్రదర్శించినా చిరు అంతకంటే పైన మెగా సైజ్‌లో నిలబడ్డంత అంటూ సూటిగా నిజాలను చెప్పడానికి చాలా తెగువ కావాలి.

"ఒక మంచి కెమెరామెన్ను, ఒక గొప్ప ఎడిటర్‌ను పక్కన పెట్టేసుకుంటే ఏ రచయితయినా దర్శకుడైపోవచ్చు" అన్నట్లుగా ప్రవర్తించే నేటి సినీ దర్శకుల స్థితిని ఆయన ఎండగట్టారు. ఒకప్పటి ప్రజాదరణ పొందిన దర్శకులు పూరీ జగన్నాథ్, రాం గోపాల్‌వర్మ లాంటి దర్శకుల లేటెస్ట్ సినిమాలను కూడా అదే స్థాయిలో విమర్శించడం వీరి నిష్పక్షపాత వైఖరికి ప్రతిబింబం.

"నా వరకు నాకైతే పెద్ద సినిమా కొంచెం బాగాలేకపోయినా ఎక్కువ చిరాకు, అదే చిన్న సినిమా కొంచెం బాగున్నా ఎక్కువ ఆనందం" అంటూ చిన్న సినిమాలను ప్రోత్సహించే దశగా ఈ పుస్తకంలో కొన్ని వ్యాసాలున్నాయి. ఎక్కడ ఆ సినిమాలో లోటు పాట్లున్నాయో సూచిస్తూ, వారి ప్రయత్నాన్ని అభినందిస్తూ మరో సినిమా సందర్భంలో ఆ టీం గుర్తు పెట్టుకోవలసిన విషయాలను సమీక్షలలో ప్రస్తావించడం వల్ల నేర్చుకోవాలనుకునే కోరిక ఉన్న సినీ మేకర్లకు ఎంతో ఉపయోగపడతాయి ఈ వ్యాసాలు.

సినిమాలో క్షీణిస్తున్న సాహితీ విలువలను ఎత్తి చూపడంలో వీరు సందేహించలేదు. సినీ కథా రచయితలు సంభాషణల రచయితల అవసరాన్ని నొక్కిచెపుతూ సంభషణలు సినిమా స్థాయిని ఎలా పెంచగలవో కొన్ని సందర్భాలలో ఉదహరిస్తూ వెళ్లారు. "మన సినిమా పాటల్లోనే బోలెడంత రేపిజం, బోలెడంత మంది రేపిస్టులూ, లెక్కలేనన్ని అత్యాచారాలూ.." అంటూ ఆయన ఉదహరించిన సినీ సాహిత్యం తెలుగు వారి దిగజారిన సాహితీ విలువలను దర్పణం. తెలుగు సినిమా పూర్తిగా మార్కెటీ కరించబడడం గురించి ప్రసేన్ గారిలో చాలా బాధ ఉంది. "విషాదామేంటంటే మనమే మార్కెట్ సృష్టించి దాని కొమ్ములకు మనమే పదును పెట్టి, ఇప్పుడు కుమ్మేస్తున్నాయి బాబోయ్ అని గుండెలు బాదుకోవడం. ప్రస్తుతం తెలుగు సినిమాను రక్షించగలిగేది ప్రేక్షకులే, తమను తెలివి లేని దద్దమ్మలుగా ఎంచే సినీ వర్గాన్ని తోసిపుచ్చి మంచి సినిమా దిశగా సినీ రంగాన్ని మళ్లించగల శక్తి కేవలం ప్రేక్షకుడికే ఉంది. మార్కెట్ మాయాజాలానికి లొంగక, గుడ్డి అభిమానాన్ని వదిలి, వ్యక్తిగత ఇష్టాలను దాటుకుని, హీరోయిజం అనే మాయనుండి బైటపడి, మంచి సినిమాలు తెలుగులో రావడానికి ఉద్యమించవలసింది ప్రేక్షకుడే. అటువంటి ప్రేక్షకులను తయారు చేయగల సినీవిమర్శ "ప్రసేన్ @ సినిమా" ఇందులోని నిష్పక్షపాత విమర్శ ఆలోచింపజేస్తుంది. అయితే కొన్ని వ్యాసాలు అతి క్లుప్తంగా ఉన్నట్లు నాకు అనిపించాయి. ఆ ఒక్క విషయంలో తప్ప సినిమాను అభిమానించే వారికి పూర్తి సంతృప్తినివ్వగల సినీ విమర్శాత్మక పుస్తకం ఇది.



- పి.జ్యోతి, 98853 84740

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
సోమవారం | సెప్టెంబర్ 11, 2023 | www.navatelangana.com



చాకలి ఐలమ్మ ఆశయాలను సాధిద్దాం

నవతెలంగాణ-కామేపల్లి
సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 38వ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ, వ్యవసాయకార్మిక సంఘం మండల కార్యదర్శి బాదావత్ శ్రీను పూలదండలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాకలి ఐలమ్మ పోరాట ఫలితంగా ఈ రోజు రోడ్లమీద మనము తిరుగుతున్నామని వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ నెల 10 నుండి 17 వరకు చాకలి ఐలమ్మ సాయుధ పోరాట వారోత్సవాలను గ్రామ గ్రామాన నిర్వహిస్తామని, వారోత్సవాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాగం రామారావు, సాంతయ్య, గోపి, సాయి తదితరులు పాల్గొన్నారు.



జాస్తి పల్లిలో ఘనంగా బోనాల సందడి

- బోనమెత్తిన ఎంపీటీసీ కుటుంబ సభ్యులు

నవతెలంగాణ-కామేపల్లి
మండల పరిధిలోని జస్తిపల్లి గ్రామంలో బోనాల సందడి అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా జాస్తిపల్లి ఎంపీటీసీ మల్లేంపాటి నర్సింహరావు ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు బోనం ఎత్తారు. ఈ సందర్భంగా గ్రామ పుర వీధుల్లో బోనాలతో మేళ తాళాలతో ఆటపాటలతో బోనాల సందడి కొనసాగింది. దీంతో ఆ గ్రామంలో పండగ వాతావరణం నెలకొన్నది.

ముదిగొండలో బోనాలు వేడుకలు
ముదిగొండ : ముదిగొండలో శ్రావణమాసం సందర్భంగా బోనాల వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు భారీ ట్రాక్టర్ లా ప్రభలతో ముత్యాలమ్మ దేవాలయం వరకు ఊరేగింపుగా వెళ్లి మొక్కులు తీర్చుకొని పూజలు నిర్వహించి భక్తులు కానుకుల సమర్పించారు.

అణిచి వేతకు వ్యతిరేకంగా పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ
నవతెలంగాణ - ఎర్రుపాలెం
భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం నిరంకుశత్వాన్ని నిరసిస్తూ భూస్వాముల అణచి వేతకు వ్యతి రేకంగా తెలంగాణ ప్రజల తెగువను పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన దివంగత తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ అని సిఐటియు మండల కన్వీనర్ సగుర్తి సంజీవరావు పేర్కొన్నారు. ఎర్రుపాలెంలోని రామ్ శెట్టి పుల్లయ్య భవనం నందు మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించా రు. ఈ కార్య క్రమంలో మధ్యాహ్నం భోజన కార్మికుల మండల అధ్యక్ష కార్యదర్శులు రాణి, దేవ కర్ణ, కార్యవ ర్గ సభ్యులు శాంతి, కుమారి,జ్యోతి,పాపమ్మ, సావిత్రి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నందు చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు,
బీఆర్ఎస్ పార్టీ మండల కార్యాలయం నందు చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్య క్రమంలో చావా రామకృష్ణ, పంబి సాంబశివరావు, ఎంపీపీ శిరీష, సురానేని రామ కోటేశ్వరరావు, మొగిలి అప్పారావు, సగ్గుర్తి కిషోర్ బాబు, మస్తాన్ వలి, పుల్లారెడ్డి, చిన్నం రాము, దేవరకొండ రవి, తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటికి మువ్వా కృతజ్ఞతలు

నవతెలంగాణ-ఖమ్మం



కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టో కమిటీలో తనను సభ్యునిగా నియమించడంలో సహకరించిన తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో ఛైర్మన్ పొంగులేటి శ్రీనివాస రెడ్డికి మువ్వా విజయబాబు కృతజ్ఞతలు తెలిపారు. పొంగులేటిని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలిసి పుష్పగుచ్చం అందజేశారు. తనపై నమ్మకముంచి ఇచ్చిన ఈ పదవికి చిత్తశుద్ధితో పనిచేసి న్యాయం చేకూరుస్తానని మువ్వా విజయబాబు పేర్కొన్నారు.

గిరిజన సంఘం వ్యవస్థాపకుడు ధర్మా నాయక్‌కు పరామర్శ

నవతెలంగాణ-రఘునాథపాలెం
తెలంగాణ గిరిజన సంఘం వ్యవస్థాపకుడు, సీపీఐ(ఎం) నాయకులు గుగులోతు ధర్మ నాయక్ గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న విషయం తెలుసుకున్న గిరిజన సంఘం ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి, భూక్య కృష్ణ, ఆదివారం కొత్తగూడెం లోని వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ రాస్తారోకో

నవతెలంగాణ-ముదిగొండ
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ టీడీపీ ఆధ్వర్యంలో ముదిగొండలో ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. నారా చంద్రబాబునాయుడు అరెస్టు అక్రమమని, వెంటనే చంద్రబాబుకు బెయిలు ఇవ్వాలని టిడిపి మండల అధ్యక్షులు కనపర్తి వీరబాబు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొండమీద నాగేశ్వరరావు, నాయుడు, సాదినేని శ్రీనివాస్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతో ప్రజలకు ముప్పు

కాంగ్రెస్‌లోకి పెద్ద ఎత్తున చేరికలకు ముహూర్తం

కమ్యూనిస్టులతో పొత్తు : మేనిఫెస్టో కమిటీ సభ్యులు పోట్ల

నవతెలంగాణ-కారేపల్లి



బీజేపీతో దేశప్రజలు ముప్పును ఎదుర్కొంటున్నారని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ మ్యానిఫెస్టో సభ్యులు పోట్ల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం కారేపల్లి వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మతం ప్రాంతం అంటూ ప్రజల మధ్య చిచ్చుపెట్టి భావోద్రేకాలను పెంచి అధికార పీఠాన్ని సుస్థిరం చేసుకోవాలని బీజేపీ కుయుక్తులు పన్నుతుందని విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ చతికల పడనుందని ఈనెల 17 సీడబ్ల్యూసీ సమావేశం అనంతరం కాంగ్రెస్‌లోకి పెద్ద ఎత్తున చేరికలు జరగబోతున్నాయన్నారు. ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ నుండి భారీ చేరికలు ఉన్నాయన్నారు. దీంతో బీఆర్ఎస్ ప్రకటించిన అభ్యర్థులలో 35 మందిని కేసీఆర్ మార్చనున్నారని జోస్యం చెప్పారు. కమ్యూనిస్టులు కలిసి రావాలని కోరుకుంటున్నామని వారితో పొత్తు ఉంటుందనే అశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 75 సీట్లకు పైబడి గెలుస్తుందని సర్వేలు చెప్పుతున్నాయన్నారు. ఖమ్మం 10కి 10 గెలవటం ఖాయమన్నారు. తనను మ్యానిఫెస్టో కమిటీ సభ్యులు నియమించటం పట్ల పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, శాసనసభ పక్ష నేత భట్టీ విక్రమార్కలకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయనను కాంగ్రెస్‌నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మేదరి వీరప్రతాఫ్(టోనీ), సొసైటీ డైరక్టర్ బానోత్ హీరాలాల్, ఎస్టీ సెల్ జిల్లా నాయకులు గుగులోత్ భీముడు, నాయకులు తాజుద్దీన్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి

నవతెలంగాణ-పెనుబల్లి
తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు అమరజీవి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు ఆదివారం పెనుబల్లిలో ఘనంగా జరిగాయి. పెనుబల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఐలమ్మ విగ్రహనికి నిర్వాహకులు పంతంగి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య హాజరై ఐలమ్మ విగ్రహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భూమికోసం భుక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటం నిర్వహించిన వీర వనిత సాకలి ఐలమ్మన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పేదల అభ్యున్నతి కోసం ఐలమ్మ అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. పెనుబల్లి సిపిఎం కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యులు



చలమాల విట్టల్ రావు ఐలమ్మ చిత్రానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాలు బీఆర్ఎస్ నాయకులు కోటగిరి సుధాకర్ బాబు, వంగా గిరిజాపతి, కనగాల వెంకట్రావు, భూక్యప్రసాద్, వంగ చిన్న పందు తదితరులు పాల్గొన్నారు.

వీరనారి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో

ప్రజా ఉద్యమాలు నిర్మించాలి



- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు
- సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయంలో ఐలమ్మ వర్ధంతి

నవతెలంగాణ-ఖమ్మం
సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడడమే ఐలమ్మకు నిజమైన నివాళి అనిసీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. తెలంగాణ సాయుధపోరాట యోధురాలు వీరనారి అమరజీవి చిట్యాల ఐలమ్మ 38వ వర్ధంతి సభ సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని సుందరయ్య భవన్‌లో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఆర్.ప్రకాష్ అధ్యక్షతన సభ జరిగింది. తొలుత ఐలమ్మ చిత్రపటానికి నున్నా నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళ్ళరించారు. ఈ సభలో నున్నా నాగేశ్వర రావు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం జరిగిన చారిత్రిక ఉద్యమంలో 4వేల మంది అసువులు బాశారని, 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారని తెలిపారు. వీరనారి చాకలి ఐలమ్మ పాలకుర్తి గ్రామంలో విసునూరు దొరకు వ్యతిరేకంగా తన కౌలు భూమి రక్షణ కోసం ఆంధ్ర మహాసభలో చేరి, విస్నూరు దొరకు వ్యతిరేకంగా వీరోచితంగా కమ్యూనిస్టు పార్టీ సహకారంతో పోరాడిందని, ఐలమ్మ పోరాటం పేద ప్రజలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. నేటి పాలకులు ఆనాడు సాధించినటువంటి భూసంస్కరణల చట్టాన్ని 70 ఏళ్ల కాలంలో తుంగలో తొక్కారని విమర్శించారు. నేటికీ తెలంగాణ ప్రాంతంలో బడుగు బలహీనవర్గాల పైన



అణచివేత, దోపిడీ సాగుతుందని, దీనికి వ్యతిరేకంగా సంఘటితం కావాలని పిలుపునిచ్చారు.
తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసి వాటిని ఇంతవరకు అమలు చేయలేదని విమర్శించారు. చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితో ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా గా పోరాటాలు చేయడమే ఆమెకు నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పోన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్, మాచర్ల భారతి, రాష్ట్ర నాయకులు యం.సుబ్బారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బుగ్గవీటి సరళ, బండి రమేష్, జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్, మెరుగు సత్యనారాయణ, బండి పద్మ, విష్ణు,బషీర్, శీలం నర్సింహ రావు, నాయకులు భూక్యా శ్రీను, టీ.యల్.నర్సయ్య, మాచర్ల గోపాల్, విప్లవకుమార్, డాక్టర్ భారవి, యస్.కె. అఫ్జల్, జె.నాగేశ్వరరావు, భాగం అజిత,నాదెండ్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రజాకార్లను తరిమికొట్టిన వీరురాలు ఐలమ్మ
ఖమ్మం రూరల్ : రజాకార్లను తరిమికొట్టిన వీరురాలు చిట్యాల ఐలమ్మ అని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని తెల్దారుపల్లి గ్రామంలో ఆదివారం చిట్యాల ఐలమ్మ 38వ వర్ధంతి సభను కొక్కినేని లెనిన్ అధ్యక్షతన సిపిఎం గ్రామ శాఖ, రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్యాల ఐలమ్మ, తమ్మినేని సుబ్బయ్య, సత్తెనపల్లి రామకృష్ణ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకురాలు తమ్మినేని



కమలమ్మ సీపీఎం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. తెల్దారుపల్లి సర్పంచ్ సిద్దినేని కోటయ్య మాట్లాడుతూ తెల్దారుపల్లి గ్రామం కూడా జాగీర్ పాలనలో ఉండేదని, దొర ఆకృత్యాలు భరించలేక తమ్మినేని సుబ్బయ్య నాయకత్వంలో గ్రామ యువకులు, రైతులు జాగీరుదార్ ను తరిమికొట్టారని తెలిపారు. ఐలమ్మ జీవితాన్ని ప్రతి మహిళా అధ్యయనం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జోన్ కన్వీనర్ తమ్మినేని వెంకట్రావు,మండల కమిటీ సభ్యులు రంజాన్ పాషా, ఐద్వా మండల కార్యదర్శి పెండ్యాల సుమతి,సీపీఎం మండల నాయకులు యర్రా నరసింహారావు,పాము ఉపేందర్, రజక వృత్తి దారుల సంఘం నాయకులు పోతురాజు సైదులు, అప్పారావు, తిరపయ్య, సావిత్రి, సిరికొండ వీరమ్మ సైదమ్మ, నాగేశ్వరరావు, పుల్లయ్య, గొర్రెల మేకల సంఘం నాయకుడు గజ్జి పట్టాభి, కేజీకేయస్ నాయకులు జలగం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ స్ఫూర్తితో మరో భూ పోరాటానికి సిద్ధం కావాలి
నేలకొండపల్లి : వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం, తుపాకీ పట్టిన మట్టి మనిషి చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితో పేదలు మరో భూ పోరాటానికి సిద్ధం కావాలని సిపిఐ(ఎం) మండల కార్యదర్శి కెవి రామిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయం రావెళ్ల సత్యనారాయణ భవనంలో చిట్యాల ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ నాటి సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ నైజాం నవాబుకు, జమీందారులకు వ్యతిరేకంగా, దున్నేవాడికే భూమి కావాలని ఉద్యమించిన తీరు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. తన భూమిని విసునూరు దేశముఖ్ రామచంద్రారెడ్డి ఆక్రమించుకోవడానికి వచ్చిన సమయంలో ఐలమ్మ ఎర్ర జెండా పట్టి భూస్వామిని ఎదిరించి, సంఘం అండతో తన భూమిని కాపాడుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, ఏటుకూరి రామారావు, రచ్చనరసింహారావు, దుగ్గి వెంకటేశ్వర్లు. పగిడికత్తుల నాగేశ్వరరావు, దండ సూర్యనారాయణ, కె జానకి, మంగమ్మ, కాసాని లక్ష్మి, లక్ష్మీనారాయణ, మల్లికార్జున్, యం, నరసింహారావు, బొడ్డు ఆంజనేయులు తధితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో
సత్తుపల్లి రూరల్ : భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఆనాటి దొరల గడియలను బద్దలు కొట్టిన చిట్యాల ఐలమ్మకు నిజమైన నివాళులు ఆమె ఆశయాలు సాధనకై ప్రజలను పోరాటాల బాట పట్టించడమేనని సత్తుపల్లి సీపీఐ(ఎం) మండల కార్యదర్శి జాజిరి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గంగారం గ్రామంలోని వీరనారి చాకలి ఐలమ్మ సెంటర్ నందు చిట్యాల ఐలమ్మ విగ్రహం వద్ద ఆమె 38 వ వర్ధంతి సభను సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సభకు హాజరైన జాజిరి శ్రీనివాస్ ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కమిటీ సభ్యులు కువ్వారపు లక్ష్మణ రావు, కాకాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వరాలిచ్చేందుకే తెలంగాణకు సోనియమ్మ

- పది లక్షల మందితో సభ విజయవంతానికి ఏర్పాట్లు
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కాంగ్రెస్ శ్రేణులందరూ తరలిరండి
- తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో ఛైర్మన్ పొంగులేటి
- పాలేరు, మధిర, ఖమ్మం, వైరా నియోజకవర్గాల్లో పర్యటన

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి
రాష్ట్ర ప్రజానీకానికి వరాలిచ్చేందుకే తెలంగాణకు సోనియమ్మ వస్తున్నారని ఈ సభను పది లక్షల మందితో విజయవంతం చేసేందుకు టీపీసీసీ నేతృత్వంలో ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో ఛైర్మన్ పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మం రూరల్ మండలాల్లో, మధిర నియోజకవర్గంలోని ముదిగొండ మండలం, ఖమ్మం



నియోజకవర్గం ఖమ్మం నగరంలోని గాంధీచౌక్, బోసుబొమ్మ సెంటర్ ప్రాంతాల్లో, వైరా నియోజకవర్గంలోని కొణిజర్ల, వైరా పట్టణాల్లో ఆదివారం పర్యటించారు. పర్యటనలో భాగంగా ఆయా ప్రాంతాల్లో జరిగిన శు భకార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలువురు బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ఆర్థికసాయాలను కూడా అందజేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన సోనియమ్మ రాబోవు ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టే సంక్షేమ పథకాల వివరాలను తద్వారా తెలంగాణ ప్రజానీకానికి చేకూరే ప్రయోజనాలను వివరించేందుకు ఈనెల 17వ తేదీన హైదరాబాద్ కు వస్తున్నారన్నారు. ఇప్పటికే తెలంగాణ ప్రజల కోసం ఐదు డిక్లరేషన్లు ప్రకటించి స్పష్టమైన హామీ ఇవ్వగా అధికారంలోకి వచ్చాక అమలు చేసే మరికొన్ని వరాలను సోనియమ్మ ప్రకటించనున్నారని తెలిపారు. పది లక్షల మందితో ఈ సభ విజయవంతానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులందరూ లక్షలాదిగా తరలివచ్చి ఈ సభ దిగ్విజయంలో తమ వంతు కీలక పాత్ర పోషించాలని పొంగులేటి పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో పొంగులేటితో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు మద్దినేని బేబి స్వర్ణకుమారి, మెనిఫెస్టో కమిటీ సభ్యులు మువ్వా విజయబాబు, రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ వైస్ ఛైర్మన్ బొర్రా రాజశేఖర్, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, పాలేరు నియోజకవర్గ నాయకులు చావా శివరామకృష్ణ, వైరా నియోజకవర్గ నాయకురాలు విజయబాయి, కార్పొరేటర్ మలీదు జగన్ పాల్గొన్నారు.



ఐలమ్మ చిత్ర పటానికి జీవిఆర్ నివాళి

తల్లాడ : నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన చాకలి ఐలమ్మ వర్ధంతిని తల్లాడ మండలంలో ఆదివారం నిర్వహించారు. తల్లాడలో జీవిఆర్ ఆధ్వర్యంలో, రజక సంఘం జిల్లా నాయకులు తమ్మారపు బ్రహ్మయ్య, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, ఆర్ వీర మోహన్ రెడ్డి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలు వేసిన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ యూసఫ్, ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటేశ్వరావు, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు వెంకట లాల్, పాల్గొన్నారు.
అన్నారుగూడెం గ్రామంలో ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పించారు. చాకలి ఐలమ్మ పోరాట పట్టిమను కొనియాడారు.

సీపీఐ(ఎం), ఐద్వా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం

నవతెలంగాణ-వైరాటౌన్
అధిక ధరలు, నిరుద్యోగం, ఉపాధి హామీ పనులు కుదింపునకు వ్యతిరేకంగా సిపిఐ(ఎం) పాలడుగు గ్రామ శాఖ, ఐద్వా వైరా మండల కమిటీ ఆధ్వర్యంలో పాలడుగు గ్రామంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైరా సొసైటీ డైరెక్టర్ వనమా చిన్న సత్యనారాయణ, ఐద్వా మండల కార్యదర్శి షేక్ షైనాబి, సిపిఐ(ఎం) వైరా మండల కమిటీ సభ్యులు ఎస్కే మజీద్, ఐద్వా మండల నాయకులు ఎస్.కె మజీద్ బి, ఎస్ కె రిహానా, సయ్యద్ ఫాతిమా, బల్గూరి సైదుబాబు, మోదుగు యేసు, జయరాజు, మోదుగు మురళి, మోదుగు శ్రీను, మోదుగు వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ నగర్‌లో ముత్యాలమ్మ తల్లికి పూజలు

నవతెలంగాణ తల్లాడ
మండల పరిధిలో లక్ష్మీ నగర్ గ్రామంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న ముత్యాలమ్మ అమ్మవారి మూడవ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు.
గోపాల్‌పేట గ్రామ సర్పంచ్ నల్లమోతు మోహన్ రావు, అన్నారుగూడెం గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మెన్ మారెళ్ళ మల్లికార్జునరావు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా భక్తులు కుటుంబ సమేతంగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోపాలపేట మాజీ సర్పంచ్ సుంకర కృష్ణయ్య, అన్నారుగూడెం మాజీ ఎంపీటీసీ తాళ్ళ జోసెఫ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పొన్నం కృష్ణయ్య, ముస్లిం మైనార్టీ నాయకులు మహమూద్ భాష పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను జయప్రదం చేయండి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం
తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మంలోని సుందరయ్య భవన్లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా కమిటీ సమావేశం మెరుగు సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం , వెట్టిచాకిరి ,విముక్తి కోసం ఆంధ్ర మహాసభ సహకారంతో తెలంగాణ పోరాటం జరిగిందని ,ఆ పోరాట వారసత్వంతో 10 లక్షల ఎకరాల భూమి పేదలకు పంపకం జరిగిందని ఆయన అన్నారు. కానీ నేడు కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి కులం, మతం, ముందుకు తెస్తూ మత ఉన్మాదాన్ని రెచ్చగొట్టి హిందుత్వం పేరుతో ప్రజల్ని ,పేదలని, చీల్చుతుందని ఆయన విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక వ్యవసాయ కార్మికులకు పేదలకు సాయం చేసే ఏ ఒక్క సంక్షేమ పథకంతేలేదని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వాలు తెచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని నీరు గారుస్తుందని ఏటేటా షరతులు పెడుతూ, బడ్జెట్ తగ్గిస్తూ పేదలకు అన్యాయం చేస్తుందని ఆయన విమర్శించారు. తెలంగాణ పోరాటాన్ని హిందూ, ముస్లిం పోరాటంగా, చిత్రీకరించేందుకు బీజేపీ ప్రయత్నిస్తుందని, వాస్తవాలను ప్రజలకు తెలపడం ద్వారా భూమి, భుక్తి, విముక్తి కోసం, వెట్టిచాకిరీకి, వ్యతిరేకంగా జరిగిన చారిత్రక తెలంగాణ పోరాటాన్ని నేటి ప్రజలకు తెలియజేయాలని దానికోసం ఆదివారం నుండి ఈ నెల 17 వరకు గ్రామ, గ్రామాన, వార్షికోత్సవ సభలు జరపాలని ఆయన పిలుపునిచ్చారు.
తొలుత సనాతన వాదం, సంస్కరించాల్సిన అవసరం, అంశం మీద స్టడీ సర్కిల్ బాధ్యులు షేక్ రఫీ బోధించారు. సమాజంలో మత ఉన్మాదం పెరుగుతుందని మైనార్టీలకు రక్షణ లేకుండా పోతుందని ఆయన అన్నారు. సనాతన సంప్రదాయాలు నేటి ప్రజలకు అవసరం లేకున్నా



కొందరు పనిగట్టుకుని ముందుకు తెచ్చి ప్రజలను గందరగోళపరుస్తున్నారని ఈ గందరగోళంలో ప్రజలు పడవద్దని అన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా నాయకులు ఎర్రా శ్రీనివాసరావు, పొన్నెకంటి సంగయ్య, వత్సవాయి జానకి రాములు, కొండబోయిన నాగేశ్వరరావు, వడ్లమూడి నాగేశ్వరరావు, తేలపోలు రాధాకృష్ణ, బంధం శ్రీనివాస్, వి.భద్రయ్య, జి. జోగయ్య, యనమనగండ్ల రవి, మూడు గన్య, దుగ్గి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ మువ్వా

14వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రచారం

నవతెలంగాణ-ఖమ్మం
గడప గడపకూ కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యక్రమాన్ని ఆ పార్టీ మేనిఫెస్టో కమిటీ సభ్యులు మువ్వా విజయబాబు 14వ డివిజన్‌లో ఆదివారం నిర్వహించారు. డివిజన్ లోని ప్రతి గడపకు తిరుగుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అమలు చేయబోయే సంక్షేమ పథకాలను కరపత్రాన్ని అందజేసి వివరించారు. వృద్ధులను,



వికలాంగులను, మహిళలను, చిన్నారులను ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారం చేపట్టాక ఆ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మువ్వా మాట్లాడుతూ ఖమ్మం నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని రాబోవు మూడునెలల్లో కాంగ్రెస్ పార్టీదే అధికారమని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
6
ఖమ్మం
సోమవారం | సెప్టెంబర్ 11, 2023 | www.navatelangana.com

కాలువకు గండి కొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

- ముచ్చటగా మూడోసారి గండి
- వారిపై చర్యలు తీసుకుంటామన్న అధికారులు

నవతెలంగాణ-కల్లూరు



మండల పరిధిలో గల రఘునాథ బంజర గ్రామ సమీపంలో మధిర మెయిన్ కెనాల్‌కు అనుసంధానంగా ఉన్న మునుకుళ్ళ మేజర్ కాలువ కట్టకు గుర్తుతెలియని దుండగులు గండిపెట్టారు. గతంలో కూడా కొంతమంది వ్యక్తులు రెండుసార్లు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా నీటి చోరీకి పాల్పడుతూ కాలువకు గండిపెట్టిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అయినా అధికారులు పట్టించుకోలేదని రైతుల ఆరోపిస్తున్నారు. ఒకపక్క ప్రభుత్వం రైతుల పొలాలకు నీరు అందించేందుకు అహర్నిషలు శ్రమిస్తూ ఉంటే కిందిస్థాయి అధికారులు నిర్లక్ష్యం మూలాన నీరు దుర్వినియోగంఅవుతున్నాయి. ఈ కాలువకు గండి పెట్టిన దుండగులు ఎవరు, ఎందుకు చేశారో తెలియాల్సి ఉంది. నీటితో పొలాలు మునిగిపోయి దుగాలకు గండ్లు పడుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. రఘునాథ బంజర ఆయకట్టు అక్కపాలెం వెళ్లే కాలువ కట్టకు ఈ గండి పెట్టడం వలన నీళ్ల వృధాగా పోతూ పొలాలను నాశనం చేస్తున్నాయి. దీనిపై చంద్రుపట్ల గ్రామానికి చెందిన కొంతమంది రైతులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. చంద్రుపట్ల గ్రామానికి చెందిన రైతులు ఎన్ఎస్పి కార్యాలయం వద్దకు చేరుకుని అధికారులను ఫోన్లో సంప్రదించగా వారిని రేపు పిలిపించి మాట్లాడతామని చెప్పి పంపించినట్లు సమాచారం. ఇట్టి విషయంపై డిఇఇ రత్నాకర్‌ను వివరణ కోరగా ఆయన స్పందిస్తూ వెంటనే గండి పూడ్చేందుకు చర్యలు తీసుకుంటామని, కాలువకు గండిపెట్టిన దుండగులను గుర్తించి చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. కాలువ గండిని పుడుస్తారో లేదో వేచి చూద్దాం..

ఫుడ్ కార్పొరేషన్ బోర్డు సభ్యురాలికి సత్కారం

నవతెలంగాణ-కల్లూరు



తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ బోర్డుసభ్యులుగా భూక్య జ్యోతి రాము నాయక్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బీరవల్లి రఘు, జెడ్పిటిసి కట్టా అజయ్ కుమార్, టిఆర్ఎస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు పాలె పు రామారావు, ఏఎంసి వైస్ చైర్మన్ కాటమనేని వెంకటేశ్వరరావు, రైతు సమితి మండల కన్వీనర్ లక్కినేని రఘు, మేకల కృష్ణ, కొరకోప్పు ప్రసాద్, సర్పంచులు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

స్వాగత్ రెస్టారెంట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కల్లూరు

పట్టణలోని స్వాగత్ రెస్టారెంట్ ను ఆదివారం సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య, సర్పంచ్ లక్కినేని రఘు, కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైతు సమితి మండల కన్వీనర్ లక్కి నేను రఘు, చెన్నూరు సొసైటీ అధ్యక్షుడు పాలపు రామారావు, టిఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చైతన్యానికి ప్రతీక వీరనారి ఐలమ్మ

నవతెలంగాణ ఖమ్మం

తెలంగాణ సమాజం చైతన్యానికి ప్రతీకగా వీరనారి ఐలమ్మ నిలిచారని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఖమ్మంలోని ధర్నాచౌక్లో ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, యర్రా బాబు పాల్గొన్నారు.

కోలుకున్న కందుకూరు కాలనీవాసులు

నవతెలంగాణ-వేంసూరు

విష జ్వరాలు, డెంగ్యూ వ్యాధులతో గత వారం రోజులుగా కందుకూరు పంచాయతీ పాలకవర్గం సిబ్బంది కృషితో జ్వరాల బారి నుండి కోలుకున్నారు. ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆదేశాల మేరకు రాజ్యసభ సభ్యులు బండి పార్థసారథిరెడ్డి సౌజన్యంతో వైద్య శిబిరాలు నిర్వహించడం జిల్లా అధికారుల ఆదేశాలు మేరకు గ్రామంలో సంపూర్ణ పారిశుధ్యం కాలనీలో ఎప్పటికప్పుడు రక్త నమోనాలను సేకరించి పరీక్షలు నిర్వహించడం తో కందుకూరు ప్రశాంత వాతావరణం నెలకొంది.

పాండవుల దేవాలయానికి రాయల విరాళం

నవతెలంగాణ-నేలకొండపల్లి

మండల కేంద్రంలో ఇటీవల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నేలకొండపల్లి మండల కేంద్రంలో కట్టలమ్మ చెరువు కట్ట వద్ద నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి పాండవుల దేవాలయానికి టిపిసిసి సభ్యులు రాయల నాగేశ్వరరావు ఆదివారం 25 వేల రూపాయల విరాళం అందజేశారు. అనంతరం మండలంలోని కోరట్లగూడెం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బోదులబండ సొసైటీ వైస్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బయ్యను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ సేవాదల్ కన్వీనర్ బచ్చలకూరి నాయగరాజు, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ, పాల్గొన్నారు.



ఐద్వా ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి

ఖమ్మం : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారి ఐలమ్మ వర్ధంతిని ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఖమ్మం లోని సుందరయ్య భవన్ లో ఐద్వా ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వీరనారి చిట్యాల ఐలమ్మ 38 వర్ధంతి సభ జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి, అధ్యక్షురాలు బండి పద్మ ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ, అఫ్రోజ్ సమీన, మెరుగు రమణ, మేహరున్నిసా బేగం, బేబీ, బాగం అజిత తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ స్పూర్తితో కెసిఆర్‌కు బుద్ధి చెప్పాలి

నేలకొండపల్లి : చాకలి ఐలమ్మ ఉద్యమ స్పూర్తితో రానున్న ఎన్నికల్లో కేసీఆర్‌కు తగిన బుద్ధి చెప్పాలని బీసీ జేఏసీ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ పాగర్తి సుధాకర్ పిలుపునిచ్చారు. నేలకొండపల్లిలోని చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) మండల నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు, బీసీ జేఏసీ పాలేరు నియోజకవర్గ నాయకులు దేవరశెట్టి రాము, అన్నవరపు రాములు, మండల అధ్యక్ష కార్యదర్శులు తోగాటి నాగచారి, పిట్టల సూరిబాబు, ఉపేంద్ర చారి పాల్గొన్నారు.

రైస్ మిల్లు ప్రారంభించిన మంత్రి

నవతెలంగాణ-ముదిగొండ

ముదిగొండ పారిశ్రామిక ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన బొమ్మ సత్యనారాయణ సత్యసాయి రైస్ మిల్లును రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైస్ మిల్లులో నాణ్యమైన ధాన్యమును ఆడించి వినియోగదారులకు బియ్యాన్ని అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు, ఎంపీపీ సామినేని హరిప్రసాద్, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ పోట్ల ప్రసాద్, ఖమ్మం కార్పొరేటర్ కమర్తపు మురళి, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, ఖమ్మం పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పగడాల నాగరాజు, రైస్ మిల్లుల ఓనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు బొమ్మ రాజేశ్వరరావు, రైస్ మిల్లు మేనేజింగ్ డైరెక్టర్ బొమ్మ వేణు, సూపర్వైజర్ ప్రేమమ్ పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ త్యాగం వృథా కానివ్వం



తిరుమలాయపాలెం : భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రజల పక్షాన నిలబడి తన జీవితాన్ని అంకితం చేసిన వీరనారి చిట్యాల ఐలమ్మ త్యాగం వృథా కానివ్వమని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొమ్ము శ్రీను తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో గజ్జల వెంకటయ్య భవనంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాగాటి సురేష్, కొమ్ము నాగేశ్వరరావు, సోమపువ్వు రాము, సీమ మధు, కొమ్ము కిరణ్, గుండు నాగరాజు, ఏనుకూరు నాగరాజు, రాజేష్, సుంచు మహేష్, వెంకన్న, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి : సత్తుపల్లిలో చాకలి ఐలమ్మ వర్ధంతిని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. స్థానిక ఐలమ్మ విగ్రహానికి సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు, సత్తుపల్లి పట్టణ కార్యదర్శి రావుల రాజబాబు పూలమాలలేసి నివాళులర్పించారు.

అంగన్వాడీలకు బెదిరింపులు

- సమ్మెలోకి వెళ్తే ఉద్యోగం తొలగిస్తామని ఐసీడీఎస్ హెచ్చరికలు

నవతెలంగాణ-బోనకల్



తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం నుంచి అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు తలపెట్టిన నిరవధిక సమ్మెలో పాల్గొనవద్దని మధిర ఐసిడిఎస్ అధికారులు అంగన్వాడీ కార్యకర్తలను గత వారం రోజుల నుంచి బెదిరిస్తున్నట్లు పలు అంగన్వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 22 గ్రామాలలో అంగన్వాడీ కేంద్రాలలో 57 మంది అంగన్వాడీ కార్యకర్తలు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో 52 మంది ఆయాలు విధులు నిర్వహిస్తున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సీఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు సమ్మెకు దిగనున్నారు. దీంతో మధిర ఐసీడీఎస్ అధికారులు అంగన్‌వాడీ కార్యకర్తల, ఆయాలతో సమావేశాలు ఏర్పాటు చేసి సమ్మెలోకి వెళ్ళవద్దని సమ్మెలోకి వెళితే మీ ఉద్యోగాలను ప్రభుత్వం తొలగిస్తుందని బెదిరింపులకు దిగుతున్నారు. గత వారం రోజుల నుంచి అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ఐసిడిఎస్ అధికారుల బెదిరింపులతో తీవ్ర మనోవేదన చెందుతున్నారు. తమ సమస్యలను పరిష్కారం చేయాలని తమ ఆందోళన చేస్తుంటే మధిర ఐసిడిఎస్ అధికారులు సమ్మెలోకి వెళితే ఉద్యోగం నుంచి తొలగిస్తామని బెదిరించడం పట్ల తీవ్ర అసంతృప్తి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సూపర్వైజర్ నుంచి మధిర సిడిపిఓ వరకు తాము కూడా ఉద్యోగులమనే భావన మర్చిపోయినట్లు ఉందని, ప్రభుత్వం చెప్పినట్లు ఐసిడిఎస్ అధికారులు తమపై బెదిరింపులకు పాల్పడుతున్నారని అంగన్వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేసే హక్కు కూడా తాము లేదా అని ఐసీడీఎస్ అధికారులు వారు ప్రశ్నిస్తున్నారు. చివరకు ఆయాలనైన అంగన్వాడీల కేంద్రాలలో ఉంచాలని ఐసీడీఎస్ అధికారులు అంగన్వాడీ కార్యకర్తలకు హుకుం జారీ చేస్తున్నారు. ఐసిడిఎస్ అధికారుల బెదిరింపులతో మండలంలో చాలామంది అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మెలోకి వెళితే ఏమవుతుందోనని, వెళ్లకపోతే ఏమవుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మధిర ఐసిడిఎస్ అధికారులు తమను వేధింపులకు గురి చేయటం మానుకోవాలని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు కోరుతున్నారు.



వీరనారి చాకలి ఐలమ్మ

- మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

నవతెలంగాణ-ఖమ్మం

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ (చిట్యాల ఐలమ్మ) వర్ధంతి సందర్భంగా రాష్ట రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఆదివారం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి వద్ద గల చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం పాలనకు, విసునూరు దేశ్‌ముఖ్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఆమె అనాడు చేసిన ఉద్యమమే తెలంగాణ సాయుధ పోరాటానికి నాంది అయిందని, ఆ తర్వాత మలిదశ తెలంగాణ ఉద్యమానికి స్పూర్తి అయ్యిందని మంత్రి అన్నారు. చాకలి ఐలమ్మ ధైర్యం, తెగువ.. ఆనాటి దేశ్‌ముఖ్‌లు, రజాకార్ల గుండెల్లో దడ పుట్టించాయన్నారు. ఒకవైపు సాయుధ పోరాటం చేస్తూనే మరోవైపు అమ్మలా ఉద్యమకారులకు అన్నం పెట్టిన మహనీయురాలు ఐలమ్మ అని కీర్తించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఆర్జేసి కృష్ణ, కార్పొరేటర్‌లు బిజి. క్లెమెంట్, దండా జ్యోతి రెడ్డి, పగడాల నాగరాజు, అమర గాని వెంకన్న, ఎస్కె షకీన, పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్టీ, బీసీ మైనార్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి

లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పిఎస్) జిల్లా కార్యాలయంలో ఆదివారం ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు బద్రు నాయక్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ షేక్ నజీమా, కో కన్వీనర్స్ జి. నరేంద్ర, అబ్దుల్ రెహమాన్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయండి

నవతెలంగాణ-బోనకల్

సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు కోరారు. మండలం లోని రావపల్లి గ్రామంలో సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన మహత్తర పోరాటమే తెలంగాణ సాయుధ పోరాటం అన్నారు. నాటి త్యాగాలను నేటి తారాలకు తెలియజేసేందుకు 11 వ తేదీని నుండి 17వ తేదీ వరకు సాయుధ పోరాట 75వ వార్షికోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. వారోత్సవాలను రావపల్లి గ్రామంలో ఈనెల 11న తెలంగాణ సాయుధ పోరాట యోధుడు నల్లమల సత్యనారాయణ స్థూపం వద్ద ప్రారంభ సూచికంగా నివాళులర్పించి ప్రారంభ సభను నిర్వహించున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ మండల నాయకులు ఏనుగు రవికుమార్, ఏనుగు రామకృష్ణ, వేణు తదితరులు పాల్గొన్నారు.

నెల నెల వైద్య శిబిరం విజయవంతం

- 181 మంది రోగులకు వైద్య సేవలు

నవతెలంగాణ-నేలకొండపల్లి



సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి నూతక్కి గంగాధర్ రావు సేవా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సీపీఐ(ఎం) కార్యాలయం రావెళ్ల సత్యనారాయణ భవనంలో జరిగిన నెల నెల వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ వైద్య శిబిరంలో 181 మంది రోగులకు డాక్టర్లు వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరంలో షుగర్, బీపీ, గ్యాస్ ట్రబుల్ జబ్బులకు నెలకు సరిపడా మందులను కేవలం 100 రూపాయలకే అందించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ కొల్లి అనుదీప్(ఎండి జనరల్ మెడిసిన్), డాక్టర్ గుడిపూడి రాజేష్ (చెవి ముక్కు గొంతు ప్రత్యేక వైద్యులు), డాక్టర్ హస్నద్ బాబా (ఎంబీబీఎస్) రోగులకు వైద్య సేవలు అందించారు. 85 మంది షుగర్ వ్యాధిగ్రస్తులకు, 28 మందికి చెవి ముక్కు గొంతు సమస్యలకు, 36 మందికి సాధారణ జబ్బులకు వైద్య సేవలు అందించగా మరో 32 మందికి శరత్ మాక్సి విజన్ వారిచే కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. నేలకొండపల్లి గ్రామీణ వైద్యుల సంఘం నుండి బండి పుష్పలత, నాగేశ్వరరావు, తానీషా, రోగులకు బిపి చెకప్ చేయగా, వసుంధర ఒకేషనల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఈగ అనిల్ కుమార్, విద్యార్థులు షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌జీఆర్ సేవ కమిటీ కన్వీనర్ ఏటుకూరి రామారావు మాట్లాడుతూ నెల నెల వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందన్నారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై పోరాటాలకే పరిమితం కాకుండా సేవా కార్యక్రమాలను కూడా విస్తతంగా చేపట్టాలనే లక్ష్యంతో ప్రతి నెల వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో వీటికి అనుబంధంగా మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. సేవా కార్యక్రమాల నిర్వహణకు ప్రతినెలా సహకరిస్తున్న దాతలకు, డాక్టర్లు, సిబ్బంది, వాలంటీర్లు, ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీఆర్ సేవాకమిటీ సభ్యులు కె.వి రామిరెడ్డి, గుడవర్తి నాగేశ్వరరావు, దుగ్గి వెంకటేశ్వర్లు, శీలం అప్పారావు, దండ సూర్యనారాయణ, వల్లంచెట్ల భాస్కరరావు, అపర్ణ, సతీష్, యం నరసింహారావు, భార్గవ, మల్లికార్జున్ వాలంటీర్లుగా సహకరించారు.

స్వాగత్ ఐ కేర్ హాస్పిటల్ ప్రారంభించిన మదన్ లాల్

నవతెలంగాణ-వైరాటౌన్



వైరా మున్సిపాలిటీ పరిధిలోని బస్టాండ్ వద్ద నూతన అంగులతో పెద్దప్రోలు మదురి, నవీన్ దంపతులు ఏర్పాటు చేసిన స్వాగత్ ఐ కేర్ హాస్పిటల్ ను ఆదివారం వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్ లాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటి వైద్య నిపుణురాలు పెద్దప్రోలు మాధురి బానోత్ మదన్ లాల్ కు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం బాణోత్ మదన్ లాల్ మాట్లాడుతూ అన్ని సౌకర్యాలతో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా బస్టాండ్ సమీపంలో ఐ కేర్ హాస్పిటల్ ప్రారంభించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ మరికంటి డేడి కుమారి, మాదినేని సునీత ప్రసాద్, సొసైటీ డైరెక్టర్ దోంతేబోయన వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ వైరా మండలం, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, మద్దెల రవి, మాదినేని దుర్గాప్రసాద్, కొత్తా వెంకటేశ్వరావు, వనమా చిన్ని, రెబ్బవరం సర్పంచ్ సాధం రామారావు, ఏదునూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలకు 15 సీట్లు కేటాయించాలి

- 40 అసెంబ్లీ నియోజకవర్గాల్లో
- ముస్లింల నిర్ణయాత్మక శక్తి వుంది
- నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావీద్

నవతెలంగాణ-ఖమ్మం



జిల్లా నియోజకవర్గాలలో కాంగ్రెస్ పార్టీ బి ఫామ్ పంపిణీలో న్యాయం చేయాలని కోరుతూ ఆదివారం హైదరాబాద్ లో కాంగ్రెస్ మైనారిటీ నేతలు స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్, తెలంగాణ ప్రచార కమిటీ ఉపాధ్యక్షుడు అజ్మతుల్లా హుస్సేనీ, ప్రదేశ్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తాహిర్ బిన్ హమ్దాన్, ప్రదేశ్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఉబైదుల్లా కొత్వాల్, గాంధీభవన్‌లో స్క్రీనింగ్ కమిటీతో ప్రొఫెసర్ రియాజ్ అహ్మద్, మహ్మద్ అయూబ్, మహ్మద్ జహీర్‌లు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావీద్ మాట్లాడుతూ తెలంగాణలో మైనారిటీ జనాభా దాదాపు 14 శాతం ఉందని, అందులో ముస్లిం మైనారిటీలు 12 శాతం ఉన్నారని కమిటీకి వివరించామని తెలిపారు. 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 40 నియోజకవర్గాల్లో మైనారిటీ ఓటర్లు నిర్ణయాత్మక స్థానంలో ఉన్నారని, కర్నాటకలో కాంగ్రెస్ విజయం తర్వాత తెలంగాణలోని మైనార్టీలు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. అలాంటప్పుడు మైనార్టీల విశ్వాసం పొందాలంటే టిక్కెట్ల పంపిణీలో మైనార్టీ ప్రజాప్రతినిధులకు సరైన ప్రాతినిధ్యం కల్పించాలని హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లో కూడా ముస్లిం నేతలు టిక్కెట్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారని కమిటీకి సమాచారం అందించారు. ముఖ్యంగా ఖమ్మం నిజామాబాద్, వరంగల్, ఆదిలాబాద్, మహబూబ్ నగర్‌లోని మైనారిటీ జనాభా నియోజకవర్గాల నుంచి టికెట్లు అభ్యర్థించారని తెలిపారు. ప్రతి ఎన్నికల్లోనూ ముస్లింలకు ఎక్కువ టిక్కెట్లు ఇస్తామని హామీ ఇస్తున్నారని, అయితే నిక్కచ్చిగా బి ఫామ్ పంపిణీ చేసే సమయంలో ముస్లిం నేతలకు అన్యాయం జరుగుతోందని స్క్రీనింగ్ కమిటీ చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. ముస్లింలకు మరిన్ని టిక్కెట్లు కల్పించేందుకు సానుభూతితో పరిశీలిస్తామని కమిటీ చైర్మన్ మురళీధరన్ హామీ ఇచ్చారని తెలిపారు.

ఎక్స్ అఫీషియో సభ్యునిగా మద్ది శ్రీనివాస్ రెడ్డి నియామకం

ఖమ్మం : ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ సంస్థాగత వ్యవహారాల ఇంచార్జి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసి వేణుగోపాల్ 8 కమిటీలను ప్రకటించగా, టీపీసీసీ ఛార్జిషీట్ కమిటీ ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ మద్ది శ్రీనివాస్ రెడ్డికి స్థానం దక్కింది. ఈ సందర్భంగా మద్ది మాట్లాడుతూ సహకరించిన రేణుకా చౌదరి, రేవంత్ రెడ్డి, మల్లు భట్టి విక్రమార్కలకు కృతజ్ఞతలు తెలిపారు.

లచ్చగూడెంలో ఘనంగా ముత్యాలమ్మ జాతర

చింతకాని : మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలో ఆదివారం ఘనంగా ముత్యాలమ్మకు మహిళలు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలందరూ పాలు పొంగళ్ళతో ముత్యాలమ్మ తల్లికి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గురజాల ఝాన్సీ, వైస్ ఎంపీపీ గురజాల హనుమంతరావు పాల్గొన్నారు.

ఐలమ్మ పోరాటాలు నేటితరానికి స్పూర్తి

నవతెలంగాణ-కారేపల్లి

రజాకార్ల అరాచకాలకు ఎదురొడ్డి పోరాడిన ఐలమ్మ పోరాటాలు నేటి తరానికి స్పూర్తి అని రజక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జూపల్లి కష్ణ అన్నారు. మండల కేంద్రమైన కారేపల్లిలో ఆదివారం జిల్లా రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆకలి ఐలమ్మ వర్ధంతిని జరిపారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు ఆర్పించారు. ఈ కార్యక్రమంలో చెరుకూరి వీరభద్రం, జూపల్లి లాలయ్య, తనకం విజయ్ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ రైతుకు రుణాలు ఇవ్వాలి

- రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు డిమాండ్

నవతెలంగాణ-నేలకొండపల్లి



అర్హులైన ప్రతి రైతుకు బ్యాంకులు రుణాలు ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ(ఎం) కార్యాలయంలో తెలంగాణ రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం రచ్చ నరసింహారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రుణాల మంజూరులో బ్యాంకర్లు నో డ్యూస్ సర్టిఫికెట్ పేరుతో ఇబ్బందులకు గురి చేయటం దారుణమన్నారు. గత ఐదేళ్లుగా ముఖ్యమంత్రి కెసిఆర్ రైతు రుణాలను ఇచ్చిన హామీ ప్రకారం సకాలంలో మాఫీ చేయకపోవడంతో తెచ్చిన అప్పుకు వడ్డీ రెట్టింపైన కూడా ప్రతి ఏటా తిరిగి ప్రైవేటుగా అప్పులు చేసి రుణాలు రెన్యువల్ చేసుకున్నారన్నారు. గత కొద్ది రోజుల క్రితం ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు రుణాలను మాఫీ చేయగా తిరిగి రుణాల కోసం రైతులు బ్యాంకు వద్దకు వెళ్లగా నో డ్యూ సర్టిఫికెట్ తీసుకురావాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. గత ఐదేళ్లుగా రైతులు అప్పులు రెన్యువల్ చేసుకునే సమయంలో నో డ్యూస్ సర్టిఫికెట్ అడగని బ్యాంకర్లు రుణమాఫీ వచ్చిన తర్వాత ఎందుకు అడుగుతున్నారంటూ ప్రశ్నించారు. ప్రత్యేకించి స్థానిక కోపరేటివ్ బ్యాంకు అధికారులు రైతుల పట్ల చులకన భావంతో వ్యవహరించడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా బ్యాంకర్లు రుణాల మంజూరులో రైతులను ఇబ్బంది పెట్టకుండా సహకరించాలని వారికి మంజూరైన రుణమాఫీని వారి ఖాతాలోనే నేరుగా జమ చేయాలన్నారు. లేని ఎడల రైతులను సమీకరించి బ్యాంకులను ముట్టడించి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు రచ్చ నరసింహారావు, కె.వి రామిరెడ్డి, మంకెనపల్లి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచారం

నవతెలంగాణ - బోనకల్

మండల పరిధిలోని తూటికుంట్ల గ్రామంలో సీపీఐ(ఎం) గ్రామ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఇంటింటికి వెళ్లి కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కమిటీ సభ్యులు నోముల పుల్లయ్య, ఎంపీపీ కంకణాల సౌభాగ్యం, మాజీ ఎంపీపీ తుళ్లూరు రమేష్ మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రజా సమస్యలపై ధర్నా కార్యక్రమం ఉందన్నారు. ఈ ధర్నా కార్యక్రమానికి గృహలక్ష్మి, ఇళ్ల స్థలాలు, దళిత బంధు, రేషన్ కార్డులు, బిసి, మైనార్టీ లోన్లు ఇంకా ఇతర సమస్యలు ఉన్నవారు హాజరుకావాలని వారు కోరారు. ప్రజా సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న వారందరికీ అందజేయాలని, వివిధ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రజా సమస్యలు సాధ్యమైనంత త్వరగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని లేనిచో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వ అధికారులను హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శులు పాపినేని అప్పారావు, పాపినేని రమేష్, పాపినేని వెంకట్రావు, సొసైటీ డైరెక్టర్ దుంపల మార్తమ్మ, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, పనితి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



కొత్త అధ్యక్ష పదవి చెల్లదు



నవతెలంగాణ-మణుగూరు

కొత్త అధ్యక్ష పదవులు చెల్లవని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గురజాల గోపి అన్నారు. ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గోపి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టీపీసీసీ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ గౌరవనీయులు ముఖేష్ కుమార్ గౌడ్ ఆదేశానుసారం మణుగూరు మండల కొత్త అధ్యక్ష పదవి చెల్లదని అని అన్నారు. టీపీసీసీ ఆమోదం లేకుండా ఇచ్చిన పదవులు చెల్లుబాటు కాదని, మీడియా మిత్రులు గమనించాలని తెలిపారు. సెప్టెంబర్ 9 హైదరాబాద్‌లో జరిగినటువంటి మండల అధ్యక్షుల సమావేశానికి అనారోగ్య కార్యుల వలన హాజరు కాలేకపోయానని అన్నారు. గాంధీభవన్ నుండి మణుగూరు మండల ప్రెసిడెంట్ గురిజాల గోపి అని పాస్ కూడా పంపించారని తెలిపారు. పాత మండల కమిటీలు కొనసాగటానికి సహకరించిన మహేష్ కుమార్ గౌడ్, మాజీ కేంద్ర మంత్రి రేణుక చౌదరికి ధన్యవాదాలు తెలిపారు.

వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న మోడీ ప్రభుత్వం : ఎస్‌కేఎం



నవతెలంగాణ-టేకులపల్లి

భారత దేశంలో బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదామని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్లు రేపాకుల శ్రీనివాస్, బానోత్ ఊక్లాలు పిలుపునిచ్చారు. ఆదివారం టేకులపల్లి మండల కేంద్రంలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల సమావేశం ధర్మపురి వీరబ్రహ్మాచారి అధ్యక్షతన వారు మాట్లాడారు. దేశంలో సహజ వనరులు కార్పొరేట్లకు కట్టబెడుతుందని విమర్శించారు. కార్పొరేట్లకు వ్యవసాయ రంగం పై కన్నుపడిందని, వారికి అనుకూలంగా మోడీ వ్యవసాయ చట్టాలు మార్చాడని, వీటికి వ్యతిరేకంగా ఢిల్లీలో రైతులు పెద్ద ఎత్తున పోరాటం చేశారని తెలిపారు. రైతుల పోరాటానికి మోడీ ప్రభుత్వం వెనక్కి తగ్గి రైతులకు క్షమాపణ చెప్పాడని అన్నారు. మళ్ళీ దొడ్డి దారిన వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్లను తీసుకువస్తున్నారని విమర్శించారు. దీనిని వ్యతిరేకించడం కోసం కార్మిక, కర్షక సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చాగా ఐక్యమయ్యాయని తెలిపారు. మోడీ ప్రభుత్వాన్ని గద్దెదించే వరకు పోరాటం ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు గుగులోత్ రాంచందర్, కడుదుల వీరన్న, భూక్యా నర్సింగ్, గుగులోత్ రాంచంద్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నవరాత్రి వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరపాలి

నవతెలంగాణ-ములకలపల్లి

ఎస్పీ వినీత్ ఆదేశాల మేరకు ములకలపల్లి ఎస్సై సాయి కిషోర్‌రెడ్డి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో పీస్ కమిటీ సమావేశం ఆదివారం పోలీసు స్టేషన్లో నిర్వహించారు. ఈ నెల 18న ప్రారంభం కానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండల పరిసర ప్రాంతాల గణేష్ ఉత్సవ కమిటీలు ముందుగా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. కులమతాలకు అతీతంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని సూచించారు. పోలీసులు నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలని, ఏదైనా సమస్యలుంటే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో గణేష్ ఉత్సవ కమిటీల నిర్వాహకులు పాల్గొన్నారు.

ముస్లింల హక్కుల సాధనకు చలో నల్గొండ



నవతెలంగాణ-చండ్రుగొండ

ముస్లింల హక్కుల సాధనకు చలో నల్గొండ కార్యక్రమం చేపట్టడం జరిగిందని జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ రసూల్ అన్నారు. ఆదివారం చండ్రుగొండ ముస్లిం మైనార్టీలు చలో నల్గొండ కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా రసూల్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల కోసం జమాయితే ఉలమా ఐ హిందీ (జేయుహెచ్) ఆధ్వర్యంలో నల్గొండ క్లాక్ సెంటర్లో బహిరంగ సభ పెట్టడ జరిగిందన్నారు. ఈ సభకు ముస్లిం మైనార్టీలు అధిక సంఖ్యలో పాల్గొంటారన్నారు. ముస్లింలు తమ హక్కులను సాధించటం కోసం ముందుకు సాగేందకు నిర్ణయించుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ముస్లిం, మైనార్టీలు షమీహుస్సేన్, సయ్యద్ రసూల్, అబ్దుల్‌రీజ్, ఎస్కె ఆదామ్, యాకూబ్, దస్తగిరి, యాకూబాసాహెబ్, తాహెర్, అజీమ్, ఎంఏ వాహెద్, తడతరులు పాల్గొన్నారు.

జనంలో జారే....



నవతెలంగాణ-ములకలపల్లి

ములకలపల్లి మండలం, పూసుగూడెం గ్రామంలో హలో శుభోదయం కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు జారే ఆదినారాయణ ఆదివారం పర్యటించారు. మహిళలు పెద్ద ఎత్తున పూల మాలతో స్వాగతం పలికి హారతి ఇచ్చిన అనంతరం ప్రతివీధి ప్రతి ఇంటికి తిరుగుతూ అందరిని ఆప్యాయతగా పలకరిస్తూ, వారి సమస్యలను తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రైతు సమస్యల శాశ్వత పరిష్కారం కోసం, చట్టపరమైన అధికారులతో రైతు కమిషన్ ఏర్పాటు, మహాత్మాగాంధీ జాతీయ పతాకాన్ని వ్యవసాయ పంటలకు అనుసంధానం చేస్తుందని రైతు కూలీలు, భూమి లేని రైతులకు సైతం రైతు భీమా పథకం వర్తింపు చేస్తుందనీ తెలియజేస్తూ, అలాగే కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో పత్రాన్ని ప్రతి ఇంటికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులకు, కార్యకర్తలకు అభిమానులకు ప్రతి ఒక్కరికీ ప్రత్యేకమైన ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బత్తుల అంజి, మాజీ సర్పంచ్ పతేలాల్, మండలం అధ్యక్షులు ఎండి జహిరుద్దిన్, ఉప సర్పంచ్ శనగపాటి అంజి, నియోజకవర్గం యూత్ అధ్యక్షులు కోరంపల్లి చెన్నరావు, కుంజా రవి, అవినాష్, రాజేష్, దుగ్గి సంపత్ కుమార్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గురువే సమాజ మార్గదర్శి

- మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.ఎల్.లక్ష్మణ్ రావు
- యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం



నవతెలంగాణ-కొత్తగూడెం

గురువే సమాజ మార్గదర్శి అని కొత్తగూడెం మెడికల్ కాలేజ్ ప్రధానోపాధ్యాయులు డాక్టర్ ఆర్ఎల్.లక్ష్మణ్ రావు అన్నారు. ఆదివారం గ ం ర ం వ్రా జో త్స వ వారోత్సవాల్లో భాగంగా యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ వ్యవస్థాపకులు బిక్కులాల్ (బాలు) ఆధ్వర్యంలో స్థానిక కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో జరిగిన కార్యక్రమంలో మొదట డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం వివిధ ప్రభుత్వ పాఠశాలలో వృత్తినే దైవంగా భావించి నాణ్యమైన విద్యతో పాటు ఉన్నత విలువల కోసం పాటుపడుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువులే సమాజ మార్గదర్శకులని రేపటి సమాజాన్ని మలిచే ఏకైక వ్యక్తి గురువు అని అలాంటి వారిని సన్మానించుకోవడం అభినంద నీయమన్నారు. దేశవ్యాప్తంగా అత్యవసర పరిస్థితుల్లో సుమారు 17,500 మందికి రక్తాన్ని అందిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుని సేవలను ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా డీఎస్పి అబ్దుల్ రహీం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గౌరవ సలహాదారులు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సంఘం వెంకట పుల్లయ్య, షేక్ దస్తగిరి, లగడపాటి రమేష్, ప్రధాన కార్యదర్శి సతీష్ గుండపునేని, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య, మొక్కల వెంకటయ్య, మొక్కల రాజశేఖర్, క్లబ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు శ్రీరామ్, నర్సింహ కుమార్ పాల్గొన్నారు.

ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలి

- బీసీ సంక్షేమ అధికారి ఇందిర



నవతెలంగాణ-పాల్వంచ

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని బిసి సంక్షేమ అధికారి ఇందిర తెలిపారు. చాకలి ఐలమ్మ 38వ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఐడిఓసి కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి వివిధ కుల సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెత్తందారి వ్యవస్థకు, దొరల పాలనకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ పోరాటం చేశారని గుర్తు చేశారు. మహిళ అయి ఉండి కూడా ప్రజల హక్కుల కోసం ఎలుగెత్తి చాటారని చెప్పారు. దొరల ఆధీనంలో ఉన్న భూములను పేదలకు పంచి సమసమాజ స్థాపనకు కృషి చేసిన ధీరవనిత ఐలమ్మ అని అన్నారు. చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకుని, ఆమె ఆశయాల సాధనకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఓ గన్యా, రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చిటికెన ముసలయ్య, ముదిగొండ రాంబాబు, సుంకర అజిత్ కుమార్, పోలోజు రాజేశ్వరి, పోగుల లక్ష్మీనారాయణ, మాడిశెట్టి శ్రీనివాస్, సత్యనారయణ, కిషోర్, బిసి సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వీర తెలంగాణ విప్లవ నిప్పు కణిక చాకలి ఐలమ్మ

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య

నవతెలంగాణ-కొత్తగూడెం


కొత్తగూడెం

వీర తెలంగాణ సాయుధ పోరాట నిప్పు కణిక చిట్యాల ఐలమ్మ అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. స్థానిక మంచి కంటి భవన్‌లో వీరనారి చాకలి ఐలమ్మ 38వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ముందుగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి అన్నవరపు కనకయ్య నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ విస్నూర్ దేశ్ ముఖ్ రజాకార్ల అరచకాలపై ఎదురు తిరిగి ఎర్రజెండా పట్టింది ఐలమ్మ అని అన్నారు. తమను దొర అని పిలువని ఉత్పత్తి కులాల స్త్రీ మీద తమ భర్తలను ఉసిగొల్పి దగ్గ రుండి అఘాయిత్యం చేయించే రాక్ష నిజాం పాలనలో ఈ భూమి నాది, పండించిన పంట నాది, తీసుకెళ్లడానికి దొరెవ్వడు. నా ప్రాణం పోయాకే ఈ పంట భూమి మీరు దక్కించు కోగలరు అంటూ మాటల్ని తూటాలుగా మలుచుకొని దొరల గుండెల్లో బడ బాగ్నిలా రగిలిన తెలంగాణ రైతాంగ విప్లవాగ్ని చాకలి ఐలమ్మ అని ఆయన కొనియాడారు. ఐలమ్మ భూ పోరాటంలో మొదలుకొని సాయుధ రైతాంగ పోరాటంలో ఎర్రజెండా చేతబట్టి వెట్టికి వ్యతిరేఖంగా పోరాడింది అని అన్నారు. నేటి సమాజంలో మహిళలు తమపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలకు వ్యతిరేఖంగా చాకలి ఐలమ్మ స్ఫూర్తితో దైర్యంగా పోరాడాలని ఆయన పిలుపనిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాస్, పట్టణ కమిటీ సభ్యులు సందకూరి లక్ష్మి, నందిపాటి రమేష్, ఎంఎస్. ప్రకాష్, బిక్కులాల్, బాలకృష్ణ, సంధ్య, సలీం, రసూల్‌బీ తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ స్ఫూర్తితో పోరాటాలు

మణుగూరు : తెలంగాణ పోరాట యోధురాలు వీరనారి ఐలమ్మ స్ఫూర్తితో స్కీం వర్కర్ల శ్రామిక మహిళల సమస్యలపై పోరాటాల నిర్వహిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.బ్రహ్మాచారి, ఏజె రమేష్ పేర్కొన్నారు. ఆదివారం వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఫోటోకు దండలు వేసి నివాళులర్పించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ అయిలమ్మ తెలంగాణ సమాజంలో వెట్టి చాకిరికి వ్యతిరేకంగా మహిళల హక్కుల కోసం పోరాటం చేశారని కొనియాడారు. తెలంగాణ ప్రజలను వెట్టి చాకిరి నుండి భూస్వామ్య దోపిడీ నుండి కుల వివక్షత సామాజిక అసమానతలు తెలంగాణ ప్రజలను విముక్తి చేసిన ఘనత ఎర్రజెండా కమ్యూనిస్టులకు దక్కుతుందని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఐసీడీఎస్ ఐకెపి మిడ్ డే మీ ఎన్నారైత్యం గ్రామపంచాయతీ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ నిర్మాణరంగం తదితర విభాగాలను శ్రామిక మహిళలు పెద్ద సంఖ్యలో పనిచేస్తున్నారని హక్కుల కోసం కీలకమైన కర్తవ్యం పేర్కొన్నారు. మహిళా హక్కుల కోసం పోరాటం చేసిన ఐలమ్మ స్ఫూర్తిగా మహిళల సమస్యల పరిష్కారం పోరాడాలని పిలుపునిచ్చారు. అంతకుముందు ఐలమ్మ చిత్రపటానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు వెంకటమ్మ, సహాయ కార్యదర్శి ధనలక్ష్మి, కే.సత్య పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్, సిఐటియు జిల్లా నాయకులు గద్దల శ్రీనివాస్, పిట్టల అర్జున్, డి.వీరన్న, ఎం.రేణుక, కే.చిలకమ్మా, కెవిపిఎస్ నాయకులు కొడిశాల రాములు, సిఐటియు నాయకులు నాగభూషణం, పోతురాజు శ్రీనివాస్, ఈశ్వరరావు, ప్రసాద్, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



దుమ్ముగూడెం

చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ఉద్యమించాలి

దుమ్ముగూడెం : తెలంగాణ సాయుధ పోరాట వీర నారి నిప్పు రవ్వ చాకలి ఐలమ్మ స్ఫూర్తితో భవిష్యత్ ఉద్యమాలు నిర్వహించాలని సీపీఐ(ఎం) భద్రాచలం డివిజన్ కో కన్వీనర్ కారం పుల్లయ్య పిలుపునిచ్చారు. ఆదివారం ములకపాడు గ్రామంలో గల యలమంచి సీతారామయ్య భవనంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ అధ్యక్షతన చాకలి ఐలమ్మ వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పుల్లయ్య మాట్లాడుతూ వీర తెలంగాణ పోరాటం భూమి భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన వీర తెలంగాణ పోరాటంలో దున్నేవారికి భూమి ఇవ్వాలని పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా ఆదివారం నుండి 17 వరకు వీర తెలంగాణ సాయుధ రైతంగ పోరాట వార్షికోత్సవ సభలు గ్రామ గ్రామాన జరపాలని పిలుపునిచ్చారు. 17వ తేదీన భద్రాచలం పట్టణంలో జరిగే వీర తెలంగాణ సాయుధ రైతంగ పోరాట వార్షికోత్సవ సభకు ముఖ్య అతిథులుగా సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మర్మం చంద్రయ్య, మండల కమిటీ సభ్యులు మహమ్మద్ బేగ్, పూనెం శోభారాణి, కొమరం చంటి, మడకం మహేంద్ర నాథ్, శాంతి కుమారి, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.


మణుగూరు

సంక్షేమ పథకాలు అభివృద్ధే లక్ష్యంగా ముందుకు

- పార్టీలో చేరికల కార్యక్రమంలో ఎమ్మెల్యే హరిప్రియ



నవతెలంగాణ-ఇల్లందు

నియోజకవర్గంలో జరుగుతున్న సంక్షేమ పథకాలు అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎంఎల్ఏ హరిప్రియ అన్నారు. టేకులపల్లి మండలం మద్రాస్ తండా గ్రామానికి చెందిన ఎన్డీ పార్టీ నాయకులు బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులైన సర్ప కృష్ణయ్య, వట్టం సీతారాములు, సాగబోయిన, లక్ష్మయ్య వట్టం ప్రసాద్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరిప్రియ గులాబీ జెండా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన నాయకులకు ఎమ్మెల్యే దిశా నిర్దేశం చేస్తూ పార్టీ నియమాలను అనుసరించి పనిచేస్తూ పార్టీ పటిష్ట నిర్మాణం కోసం కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, పట్టణ ప్రధాన కార్యదర్శి పర్చూరు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు పివి కృష్ణారావు, అబ్దుల్ నబీ, ఎస్కే పాషా, ఇల్లందు మండలం వైస్ ఎంపీపీ దాసం ప్రమోద్, ఇల్లందు పట్టణ ప్రచార కార్యదర్శి, సోషల్ మీడియా ఇన్చార్జి గిన్నారపు రాజేష్, యువజన నాయకులు, సోషల్ మీడియా ఇన్చార్జి ఎంటెక్ మహేందర్, ఆర్గనైజర్ సెక్రెటరీ, సనా రాజేష్ , ఇంద్ర నగర్ వార్డ్ నెంబర్ నీలం రాజశేఖర్ పాల్గొన్నారు.

ఉద్యమ స్ఫూర్తితో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులంతా సమస్యలపై పోరాడుదాం

- రాష్ట్ర సదస్సులో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి



నవతెలంగాణ-ఇల్లందు

తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులంతా సమస్యలపై పోరాడుదామని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య పిలుపునిచ్చారు. ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టీయు) ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులోని కామ్రేడ్ ఎల్లన్న భవన్లో ఆదివారం రాష్ట్ర సదస్సు షేక్ యాకూబ్ షావలి అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, ఇఫ్టు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సూర్యం పాల్గొని మాట్లాడుతూ... సింగరేణిలో 30 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నప్పటికీ వారి బాధలు, గాధలు కేసీఆర్ ప్రభుత్వానికి వినబడడం లేదన్నారు. అధికారంలోకి రాకముందు పర్మినెంట్ చేస్తానన్న హామీని ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీని కేసీఆర్ ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు తీవ్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురవుతున్నారు. సింగరేణిలో ఇంకా కనీస వేతనాలు సీఎం పీఎఫ్, వైద్యం అమలుకునోచుకొని, కోల్ ట్రాన్స్పోర్ట్, సోలార్, సింగరేణి లోడింగ్ అన్లోడింగ్, సులబ్, నర్సరీ శాండ్ బంకర్ ఇంకా తదితర డిపార్ట్మెంట్లలో, సామాజిక భద్రత లేదన్నారు. సింగరేణిలో అనేక సమ్మెలు, ఆందోళనలు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ వీరి సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. 18 రోజుల పాటు సుదీర్ఘ సమ్మె చేసినప్పటికీ కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో వ్యవహరించింది. 9 సంవత్సరాల కాలం గడిచినప్పటికీ సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు కేసీఆర్ ప్రభుత్వానికి గుర్తు రావడం లేదా అని ప్రశ్నించారు. సింగరేణిలో జీవో లేదన్నారు. సింగరేణి ప్రాథమిక దశలో రోడ్లు ఆఫీసులు కట్టేటప్పుడు, రోడ్ అండ్ బిల్డింగ్, జీవో తెచ్చారని, అప్పటి జీవో చేయడం, సిగ్గుచేటు అన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో సింగరేణి కాంట్రాక్టు కార్మికులంతా వేతనాల పెంపుకై, సౌకర్యాలకై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ రాష్ట్ర సదస్సులో రాష్ట్ర సహాయకార్యదర్శి జి.రామయ్య, రాష్ట్ర నాయకులు అర్. మధుసూదన్ రెడ్డి , యస్.కిరణ్, ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్. కే.యాకూబ్ షావలి, పాయం వెంకన్న, వేముల గురునాధం, తోకల రమేష్, పి.సతీష్, సి.వై.పుల్లయ్య, శరత్ ఎమ్.డి.గౌస్, బి.మల్సూర్, ఎమ్.చంద్రశేఖర్, రాజశేఖర్, జీ.రమేష్, శాంతయ్య, కె.శంకర్, సుందర్, వేల్పుల రమేష్‌లతో పాటు అన్ని డివిజన్లు నుండి కార్యకర్తలు పాల్గొన్నారు.

బహుజనులందరూ రాజకీయ కూలీలా...?

- 90 శాతం పైగా ఉండి బానిసలుగా బతకాలా..
- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేష్



నవతెలంగాణ-లక్ష్మీదేవిపల్లి

అగ్రవర్ణాల పాలకుల చేతిలోనే తెలంగాణ సమాజం మగ్గిపోతుందని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల సమీపంలోని కొత్తూరు గ్రామంలో ఆదివారం పర్యటించి అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ 90 శాతానికి పైగా ఉన్న బీసీ, దళిత, గిరిజన మైనారిటీ వర్గాల వారికి అధికారం అందడం లేదని అన్నారు. కేవలం అగ్రవర్ణాల పార్టీల చేతిలో రాజకీయ కూలీలుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బహుజన వర్గాన్ని..జనాలు సమీకరించడానికి, పార్టీ మీటింగ్‌లకు డబ్బులు ఇచ్చి కూలీలుగా, యువతకు మందు తాగించి వారి జీవితాలను నాశనం చేస్తున్నారని అన్నారు. జీవిత పర్యంతం కార్యకర్తల్లా బతుకులు సాగించాలనే అహంభావంతోనే పార్టీలు మనుగడ సాగిస్తున్నాయని దుయ్యబట్టారు. బహుజన్ సమాజ్ పార్టీలో ప్రతి ఒక్కరికి సముచిత స్థానం, సరైన అవకాశాలు ఉంటాయని స్పష్టం చేశారు. అన్ని వర్గాలను అక్కున చేర్చుకుంటూ ప్రజాహిత కార్యక్రమాలను చేయడం, పాలితులను పాలకులను చెయ్యడమే బహుజన్ సమాజ్ పార్టీ మూల సిద్ధాంతమని గుర్తు చేశారు. రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత బీఆర్ఎస్ పార్టీలో లెక్కలేనితనం పెరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల వేళల్లో డబ్బు సంచులతో, నోట్ల కట్టలతో వచ్చి ఎమ్మెల్యేలుగా గెలవచ్చని అహంభావంతో ప్రజలకు దూరంగా ప్రజాసమస్యలు తమకు అవసరం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బడుగు, బలహీన వర్గాలను అందలం ఎక్కించే ముఖ్య ఉద్దేశంతో రాజకీయ మనుగడ సాగిస్తున్న బీఎస్పీకి ఈ ఎన్నికల్లో పట్టం కట్టాలని ఓటర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సలహాదారు గంధం మల్లికార్జున్ రావు, సాయి, శివాజీ, అనిల్ కుమార్, కిరణ్, అంజి పాల్గొన్నారు.

రాజకీయ ఎదుగుదల చూసి ఓర్వలేక ఆరోపణలు

- ఎంపీపీ భూక్య రాధ సైదులు నాయక్



నవతెలంగాణ-టేకులపల్లి

టేకులపల్లి మండలంలో తన రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేక ప్రత్యర్థులు తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నట్లు టేకులపల్లి ఎంపీపీ భూక్యా రాధ సైదులు నాయక్ దంపతులు అన్నారు. ఆదివారం టేకులపల్లి మండల కేంద్రం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాజకీయ ఎదుగుదలని చూసి ఓర్వలేక తమ కుటుంబం పై అసత్య ఆరోపణలు చేస్తున్న వారికి, వారి వెనక ఉన్నవారికి వారం రోజులలో తమపై చేసిన ఆరోపణలు నిరూపించుకుంటే చట్టపరంగా వారిపై పరువు నష్ట ధావాస్తానని సైదులు నాయక్ సవాల్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అసత్య ఆరోపణ నిరూపిస్తే ఎంపీపీ పదవికి రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్న నిరూపించకపోతే మాత్రం చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూకబ్జా చేసినట్లు ఆరోపించడం తగదన్నారు. ఇప్పటికైనా చేసిన ఆరోపణలు మానుకోవాలని అన్నారు.

టీబీజీకేస్ తప్పుడు ప్రచారాన్ని ఖండించిన సీఐటీయూ



నవతెలంగాణ-కొత్తగూడెం

పదకొండవ వేతన ఒప్పందం సంబంధించిన 23 నెలల ఏరియర్స్‌ను ఈనెల 21వ తేదీన టిబిజీకేస్ యూనియన్ యాజమాన్యంతో మాట్లాడి కార్మికులకు ఇప్పిస్తునామని తప్పుడు ప్రచారం చేయడం సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) కొత్తగూడెం బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. ఒప్పందానికి సంబంధించిన 23 నెలల ఏరియర్స్ ఈనెల కోల్ ఇండియాలో చెల్లింపు చేశారని, ఏరియర్స్ చెల్లింపు చేయాలని కోల్ ఇండియా యాజమాన్యం సింగరేణికి ఆదేశాలు జారీ చేసి నెల రోజులకుపైగా అయినా కూడా యాజమాన్యం, టిబిజీకేస్ యూనియన్ ఉలుకూపలుకు లేకుండా ఉంటే జాతీయ కార్మిక సంఘాలు ఆందోళన ఫలితంగా రెండు దఫాలుగా ఏరియర్స్ ఈనెల 8వ తేదీ, 25వ తేదీన చెల్లింపు చేస్తున్నట్లు పత్రికా ప్రకటన చేయలేదా...? అని ప్రశ్నించారు. కోల్ ఇండియా యాజమాన్యం ఏరియర్స్ చెల్లింపు చేసిన అనంతరం కార్మికులలో వ్యతిరేకత భావం వస్తున్న యెడల సింగరేణి యాజమాన్యం ఒకే దఫా చెల్లింపు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నది. దీని ఆసరా చేసుకుని టిబిజీకేస్ సంఘం మేము ఇప్పిస్తునామని ప్రకటించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వానికి, టిబిజీకేస్ యూనియన్‌కు తొత్తుగా వ్యవరిస్తున్నదని, ఇప్పటికైనా కార్మికులు అర్థం చేసుకోవాలన్నారు. గత ఆర్థిక సంవత్సరం వచ్చిన లాభాల్లో రూ.700 కోట్లు కార్మికులకు పంపిణీ చేస్తున్నట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి, ఎప్పుడూ ఇస్తారో తేదీ ప్రకటించ లేదని స్పష్ట చేశారు. టిబిజీకేస్ యూనియన్‌కు కార్మికుల పట్ల చిత్తశుద్ధి ఉంటే 2022 సంవత్సరం ఏప్రిల్ నెల ఆర్ఎల్‌సి సమక్షంలో టిబిజీకేస్, జాతీయ కార్మిక సంఘాలతో చేసిన ఒప్పందం యాజమాన్యం అమలు చేయుటకు కృషి చేయాలన్నారు. దీనిని కార్మికులు హర్షిస్తారు అని విజయగిరి శ్రీనివాస్ పేర్కొన్నారు.



సమ్మెకు సిద్ధం

- అధికారుల బెదిరింపులు ఆపాలి

నవతెలంగాణ-కొత్తగూడెం

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ 11 నుండి సమ్మె జరుగుతుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సెప్టెంబర్ 11 నుండి జరిగే సమ్మెలో టీచర్స్ హెల్పర్స్, మిని టీచర్స్ అందరూ పాల్గొనాలని ప్రభుత్వం ఇప్పటికే అనేక బెదిరింపులకు వేధింపులకు గురి చేస్తుందని, ఇది సరైనది కాదని మీ బెదిరింపులు ఆపాలని, చట్టపరంగా సమ్మె చేస్తున్నామని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) అనుబంధం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఈసం వెంకటమ్మ, జి.పద్మ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందని, సమస్యలు పరిష్కరించకపోగా, మీరు సమ్మె చేస్తే మీ ఉద్యోగాలు తీసేస్తాం.... కేసులు పెడతాం... వేరే వాళ్ళని పెట్టి పనులు నిర్వహిస్తాం... అని అధికారులు బెదిరిస్తున్నారు. ఇట్లాంటి బెదిరింపులకు అంగన్వాడీలు భయపడడానికి సిద్ధంగా లేరని, మీ బెదిరింపులను అడ్డుకుంటారని,
చట్టపరంగా 15 రోజుల ముందు సమ్మె నోటీసు ఇచ్చామని, ఈ 15 రోజుల కాలంలో ప్రభుత్వం సమస్యలు పరిష్కారం చేయలేదని అందుకే సమ్మెలోకి వెళు న్నామన్నారు. జిల్లాలో అన్ని మండల కేంద్రాల్లో సోమవారం సమ్మె జరుగుతోందని, ఈ సమ్మెలో టీచర్స్, హెల్పర్స్, మినీ టీచర్స్ అందరూ పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఆఫీస్ బేరర్స్ సత్య, సావిత్రి, రాంబాయి, శైలజ, హేమలత, మరియా, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు అప్రజస్వామికం : టీడీపీ

నవతెలంగాణ-చండ్రుగొండ

టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడిని అరెస్టు చేయటం అప్రజాస్వామికమని మండల అధ్యక్షులు వారాది సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండల కమిటీ ఆధ్వర్యంలో చంద్రబాబు అరెస్టును నిరశిస్తూ జాతీయ రహదారిపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారాది సత్యనారాయణ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని, సామాన్యులు బతికే పరిస్థితులు లేవని, ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. వైసీపీ పాలనలో ప్రతిపక్షపార్టీలకు ఇబ్బందులు తప్పటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దడిగల మల్లేష్, కొదుమూరి సత్యనారాయణ, చాపలమడుగు వెంకటేశ్వర్లు, కాశి, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
8
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | సెప్టెంబర్ 11, 2023 | www.navatelangana.com

నేడు వద్దిరాజ్ రవిచంద్ర పర్యటన



నవతెలంగాణ-ఇల్లందు

నేడు ఉదయం 9 గంటలకు జరగబోయే రాజ్యసభ సభ్యులు, ఇల్లందు నియోజకవర్గ ఎన్నికల ఇన్చార్జ్ వద్దిరాజు రవిచంద్ర పర్యటనను విజయవంతం చేయాలని ఎంఎల్ఏ హరిప్రియ విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాలు, మండల కమిటీ మహిళా కమిటీ యూత్ కమిటీ వారు గమనించి సహకరించి విజయవంతం చేయగలరనికోరారు.

నూతన వధూవరులను ఆశీర్వాదం

పట్టణం మున్సిపాలిటీ పరిధిలోని 16 వార్డుకు చెందిన మంచాల చక్రపాణి చిన్న కుమారుడి వివాహ శుభకార్యంలో ఎంఎల్ఏ హరిప్రియ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. శుభాకాంక్షలు తెలియజేశారు. శుభకార్యంలో ఎమ్మెల్యే వెంట 11వ వార్డు కౌన్సిలర్ జెకె శ్రీను, పట్టణ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పరుచూరి వెంకటేశ్వర్లు, గిన్నెరపు రవి, ఎంటెక్ మహేందర్, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

బోనమెత్తిన ఎంఎల్ఏ హరిప్రియ

పట్టణంలోని సత్యనారాయణపురం 1వ వార్డుల్లో ఆదివారం ఎంఎల్ఏ హరిప్రియ ముత్యాలమ్మ తల్లికి బోనం ఎత్తి మొక్కు చెల్లించారు. బోనాల వేడుకల్లో ఈ కార్యక్రమంలో 1,2 వార్డుల కౌన్సిలర్‌లు వార రవి, కటకం పద్మావతి, రఘు రెడ్డి, ధనమరుపు రాము, బొల్లి గోపి, మదర్బి, కుంట, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

కోయగూడెం ఉపరితల గనిలో పర్యటించిన పర్యావరణ బృందం

నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా లోని కోయగూడెం ఉపరితల గని నందు పర్యావరణ బృందం మూడవ పార్టీ సైంటిస్టు సుదీప్తియ ముఖపాధ్యాయ ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు 2018-19నుండి కోయగూడెం ఉపరితల గని నందు సింగరేణి సంస్థ పర్యావరణ సమతుల్యతకు అవలంభిస్తున్న చర్యలను పరిశీలించారు. ఇందులో భాగంగా ఎయిర్ క్వాలిటీ మేనేజ్మెంట్, వాటర్ క్వాలిటీ మేనేజ్మెంట్, ఇంటర్నల్ డంప్ డీటెయిల్స్, సైంటిఫిక్ స్టడీ ఆన్ స్లోప్ స్టాబిలిటీ ఆఫ్ బెంచేస్, సంవత్సరం వారిగా ప్లాంటేషన్ ప్రణాళికలు, సంవత్సరాల వారీగా పై మట్టిని తొలగించడం విస్తరించడం, నిల్వ ప్రణాళికలు, సంవత్సరం వారిగా అంతర్గత డంపింగ్ ప్లాన్లు, రేక్లిమేడ్ చేయబడిన డంప్‌లపై ప్లాంటేషన్ ప్రాంతాలు డం స్టోరేజ్ డంపులో సెటిలింగ్ పాండ్లు, ఫిల్టర్ బెడ్లులను పరిశీలించారు. డంప్ యార్డ్ పై ఏర్పాటు చేసిన ప్లాంటేషన్, అలాగే నర్సరీలోని మొక్కల పెంపకం ఇతర పర్యావరణనికి సంభందించిన పనులను పరిశీలించారు. తదుపరి వారు సంభందిత అధికారులకు తగు సలహాలు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రహ్లాద్, మేనేజర్ సౌరబ్ సుమన్, ఏరియా పర్యావరణ అధికారి ధనుంజయ రెడ్డి, కార్పొరేట్ పర్యావరణ అధికారులు తిరుపతి, పోశామల్లు కార్పొరేట్ సర్వే రామరాజు, మైన్ పర్యావరణ అధికారి శ్రీకాంత్ తదితరులు పాల్గొనారు.

ఎలక్ట్రికల్ కార్మికుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తా

- డాక్టర్ తెల్లం వెంకట్రావు



నవతెలంగాణ-భద్రాచలం

భద్రాచలం నియోజవర్గ ప్రయివేట్ ఎలక్ట్రికల్ ట్రేడ్ యూనియన్ (బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘం) అధ్యక్షులుగా చుక్క సుధాకర్ ఆదివారం ప్రమాణం స్వీకారం చేశారు. భద్రాచలంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు హాజరయ్యారు. ఎలక్ట్రిక్ కార్మికుల సమస్యలు ఏవి ఉన్న వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూనియన్ ఉపాధ్యక్షులు చిన్నోజు రాజేశ్వర్ రావు, జిల్లా నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం : బీఎస్పీ



నవతెలంగాణ-ఇల్లందు

సరియైన ప్రజాప్రతినిధిని ఎన్నుకోవడానికి ఓటు వజ్రాయుధమని బహుజన సమాజ్ పార్టీ ఇల్లందు నియోజకవర్గ ఇన్చార్జి బాధావత్ ప్రతాప్, జిల్లా కార్యదర్శి చిప్పలపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలో పలు గ్రామాలలో ఆదివారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాల్సిందిగా కోరుతూ వారందరికీ ఓటు హక్కు ప్రాముఖ్యతను, ఓటు విలువను తెలియజేశారు. రాజ్యాధికార అవగాహన కల్పించి అమూల్యమైన ఓటును అమ్ముకోవద్దన్నారు. నిజాయితీగా, నిక్షిప్త పాతంగా తమ ఓటును మంచి రాజకీయ నాయకులను ఎన్నుకున్నప్పుడే సమ సమాజ స్థాపన, అందరూ అభివృద్ధి చెందుతారన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఆనందరావు, సీనియర్ నాయకులు డాక్టర్ చారు ముజేందర్, మనోజు, ప్రభాకర్, జానీ, రమేష్, మండల, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.



ఆత్మీయ కలయిక -ఆనందాల వెల్లువ

- పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

నవతెలంగాణ-మణుగూరు

ఆత్మీయ పలకరింపులు అనురాగపు ఆ లింగనాలతో ఆనందోత్సవాలు వెలివెత్తాయి. మూడు దశాబ్దాల ముచ్చట్లను జ్ఞాపకం చేసుకుంటూ ఆ మనుసులు పరవశించిపోయాయి. మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. ఆదివారం సమ్మక్క సారక్క ఆలయ ప్రాంగణంలో శివం ఫంక్షన్ హాల్‌లో 1988-90 ఇంటర్మీడియట్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం పేరిట కలుసుకున్నారు. కళాశాల మిత్రులు కలుసుకోగానే వారిలో సంతోషం పెల్లి బికింది. పాత జ్ఞాపకాలు పదేపదే స్మరణ చేసుకుంటూ ఆనందంతో ఊగి పోయారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కేరింతలతో సందడి చేశారు. ఈ కార్యక్రమం నిర్వాహకులు మోహన్ రావు, భాగం రవి, బాబురావు, దామల్ల వెంకన్న, ఉమర్, నాగేశ్వరరావు, రమణ, రాజకుమార్, మహేష్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



రామాలయంలో పోటెత్తిన భక్తులు

నవతెలంగాణ-భద్రాచలం

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి కనిపించింది. రెండవ శనివారం, ఆదివారం సెలవలు కలిసిరావడంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భద్రాచలం భారీగా చేరుకున్నారు. వేకువ జామునే పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు అనంతరం బారులు తీరి మరి భద్రాద్రి రామున్ని దర్శించుకున్నారు. నిత్య కళ్యాణంలో వందలాదిమంది భక్తులు పాల్గొన్నారు. రామాలయ పరిసరాలు కలకలలాడాయి.

శ్రీవిద్య, కృష్ణవేణి జూనియర్ కళాశాల స్వాగత వేడుకలు



నవతెలంగాణ-మణుగూరు

శ్రీవిద్య, కృష్ణవేణి కళాశాలలో జూనియర్ విద్యార్థుల స్వాగత వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్నేహ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో సీఐ బాలాజీ వరప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. గత సంవత్సరంలో మెరిట్ పొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కరస్పాండెంట్ పుచ్చకాయల శంకర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. ఉత్తమ ఫలితాలతో భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని అన్నారు. సమాజానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో శ్రీ విద్యా సంస్థల డైరెక్టర్ నూకార రమేష్, అకాడమిక్ డైరెక్టర్ మద్రి సాగరంగపాణి, ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, అధ్యాపక బృందం, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మిక వర్గం ఐక్యతకు మతోన్మాదం ప్రథమ శత్రువు

- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్



నవతెలంగాణ-మణుగూరు

కార్మిక వర్గం ఐక్యతకు మతోన్మాదం ప్రథమ శత్రువుగా ఉందని మతోన్మాదాన్ని ప్రకటించడం కోసం కార్మిక వర్గం మొత్తం ఐక్యంగా పోరాటం చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం సీఐటీయూ జిల్లా శిక్షణ తరగతుల్లో మతం, మతోన్మాదం అనే అంశంపై ప్రసంగించారు. ప్రజల మధ్య వైశ్యామ్యాలను రెచ్చగొట్టడం కోసం బీజేపీ మతోన్మాదాన్ని రెచ్చగొడుతుందని పేర్కొన్నారు. మతం ప్రజల వ్యక్తిగత అంశమని అన్నారు. ఎవరు ఏ మతాన్ని విశ్వసించాలో ఏ సాంప్రదాయాలు, ఆచారాలు పాటించాలో వారికి తెలుసునని అన్నారు. ప్రజల వ్యక్తిగత జీవితాంశాలలో ప్రభుత్వం జోక్యం చేసుకొని భావోద్వేగాలను రెచ్చగొడుతుందని విమర్శించారు. మతోన్మాదాన్ని రెచ్చగొట్టడం ద్వారా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై జరుగుతున్న పోరాటాలను విచ్ఛిన్నం చేస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలందరినీ మొత్తం ఆధారంగా విడగొడుతూ దేశ సంపద మొత్తాన్ని ప్రైవేటీకరణ చేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను సహజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆలోచించాల్సిందే ఎవరు ఏ మతాన్ని విశ్వసిస్తున్నారు అనేది కాదని దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగం, పేదరికం, ఆర్థిక అసమానతల రూపుమాపటం కోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, కానీ కేంద్ర బీజేపీ ప్రభుత్వం అందుకు వ్యతిరేకంగా పనిచేస్తుందని విమర్శించారు. ప్రజల జీవిత సమస్యలను మార్చటానికి బదులు వారిని కులం, మతం ప్రాతిపదికన విచ్ఛిన్నం చేయడానికి పూనుకుంటుందని పేర్కొన్నారు. మతోన్మాదం శ్రమదోపిడికి, ఆర్థిక దోపిడీకి సామాజిక సాంస్కృతిక దోపిడీకి ఆయుధంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సమాజంలోని అన్ని రకాల దోపిడీలకు వ్యతిరేకంగా పోరాటం చేయవలసిన కార్మిక వర్గం మతోన్మాదానికి వ్యతిరేకంగా మరింత పట్టుదల తోటి ఐక్యంగా పోరాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ శిక్షణ తరగతులకు సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కే.బ్రహ్మాచారి అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి ఏజే రమేష్, జిల్లా కోశాధికారి జి.పద్మ, నాయకులు గద్దల శ్రీనివాస్, పిట్టల అర్జున్, ఈసం వెంకటమ్మ, డి.వీరన్న, ధనలక్ష్మి కె.సత్య, ఎం.రేణుక, కే.చిలకమ్మా, హేమలత, నరసింహారావు, భూక్య రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ఫెడ్‌లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన మెచ్చా

- హాజరైన చైర్మెన్ కంచర్ల, ఎండీ సురేందర్



నవతెలంగాణ-అశ్వారావుపేట

ఆయిల్ఫెడ్ సంస్థలో నిర్మించిన పలు అభివృద్ధి పనులను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, చైర్మెన్ కంచర్ల రామక్రిష్ణా రెడ్డి, ఎండీ సురేందర్‌లు ప్రారంభించారు. నారంవారిగూడెం సమీపంలో గల ఆయిల్ఫెడ్‌కు చెందిన ఎ బ్లాక్‌లో నిర్మించిన అతిథి గృహం, ఆయిల్ ఫాం పరిశ్రమ ప్రాంగణంలో నిర్మించిన ఫార్మర్ షెడ్ (రైతులు విశ్రాంతి గది)లను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి, డీహెచ్ఎస్ఓ జినుగు మరియన్న, డీఓ బాలక్రిష్ణ, మేనేజర్‌లు నాగబాబు, కళ్యాణ్ గౌడ్, రైతు బంధు జిల్లా అధ్యక్షులు రావు జోగేశ్వరరావు, ఎంపీపీ శ్రీరామమూర్తి, జడ్పీటీసీ వరలక్ష్మి, మాజీ జడ్పీటీసీ జేకేవీ రమణారావు, రైతు సంఘం నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య, కాసాని చంద్రమోహన్, ఆలపాటి రాంమోహన్ రావు(రాము), పిన్నమనేని మురళి, నాయకులు బండి పుల్లా రావు, మందపాటి రాజమోహన్ రెడ్డి, నార్లపాటి రాములు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మెకు సంపూర్ణ మద్దతు

- న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



నవతెలంగాణ పాల్వంచ

సెప్టెంబర్ 11 నుండి అంగన్వాడీలు చేస్తున్నటువంటి సమ్మెకు మధ్యాహ్న భోజన కార్మికులు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని మధ్యాహ్నం భోజన కార్మికుల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.పద్మ, ఎస్.డి.సుల్తానా తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ అంగన్వాడీలు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కారం చేయాలని వారు సమ్మెలోకి వెళ్తా ఉంటే ప్రభుత్వం ఆ సమ్మెను విచ్ఛిన్నం చేయాలని చూస్తుందని అన్నారు. వారి న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం సమ్మె చేస్తా ఉంటే ప్రభుత్వం అడ్డుకోవాలని, మధ్యాహ్నం భోజన కార్మికుల తోటి అంగన్వాడీ కేంద్రాల్లో వంట చేయాలని ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేయడం సరైంది కాదని, వారి న్యాయమైన డిమాండ్ పరిష్కారం చేయాలని అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం 2022 మార్చి 15న రూ.2000 జీతం పెంచిది. కాని నేటికీ 18 నెలలు కావస్తున్న పెంచిన జీతాలు ఇవ్వడం లేదన్నారు. అంతేకాదు మధ్యాహ్న భోజన కార్మికులకు రావలసిన బిల్లులు నెలలు తరబడి పెండింగ్లో పెడుతున్నారని, ఐదు నెలలుగా బిల్లులు లేవు కోడిగుడ్డు బిల్లులు ఎనిమిది నెలలుగా రావట్లేదు, కార్మికులు బిల్లులు పెంచిన జీతాలు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారని అందులో భాగంగానే సెప్టెంబర్ 13 చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళుతున్నామని జిల్లాలో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొంటున్నారని తెలిపారు.

అంగన్వాడి సమ్మెలోకి వెళ్తితే వాళ్ల కేంద్రాల్లో మధ్యాహ్న భోజన కార్మికులు వంట చేయాలని నిర్ణయాలు ప్రభుత్వం తీసుకోవడం సరైంది కాదని ఈ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని మేము అంగన్వాడీలు సమ్మెలో ఉంటే మీ వెల్లి ఆ కేంద్రంలో వంట ఎలా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కార్యదర్శిలు, కోశాధికారి రామలక్ష్మి, వెంకట్ నర్సమ్మ, రాణి, అనసూయ, క్రాంతి సావిత్రి, ఉమా తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా పోరాటాలు నిర్మించాలి


భద్రాచలం


బూర్గంపాడు


ఆళ్ళపల్లి


కొత్తగూడెం


దమ్మపేట


ఇల్లందు

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి

నవతెలంగాణ-భద్రాచలం

వెట్టి చాకిరి బానిసత్వం విముక్తి కోసం దొరలతో వీరోచిత పోరాటాన్ని చేసి తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర వహించిన చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ 38వ వర్ధంతి సభను పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి మాజీ పార్లమెంటు సభ్యులు మీడియం బాబురావు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఐలమ్మ లాంటి ఎంతోమంది వీరనారులు తమ ప్రాణాలను పణంగా పెట్టి దొరల పాలన నుండి తెలంగాణకు విముక్తి కలిగించారని గుర్తు చేశారు. తెలంగాణ అమరవీరుల స్ఫూర్తితో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు భీమవరపు వెంకటరెడ్డి, బండారు శరత్ బాబు, ఎర్రం శెట్టి వెంకట రామారావు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏలో...

భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం, జరిగిన పోరాటంలో ముందు భాగాన నిలబడి పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ అన్నారు. ఆదివారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతిక్ జైన్ అధికారిక పనులపై ఉన్నందున ఆయన ఆదేశానుసారం ఐటీడీఏ సమావేశ మందిరంలో చాకలి ఐలమ్మ 38వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చాకలి ఐలమ్మగా గుర్తింపు పొందిన తెలంగాణ వీర వనిత సామాజిక ఆధునిక పరిణామానికి నాంది పలికిన స్త్రీ ధైర్యశాలి చాకలి ఐలమ్మ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో పవర్ మునీర్ పాషా, మేనేజర్ ఆదినారాయణ, డిఎస్ఓ ప్రభాకర్ రావు, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఇతర శాఖలకు చెందిన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు : మండల కేంద్రంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చిట్యాల ఐలమ్మ 38వ వర్ధంతిని నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి ఈశ్వరరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. శాఖా కార్యదర్శి బయ్యా రాము అధ్యక్షతన జరిగిన సభలో మండల కమిటీ సభ్యుడు రాయల వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు తిరపతిరావు, సభ్యులు సత్యనారాయణ, సానుభూతి పరులు రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో..

వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన చిట్యాల ఐలమ్మకు బూర్గంపాడు మండలం సుందరయ్య నగరంలో సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఆదివారం 38వ వర్ధంతి ఎస్కే అబిద అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యురాలు పాపినేని సరోజన మాట్లాడారు. తెలంగాణలో రజాకార్లుతో భూస్వాములతో దొరల పెత్తందారులపై తిరగబడ్డ ఐలమ్మ కమ్యూనిస్టులు సాయంతో తన భూమిని దక్కించుకుందని ఆమె అన్నారు. పంట ఇంటికి వచ్చే విధంగా పోరాటం చేశారని, ఈ ఉద్యమంలో తన బిడ్డల్ని భర్తని కోల్పోయిందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొవులూరి నాగమణి, మన్నెం చంద్ర, నకరికంటి మంగ, గుంజి ప్రభా వతి, శ్రీదేవి, నిలోఫర్, గుంజి లక్ష్మి అలివేలు, ధమయంతి, లావణ్య తేజ కుమార్, పూరిల్ల రాజేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆళ్ళపల్లి : చాకలి ఐలమ్మ 38వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం మండల కేంద్రంలో రజక సంఘం మండల అధ్యక్షుడు బూరుగడ్డ రాములు ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి, ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బూరుగడ్డ వెంకటేశ్వర్లు, బూరుగడ్డ ముత్యం, బూరుగడ్డ నాగేశ్వరరావు, బూరుగడ్డ సాంబయ్య, కృష్ణ, గడ్డం కృష్ణ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం : అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) కొత్తగూడెం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో చిట్యాల ఐలమ్మ 38వ వర్ధంతి సభ ఆదివారం రాంనగర్‌లో జరిగింది. ఐద్వా టౌన్ కమిటీ సభ్యులు వీరమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఐద్వా టౌన్ కార్యదర్శి సంద కూరి లక్ష్మీ మాట్లాడుతూ భూమికోసం, భక్తి కోసం, తెలంగాణ విముక్తికోసం చాకలి ఐలమ్మ అలుపెరగని పోరాటాలు చేసిందని, ఆనాటి భూసామ్య వ్యవస్థ, కట్టుబాట్లు, సామాజిక పరిస్థితులపై స్పందించిన ఆమె పెత్తందారి వ్యవస్థపై పోరాటానికి నాంది పలికి ఎందరికో స్ఫూర్తిగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీవిజయ, సుల్తానా బేగం, సుప్రజ, సువర్ణ, రమ, నాగమణి, విద్య, తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట : సీపీఐ(ఎం) కార్యాలయం సుందరయ్య భవనంలో వీర తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, అమర జీవి కామ్రేడ్ చిట్యాల ఐలమ్మ వర్ధంతి పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాల మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ లక్ష్మీనారాయణ మాట్లాడారు. ఈ సభలో మండల కమిటీ సభ్యులు కొప్పుల శ్రీనివాసరావు, నరసింహారావు, కొలిగిపోగు శ్రీనివాసరావు, అర్వపల్లి రాంప్రసాద్, నారపోగు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు : వీర నారీమణి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆదివారం యూత్ కాంగ్రెస్ నగర్‌లో ఆమె చిత్ర పటానికి సీపీఐ(ఎం) అధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పార్టీ మండల నాయకులు మన్యం మోహన్ రావు పాల్గొని మాట్లాడుతూ...చాకలి ఐలమ్మ విస్నూరి దేశ్ముఖ్ రామచంద్రారెడ్డికి వ్యతిరేకంగా కమ్యూనిస్టుల సహకారంతో పోరాడి భూమిని, పండించిన పంటను దక్కించుకున్న వీర వనిత ఐలమ్మ అని అన్నారు. నాడు కమ్యూనిస్టు పార్టీలో చేరి జగిర్దార్ జమీందార్, దేశ్ ముఖ్‌ల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి ఐలమ్మ అన్నారు. ఈ కార్యక్రమంలో చాందినీ, లక్ష్మీ, సరోజ, వినోద సత్తెమ్మ, భీముడు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో...

చాకలి ఐలమ్మ చిత్రపటానికి మున్సిపల్ చైర్మెన్ దమ్మలపాటి వెంకటేశ్వర రావు పూలమాల వేసి నివాళులుఅర్పించారు. 1ఈ కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్ , మున్సిపల్ కమిషనర్ కుమార్ స్వామి, మేనేజర్ అంకు షావలి, మున్సిపల్ కౌన్సిలర్లు అంకెపాక నవీన్ కుమార్, కుమ్మరి రవీంద్ర, శానిటరీ ఇన్స్పెక్టర్ రాధాకృష్ణ, మున్సిపల్ సిబ్బంది భారత రాష్ట్ర సమితి పట్టణ నాయకులు ఎర్ర ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

దొంగల దాడిలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



నవతెలంగాణ-టేకులపల్లి

గుంటూరు జిల్లాలోని వినుకొండలో శనివారం అర్ధరాత్రి పెట్రోల్ బంకు పార్కింగ్ ప్లేస్‌లో టేకులపల్లికి చెందిన లారీ నెంబర్ 9779 డ్రైవర్ ఇస్లావత్ లాలు నాయక్ పై దొంగల దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి నరసరావుపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఆదివారం కుటుంబ సభ్యులు తెలిపారు. దీని కంటే ముందు రెండు, మూడు సార్లు పార్కింగ్ ప్లేస్‌లో దొంగతనానికి పాలపడటానికి ప్రయత్నించిన, దొంగలపై బంకు యాజమాన్యం ఎటువంటి చర్యలు తీసుకోకపోగా కనీసం పార్కింగ్ ప్లేస్లో కరెంట్ గాని సీసీ ఫుటేజ్ గాని పహరి గోడ రక్షణ గాని లేకపోవడంతో దారుణాలు చోటుచేసుకుంటున్నాయి అన్నారు. గతవారం పది రోజులు క్రితం కూడా సెల్ ఫోన్లు డబ్బులు పోగొట్టుకున్నామని, తోటి బాధిత డ్రైవర్లు మొరపెట్టుకున్నా బంకు యాజమాన్యం పట్టించుకోకుండా కనీసం పోలీస్ కేసు కూడా పెట్టకుండా ఉండడం మూలాన మరోసారి రెచ్చిపోయిన దొంగలు ఫలితంగా డ్రైవర్‌కు తీవ్ర నష్టం జరిగిందని పలువురు డ్రైవర్లు అన్నట్లు తెలిపారు. దీనిపై బంకు యాజమాన్యంపై తక్షణమే చర్య తీసుకోవాలని కట్టినమైన చర్య తీసుకోవాలని కచ్చితంగా ఆ దొంగలకు బంకుకు సంబంధాలు ఉన్నాయని అనుకోవాల్సిన పరిస్థితి, ఎందుకంటే ఒకసారి రెండుసార్లు సంఘటనలు జరిగినప్పుడు ఎటువంటి చర్యలు చేపట్టక పోగా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. కచ్చితంగా బంకు యాజమాన్యానికి దొంగలకు కనెక్షన్ ఉండే ఉంటుందని, తక్షణమే అటువంటి బంకు యాజమాన్యంపై చర్యలు తీసుకునే వరకు తమ వంతు సహాయ సహకారాలు అందించవలసిందిగా తోటి డ్రైవర్లను ఓనర్లను కోరారు. డ్రైవర్‌కు పూర్తి ఆసుపత్రి ఖర్చులు, బంకుయాజమాన్యం భరించే విధంగా కుటుంబీకులు కోరారు.

ఏజెన్సీ ప్రాంతంలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

- ఏఎస్పీ, ఏవీఎస్పీ



నవతెలంగాణ-దుమ్ముగూడెం

జీవో నెంబర్ 3 ప్రకారం ఏజెన్సీ ప్రాంతంలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పాంద్ర హేమ సుందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని నడికుడి గ్రామంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ భద్రాచలం డివిజన్ అధ్యక్షుడు సోందె మల్లారు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీ డిఎస్సి పకడ్బందీగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ఆదివాసి నిరుద్యోగులు బీఈడీలు, టిటిసిలు, డిఈడిలు చేసి ఏ ఉద్యోగం లేకుండా ఖాళీగా ఉన్నారని ఆదివాసి నిరుద్యోగ అభ్యర్థులతో డీఎస్సీ ఉద్యోగాలను 100% భర్తి పూర్తి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసి సంక్షేమ పరిషత్ చేపట్టనున్న కార్యాచరణ పై చర్చించారు. ఆదివాసులకు దక్కాల్సిన ఉద్యోగాల విషయంపై ఉద్యమ బాట పట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్నటువంటి చట్టాలు ప్రకారం ఆదివాసులకి రిజర్వేషన్ ప్రకారం 29 శాఖలలో ఉద్యోగాలలో ఆదివాసి నిరుద్యోగులు తోటి పూర్తి చేయాలని అన్నారు. తమ హక్కుల కోసం తిరుగుబాటు చేయన ఏ జాతైనా కనుమరుగైపోతుందని వాపోయారు. దీనిని ఆదివాసీ మేధావులు గమనించాలని అన్నారు. రానున్న కాలంలో ఆదివాసి జాతికి, ఆదివాసి చట్టాలకి ఆదివాసి రిజర్వేషన్లకి మనుగడ లేకుండా పోయే పరిస్థితి ఉందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని మెడలు వంచే దిశగా అందరు ఐక్యం కావాలని ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఎస్పీ, ఏవీఎస్పీ నాయకులు సోయం వినోద్ కుమార్, గట్టుపల్లి సతీష్, కోరం మురళి కోడి నాగేశ్వరావు, కారం మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యలక్ష్మి కుమారులకు పరామర్శ

నవతెలంగాణ-గుండాల

ఇటీవల మరణించిన తవుడిశెట్టి రాజ్యలక్ష్మి కుమారులు నాగరాజు, రాంబాబులను జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చారు గుండ్ల శ్రీనివాసరావు ఆదివారం వారి ఇంటికి చేరుకుని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మానాల వెంకటేశ్వర్లు, పల్లెర్ల చంద్రశేఖర్, మానాల ఉపేందర్, శ్రీరంగం సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | సెప్టెంబర్ 11, 2023 | www.navatelangana.com



డివిజన్ ప్రయివేట్ పాఠశాలల అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్షులుగా పలివెల రవికుమార్ శ్రీ కోమల హై స్కూల్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ప్రయివేట్ పాఠశాలల అసోసియేషన్ సమావేశం ఆదివారం భద్రాచలంలోని స్థానిక జ్యోతి హై స్కూల్ నందు నిర్వహించారు. ఈ సమావేశానికి ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి, జిల్లా అధ్యక్షులు బండి లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై వాటి పరిష్కారానికి అసోసియేషన్ చేసినటువంటి కృషిని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల రికగ్నిషన్ రెన్యూవల్‌కు సంబంధించి ఆయా పాఠశాలల కరస్పాండెంట్ ఎటువంటి ఇబ్బంది కలగకుండా రాష్ట్ర స్థాయి అధికారులు జిల్లా ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుంటూ అండగా ఉన్నామని ఉద్ఘాటించారు.

అనంతరం భద్రాచలం డివిజన్ ప్రైవేట్ పాఠశాలల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పలివెల రవికుమార్(శ్రీ కోమల హై స్కూల్ భద్రాచలం), ప్రధాన కార్యదర్శిగా అనుమాండ్ల శ్రీధర్ రెడ్డి (జ్యోతి కాన్వెంట్ హై స్కూల్ భద్రాచలం), కోశాధికారిగా గోడపర్తి రాంబాబు (శాంతి విద్యా నికేతన్ నాగినేని ప్రోలు), ఉపాధ్యక్షులుగా బి.నాగేశ్వరరావు (బ్రిలియంట్ హై స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ సారపాక), జాయింట్ సెక్రటరీగా గౌరీ శంకర్ (శాంతి విద్యా నికేతన్ హై స్కూల్ చర్ల), ఈసీ సభ్యులుగా పి.సురేష్ బాబు (సమత హై స్కూల్, భద్రాచలం, జె మణికంఠ (గౌతమ్ మోడల్ స్కూల్ భద్రాచలం), లైక్ పాషా (న్యూ సెంచరీ హై స్కూల్ బూర్గంపాడు), గిరి(గురుదేవ్ హైస్కూల్ చర్ల), ఈ సమావేశంలో మునికేశవ్ (రూప స్కూల్ భద్రాచలం), అబ్రహం సెయింట్ పాల్స్ హై స్కూల్, కోటిరెడ్డి (శ్రీనివాస విద్యానికేతన్ లక్ష్మీపురం), కిషోర్(దివ్య హై స్కూల్, భద్రాచలం) రమణ (దివ్య హై స్కూల్, భద్రాచలం) తదితరులు పాల్గొన్నారు.

బోనమెత్తిన మున్సిపల్ చైర్మెన్ డీవి

నవతెలంగాణ-ఇల్లందు



పురపాలక సంఘం పరిధిలోని సత్యనారాయణపురం ప్రాంత ప్రజలు నిర్వహించిన పోచమ్మ తల్లి బోనాల పండుగ వేడుకల్లో పాల్గొని బోనమెత్తిన మున్సిపల్ చైర్మెన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు బోనమెత్తారు. వందలాదిమంది వార్డు ప్రజలు అంగరంగ వైభవంగా పండుగను జరుపుకున్నారు. కన్నుల పండుగ వాతావరణంలో జరిగిన ఈ వేడుకలలో చైర్మెన్ మాట్లాడుతూ ఇంతటి మంచి కార్యక్రమానికి ఆహ్వానించిన స్థానిక వార్డు కౌన్సిలర్ రవికి, వార్డు ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కటకం పద్మావతి, అంకె పాక నవీన్ కుమార్, భారత రాష్ట్ర సమితి పట్టణ నాయకులు ఎర్ర ఈశ్వర్, వార్డు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠ, బోనాల శుభాకాంక్షలు

నవతెలంగాణ-ఇల్లందు

స్థానిక రాజీవ్ నగర్ గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ, బోనాల సందర్భంగా గ్రామ ప్రజలకు జడ్పీ చైర్మెన్ కోరం కనకయ్య శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం కార్యక్రమానికి విచ్చేసిన కోరం కనకయ్యకు గ్రామస్తులు సాంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జెడ్పీ చైర్మెన్ వెంట ఎంపీటీసీలు మండల రాము, కృష్ణ ప్రసాద్, సర్పంచులు పాయం స్వాతి, కల్తీ పద్మ, కాంగ్రెస్ నాయకులు మూతి కృష్ణ, తాటి బిక్షం, మడుగు సాంబమూర్తి, ఆముదాల ప్రసాద్, పాయం ఆంజనేయులు, సాలోమోన్ బల్లెం, నాగార్జున, శేఖర్, అన్వేష్, అష్రీద్, స్థానికులు ఉన్నారు.

కొడుకుని హతమార్చిన తల్లి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలంలోని మెడికల్ కాలనీలో కొడుకుని హత్య చేసిన తల్లి ఘటన ఆలస్యంగా వెలుగోలి వచ్చింది. సావిత్రి తన కొడుకు దుర్గాప్రసాద్‌ను ఇంట్లో హత్య చేసి భద్రాచలం సరిహద్దు ప్రాంతమైన ఆంధ్రప్రదేశ్లోని అల్లూరి జిల్లా ఎటపాక పోలీస్ స్టేషన్ పరిధి తుమ్మల నగర్ అడివిలో మృతదేహాన్ని కాల్చివేశారు. మద్యం తాగి వచ్చి ప్రతిరోజు గొడవ చేస్తున్నాడని కత్తితో మెడ కోసి హత్య చేసినట్టు సమాచారం.

బీఆర్ఎస్ కుటుంబ పాలన అంతమొందించాలి

నవతెలంగాణ-ఇల్లందు

గత తొమ్మిది ఏళ్లగా సాగుతున్న బీఆర్ఎస్ పార్టీ, సిఎం కెసిఆర్ కుటుంబ పాలన అంతమొందించాలని బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ రాజ్యసభ సభ్యులు గరికపాటి మోహన్ రావు అన్నారు. పాత బస్టాండ్‌లోని అంతా కాంప్లెక్స్‌లో ఆదివారం నియోజకవర్గ పోలింగ్ బూత్ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. తొలుత జెకె కాలనీ నుండి పాత బస్టాండ్ వరకు నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో చాడ సురేష్ రెడ్డి మాజీ పార్లమెంట్ సభ్యులు, కూన శ్రీశైలం గౌడ్, మాజీ శాసనసభ్యులు, మాజీ ఎంపీలు రవీంద్ర నాయక్, చాడ సురేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కుంజా సత్యవతి, ఊకే అబ్బయ్య మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ముసుకు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విలువలతో కూడిన విద్యను బోధించాలి

- బాలసాహిత్యంతో విలువలు పెరుగుతాయ్
- కవి, విద్యావేత్త, జాషువా సాహిత్య వేదిక

అధ్యక్షుడు మువ్వా శ్రీనివాసరావు

నవతెలంగాణ-సత్తుపల్లి

విలువలతో కూడిన విద్యను బోధించాల్సి బాధ్యత ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఉపాధ్యాయుల భుజస్కంధాలపై ఉందని ప్రముఖ కవి, విద్యావేత్త, జాషువా సాహిత్య వేదిక అధ్యక్షుడు మువ్వా శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. రంగపురి కృష్ణార్జున్ రచించిన బాలసాహిత్య చరితార్థ శతకం, రజతోత్సవ కథల పుస్తకాలను ఆదివారం సత్తుపల్లిలోని కళాభారతి ఆడిటోరియంలో సృజన సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మువ్వా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ సభలో మువ్వా మాట్లాడుతూ నేటితరం విద్యార్థులు బడికివచ్చే సమయానికే సామాజిక మాధ్యమాల్లోని కాలుష్యాన్ని మనసుల్లో నింపుకొని వస్తున్నారన్నారు. ఆ కాలుష్యాన్ని తొలగించి విలువలను అందించే బాలసాహిత్యాన్ని రాయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, కవులు, రచయితలపై ఉందన్నారు. గతంలో ఉపాధ్యాయులు విద్యను బోధిస్తే సరిపోయేదని, వర్తమానంలో వస్తున్న విపరీత ధోరణులు పిల్లలపై ప్రభావం చూపుతున్న తరుణంలో విలువల విద్యను విద్యార్థులకు అందించాలన్నారు. కాన్యక్రమంలో భాగంగా పుస్తకావిష్కరణ అనంతరం తొలి ప్రతులను కృష్ణార్జున్ తల్లిదండ్రులు కోటిరామ్మూర్తి, సుశీల, మిత్రుడు ఏవీ శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు అంకితమిచ్చి ఘనంగా సన్మానించారు. చరితార్థ శతకాన్ని కన్నెగంటి వెంకటయ్య, రజతోత్సవాన్ని చిమ్మపూడి కళ్యాణశర్మ పుస్తక సమీక్ష చేశారు. సమావేశంలో పాల్గొన్న పలువురు అతిథులు, సాహితీ వేత్తలు మాట్లాడుతూ బాలసాహితీ వేత్తగా కృష్ణార్జున్ సమాజానికి విలువైన సాహిత్యాన్ని అందజేశారని అభినందించారు. సమిష్టి కుటుంబ వ్యవస్థ కనుమరుగవుతున్న తరుణంలో ఇంటివద్ద పిల్లలను పట్టించుకొనే వారు కరవవుతున్నారని, తల్లిదండ్రుల బాధ్యతలను కూడా పాఠశాలలో ఉపాధ్యాయులే నిర్వర్తించాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో దమ్మపేట మండల విద్యాశాఖాధికారి లక్ష్మీ ప్రధానోపాధ్యాయులు జగపతి, పద్మావతి, బాలసాహితీ వేత్తలు ఉరిమళ్ల సునంద, వెంకటేశ్వరరావు, సృజన నిర్వాహకులు బొల్లేపల్లి మధుసూదనరాజు, గార్లపాటి రామకృష్ణ, పసుపులేటి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, పిల్లి మల్లికార్జున్ ప్రసంగించారు.

నేటి నుండి మూడు రోజులపాటు విద్యుత్ అంతరాయం

ముదిగొండ : ముదిగొండ, కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలయపాలెం, ఖమ్మం రూరల్ మండలాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో జాతీయ రహదారులు విస్తరణలో భాగంగా 132 కెవి విద్యుత్తు లైన్లో ఎత్తు పెంచేందుకు ఈనెల 11, 12, 13 తేదీల్లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పరిశ్రమలు, వ్యవసాయానికి అందించే విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నదని విద్యుత్ శాఖ ఖమ్మం రూరల్ డీఈ సిహెచ్ నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాలలో గృహాలకు ఇచ్చే విద్యుత్ సరఫరా యథావిధిగా కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు, కూసుమంచి మండలంలో పాలేరు, కూసుమంచి, నేలకొండపల్లి మండలంలో రాజేశ్వరపురం, నేలకొండపల్లి,ముదిగొండ మండలంలో ముదిగొండ,పమ్మి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాలలో సెక్షన్ పరిధిలోగల పరిశ్రమలు,వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి

ముదిగొండ : చాకలి ఐలమ్మ వర్ధంతి ముదిగొండ మచ్చా వీరయ్య భవనంలో నిర్వహించారు. సిపిఐ(ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మందరపు వెంకన్న, ఇరుకు నాగేశ్వరరావు, స్టడీ సర్కిల్ కన్వీనర్ రఫీ, ఐద్వా మండల అధ్యక్షులు మందరపు పద్మావతి, రైతు సంఘం నాయకులు పుచ్చకాయల లక్ష్మయ్య, వ్యకాస మండల కార్యదర్శి వేల్పుల భద్రయ్య పాల్గొన్నారు.

లాగే కొద్ది సాగుతున్న ఏపీజీవీబీ లీలలు

ఇన్సూరెన్స్ పేరిట బలవంతపు వసూళ్లు

- చాలీచాలని పెట్టుబడులతో సతమతమవుతున్న గిరిజన రైతులు
- వెలుగులోకి వస్తున్న మరిన్ని మోసాలు

నవతెలంగాణ-చర్ల

మాయల పకీరు సినిమా వలే లాగే కొద్ది సాగినట్లు ఆర్ కొత్తగూడెం ఏపీజీవీబీ లీలలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న సదరు బ్యాంకు మేనేజర్ మరో మధ్యవర్తితో చేతులు కలిపి అక్రమ సంపాదనకు భారీగా తెరలేపారని విమర్శలు గుప్పుమంటున్నాయి. ఆర్ కొత్తగూడెంలో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే నిరుపేదలు ముద్రణా లోన్ కోసం వెళ్ళినప్పుడు సివిర్ స్కోర్ మీకు సరిగా లేదు మీకు లోన్ ఇవ్వడం కుదరదని ముఖాయించిన సదరు మేనేజరు అదే ఆర్.కొత్తగూడెంలో ఆయనకి మామ మియ్యాలు. ముట్ట చెప్పిన వారి ఇంట్లో మూడు నుంచి నాలుగుర్కి లోన్లు ఇవ్వడం పట్ల సర్వత్ర ఘాటైన విమర్శలు వినిపిస్తున్నాయి.



బాధితుడు

ఎంసీపీ లోన్లు ఇచ్చే క్రమంలో బ్యాంకు మేనేజర్ నానా అవస్థలు గురిచేస్తూ చేతివాటానికి అలవాటు పడ్డాడని డ్వాక్రా మహిళలు విమర్శలు చేస్తున్నారు. ఏజెన్సీ ఆదివాసీ రైతుల అవసరాలను ఆసరాగా తీసుకున్న మధ్యవర్తి బ్యాంకు మొత్తం తానే నడిపించే అంతగా గిరిజన రైతులను నమ్మించి తాను చెప్పితేనే క్రాప్ లోన్లు ఇస్తారు అనే అంతగా నమ్మ పలికి బ్యాంకు మేనేజర్ మధ్యవర్తి ఇద్దరి ఒప్పందంతో ఎకరాకు కేవలం రూ.30 వేల ఇవ్వాల్సి ఉండగా రూ.లక్ష లోను కూడా పేపర్ పని చేసి ఆ ఆదివాసి రైతు చేతిలో కేవలం రూ.20వేలు మాత్రమే పెట్టి మిగతావి మధ్యవర్తి, బ్యాంకు మేనేజర్ సర్దుబాటు చేసుకున్నట్లు తేటతెలమౌతుంది.

ఇన్సూరెన్స్ పేరిట బలవంతపు వసూళ్లు:

క్రాప్ లోన్ కావాలంటే తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయాలని హుంకు ప్రదర్శిస్తూ నిరుపేద గిరిజన రైతుల దగ్గర నుండి సదరు బ్యాంకు మేనేజర్ పెద్ద మొత్తంలో సొమ్ము కాసేసినట్టు నిజాలు నెగ్గు తేలుతున్నాయి. ఆర్థికంగా వెనుకబడి ఉన్న అమాయకపు ఆదివాసి రైతులను టార్గెట్ చేసుకొని బ్యాంకు మేనేజర్, సదరు మధ్యవర్తి కోట్ల రూపాయలు కాచేసేసినట్లు ఆర్.కొత్తగూడం అంతట అలజడి లేచింది. సంవత్సరానికి రూ.18000 చొప్పున మూడు సంవత్సరాలు కడితే మీకు రూ.రెండు లక్షల వస్తాయని నమ్మ పలికించి సదర్ మేనేజర్ ఇన్సూరెన్స్‌ల పేరిట దండుకుంటున్నాడనే విమర్శలు లేకపోలేదు. కుర్నపల్లికి చెందిన శ్రీను అనే మరో గిరిజన రైతు వద్ద నుండి ఇన్సూరెన్స్ పేరిట రూ.20వేలు వసూలు చేసినట్లు నవతెలంగాణ పరిశీలనలో తేలింది.

చాలీచాలని పెట్టుబళ్ళతో సతమతమవుతున్న గిరిజన రైతులు:

ఆస్తి మూరెడు అప్పు బారడన చందంగా గిరిజన రైతు చాలీచాలని పెట్టుబడులతో ఒకపక్క సతమతమవుతుంటే సదరు ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్, ప్రముఖ వ్యాపారితో కలసి నూతనంగా వచ్చిన పోడు పట్టాలకు లోన్లు ఇవ్వటంలో తమదైన సైడిలో చేతివాటం ప్రదర్శిస్తూ గిరిజన రైతులను నాన్న అవస్థలకు గురి చేస్తున్నట్లు చింతగుప్ప, బోధనల్లి, ఎర్రబోరు, కుర్నపల్లి ఆదివాసి రైతులు వాపోతున్నారు. తమ తమ లావాదేవీలను తమ ఖాతా పుస్తకంపై ముద్రించి ఇమ్మని ఎన్ని మార్లు అడిగినా అలా ముద్రించి ఇవ్వడానికి నిరాకరిస్తూ బ్యాంకు మేనేజర్ తన విశ్వసనీయతను పోగొట్టుకోవడం వల్లనే తీగలాగితే డొంక కదిలింది.

వెలుగులోకి వస్తున్న మరిన్ని మోసాలు:

సదరు వ్యాపారి ఏ ఏ మండలాలలో పెట్టుబడులు పెడుతున్నాడో ఆ మండలాలలో ఉన్న రైతులకు సైతం ఇక్కడ క్రాఫ్ లోన్లు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ ప్రాంత రైతులకు, వ్యాపారస్తులకు, డ్వాక్రా మహిళలకు రుణాలు ఇచ్చి అభివృద్ధి చేయాల్సిన సదరు బ్యాంకు మేనేజర్ పక్క మండలాల రైతులకు ఎలా రుణాలు ఇస్తున్నారని ఈ ప్రాంత రైతులు మండిపడుతున్నారు.

కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించండి

- ప్రయివేట్ కంపెనీలో యువతకు 70 శాతం రిజర్వేషన్
- నియోజవర్గ నేత దల్ సింగ్ నాయక్

నవతెలంగాణ-ఇల్లందు



అన్ని వర్గాలను ఆదుకుంటాం, కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించండి అధికారంలోకి రాగానే ప్రయివేట్ కంపెనీలో యువతకు 70 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని నియోజవర్గ నేత దల్ సింగ్ నాయక్ అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం హైదరాబాద్ డిక్లరేషన్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇంటికి, రూ.ఐదు లక్షలు, ఇంట్లో ఇద్దరు వృద్ధులు ఉంటే రూ.ఐదు వేల పెన్షన్, రైతులకు ఒకేసారి రూ.ఈ రెండు లక్షల రుణమాఫీ ఇస్తూ హైదరాబాద్ డిక్లరేషన్ కచ్చితంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పులి సైదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దీవెనలు, కేసీఆర్ సహకారంతో...

కొత్తగూడెంను సుందరంగా తీర్చిదిద్దుతున్నా

- ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-కొత్తగూడెం



ప్రజల దీవెన, కేసీఆర్ సహకారంతో కొత్తగూడెం నియోజక వర్గాన్ని అన్ని హంగులతో సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం కొత్తగూడెం మున్సిపాలిటీలోని రామాటాకీసు, మధురబస్తి, సన్యాసి బస్తి, ఏ-పవర్ హౌస్ బస్తి ప్రాంతాల్లో ఎమ్మెల్యే వనమా సుడిగాలి పర్యటన చేసి, సుమారు రూ.17 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజకీయాలకతీతంగా కొత్తగూడెంను అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికి అందాలన్నదే కేసీఆర్ లక్ష్యమని చెప్పారు. కొత్తగూడెం నియోజకవర్గంలో శాశ్వత అభివృద్ధితోనే నా హయాంలోనే రైల్వే అండర్ బ్రిడ్జి, మొర్రేడు బ్రిడ్జి, గోధుమ వాగు బ్రిడ్జి కట్టినట్లు చెప్పారు. 10 వేల మందికి ఎంతో చారిత్రాకమైన క్రమబద్ధీకరణ పట్టాలను పంపిణీ చేసామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వనమా రాఘవేందర్, మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్య రాంబాబు, కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులు, స్థానిక వార్డు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'విజయ'లో ఓరియంటేషన్ కార్యక్రమం



నవతెలంగాణ-కొణిజర్ల

స్థానిక విజయ ఇంజనీరింగ్ కళాశాల నందు 2023-24 సంవత్సరానికి గాను మొదటి సంవత్సరంలో జాయిన్ అయిన విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకను కళాశాల చైర్మెన్ పారుపల్లి ఉషా కిరణ్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కళాశాలలో వివిధ బ్రాంచీలలో జాయిన్ అయినా విద్యార్థిని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంజనీరింగ్ విద్య దాని ప్రాముఖ్యత దాని వల్ల తరువాత జీవితంలో ఉద్యోగ అవకాశాలు గురించి విద్యార్థులకు తెలియజేశారు. విజయ ఇంజనీరింగ్ కళాశాలని తమ ఆప్షన్‌గా ఎంచుకొని కళాశాలలో జాయిన్ అయినందుకు విద్యార్థులను అభినందించారు. మొదటి సంవత్సరం నుంచే విద్యార్థులకు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసి ఆ లక్ష్యాన్ని చేరుకునే దిశగా కళాశాల అన్ని వసతులను విద్యార్థులకు కల్పిస్తుందని చెప్పారు. కళాశాలలో వీ హబ్ ఒక ఇంక్యుబేషన్ సెంటర్‌ని ఏర్పాటు చేసి దాని వల్ల విద్యార్థుల సృజనాత్మకతను పెంపొందిస్తుందని చెప్పారు. ఐఐటీ కాన్పూర్ వారిచే ఎంవోయూ కలిగి విద్యార్థులకు ఆన్‌లైన్ ప్రోగ్రామ్స్ అందిస్తున్నామని చెప్పారు. అదే విధంగా నిరంతరం కళాశాలలో సీఆర్‌టి ప్రోగ్రాంని రెగ్యులర్ క్లాసులకి అనుగుణంగా, టాస్క్ ప్రోగ్రామ్ అని విధిగా నిర్వహిస్తున్నామని చెప్పారు. కమ్యూనికేషన్ స్కిల్స్ టెక్నికల్ స్కిల్స్, ఉద్యోగానికి వస్తున్నా అన్ని స్కిల్స్‌ని విద్యార్థులకు మొదటి సంవత్సరం నుంచే అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు కళాశాల జీవితంలో చదువుతోపాటు క్రీడలు, లిటరరీ సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొంది తమ సృజనాత్మకతని పెంపొందించుకోవాలని చెప్పారు. తరువాత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జాన్ బాబు నూతనంగా కళాశాలలో జాయిన్ అయిన విద్యార్థులకు స్వాగతం పలికి వారిని అభినందించారు. ప్రముఖ క్లినికల్ సైకాలజిస్ట్, వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ గోగి శ్రీకాంత్ ఆచార్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చిన్నయ్య, డీన్ డాక్టర్ శ్రీనివాస రావు, డైరెక్టర్ ప్లేస్మెంట్ డాక్టర్ ఆయేషా, డైరెక్టర్ అడ్మిషన్స్ డాక్టర్ ఫరీద్ బాబా పాల్గొన్నారు.



ఖమ్మంలో ద బెస్ట్ పాసిబుల్ ఎక్స్ పీరియన్స్ పుస్తకావిష్కరణ

నవతెలంగాణ ఖమ్మం

నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో న్యూ ఇరా విద్యాసంస్థల ఆధ్వర్యంలో న్యూ ఇరా పూర్వ విద్యార్థి "నిశాంత్ ఇంజం"చే రచించబడిన "ద బెస్ట్ పాసిబుల్ ఎక్స్పీరియన్స్" అనే పుస్తకాన్ని ప్రముఖ సాహితీవేత్త, ప్రముఖ విమర్శకులు ఐ.వి రమణామూర్తి, కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు ప్రసేన్, ప్రముఖ కవి తెలుగు అధ్యాపకులు సీతారాం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ డబ్బు సంపాదనే ధ్యేయంగా విదేశాలకు వెళుతున్న ఈ రోజుల్లో లక్షల జీతాలు ఇచ్చే సాఫ్ట్వేర్ రంగాన్ని వదిలేసి సాహితీ రంగాన్ని ఎంచుకున్న నిశాంత్ ఎంతో మంది విద్యార్థులకు ఆదర్శనీయమన్నారు. ప్రసేన్ మాట్లాడుతూ అమెరికాలో విడుదలైన ఈ పుస్తకం.. అత్యధికంగా అమ్ముడయ్యే టాప్ 10 పుస్తకాల జాబితాలో చోటు సంపాదించుకోవడం నిజంగా గర్వకారణం అన్నారు. న్యూఇరా విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ పి. భూమేశ్వరరావు మాట్లాడుతూ నిశాంత్ తమ విద్యార్థి అయినందుకు గర్వపడుతున్నామన్నారు. న్యూ ఇరా విద్యాసంస్థలు తమ విద్యార్థుల ఆల్ రౌండ్ డెవలప్మెంట్ కోసం నిరంతరం పరిశోధిస్తూ, తమ విద్యార్థులను అన్ని రంగాల్లో ముందుండేలా కృషి చేస్తుందన్నారు. న్యూ ఇరా విద్యాసంస్థల చైర్మన్ ఇంజం వెంకట రమణ రావు మాట్లాడుతూ నిశాంత్ తన పుత్రుడైనందుకు గర్వంగా ఉందని, అంతకంటే ముందు న్యూ ఇరా విద్యార్థి అని సగర్వంగా తెలుపుతూ పుత్రోత్సాహంతో పులకించి పోయారు. అనంతరం గిన్నిస్ బుక్ లో చోటు సంపాదించుకున్న న్యూఇరా విద్యార్థిని కే. స్వాత్య ప్రదర్శించిన స్వాగత నృత్య రూపకం పలువురిని ఆకట్టుకుంది.

కాంగ్రెస్‌తోనే పేదల జీవనం మార్పు

- బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ-కారేపల్లి

కాంగ్రెస్‌తోనే పేదల జీవనంలో మార్పు సాధ్యమని వైరా నియోజవర్గ కాంగ్రెస్ నాయకురాలు బానోత్ విజయబాయి అన్నారు. ఆదివారం గడపగడపకు కాంగ్రెస్ పథకాల కార్యక్రమాన్ని కారేపల్లి మండలం మంగళితండాలో నిర్వహించారు. కాంగ్రెస్ చేపట్టబోయే పథకాలు వివరిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలలో అవినీతిని గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు ధరావత్ రాంబాబు ఆధ్వంలో యువకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి విజయబాయి పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి అహ్వానించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు. మల్లెల నాగేశ్వరావు. గుగులోతు శ్రీను, పాల్గొన్నారు.

కాంగ్రెసోళ్లు మాయమాటలు చెబితే 'నిలదీయండి'

- వాళ్లు ఐదు పథకాల్లో ఏదీ అమలు కాదు
- మొన్న గెలిచిన కర్నాటకలో సంక్షేమాభివృద్ధి నిల్
- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

నవతెలంగాణ-సత్తుపల్లి

ఎన్నికలు వస్తున్న తరుణంలో కాంగ్రెస్ నాయకులు వాళ్ల చేసే ప్రచారంలో ప్రజలకు ఏవేవో మాయమాటలు చెబుతూ ప్రజలను మభ్యపెట్టి లబ్ధిపొందాలని చూస్తున్నారని, వారు చెప్పే మాయమాటలపై ప్రజలు నిలదీయాలని, కాంగ్రెసొస్తే ఐదు గ్యారంటీ పథకాలంటూ వాళ్ల చెప్పుకొస్తున్న పథకాలేవీ అమలు కావని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీయ్య అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాలులో సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే సండ్ర పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సండ్ర మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఓట్లేస్తే అదిచేస్తాం, ఇదిచేస్తామంటూ కల్లబొల్లి మాటలు చెబుతున్నారని, మొర్న కర్నాటకలో గెలిచిన మీరు అక్కడి ప్రజలకు ఏఏ పథకాలు ఇస్తున్నారో చెప్పాలన్నారు. అంతేగాని ఐదు గ్యారంటీ పథకాలంటూ ప్రజలను మోసగించాలని చూస్తే మీరనుకునేంత తెలివి తక్కువవారు కాదని, విజ్ఞులైన ప్రజలకు అంతా తెలుసన్నారు. మాయమాటలు చెబితే భంగపాటు తప్పదన్నారు. మీకు దమ్ముంటే కర్నాటకలో అమలు చేసి ఇక్కడ చెప్పుకుంటే బాగుందన్నారు. 55 యేండ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలు అధోగతి పాలయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మున్సిపల్ చైర్మెన్ కూసంపూడి మహేశ్, ఎంపీపీ దొడ్డా హైమవతిశంకరరావు, డీసీసీబీ డైరెక్టర్లు చల్లగుండ్ల కృష్ణయ్య గొర్ల సంజీవరెడ్డి, మోదుగు పుల్లారావు, నాయకులు ఎస్కే రఫీ, మల్లూరు అంకమరాజు, లక్కినేని వినీల్, పాలా వెంకటరెడ్డి, కౌన్సిలర్లు మట్టా ప్రసాద్, చాంద్‌పాషా పాల్గొన్నారు.



మున్నేరు బాధిత కుటుంబాలకు చెక్కులు పంపిణీ

- ప్రాణనష్టం జరుగకుండా కాపాడాం : మంత్రి

నవతెలంగాణ-ఖమ్మం

మునుపెన్నడూ చూడని వరదలు మనం చూశాం, రాత్రికి రాత్రి వరద తీవ్రత ప్రమాద స్థాయికి చేరుకుంది. అధికారులు ప్రజాప్రతినిధులు అందరూ సమిష్టిగా కృషిచేసి ప్రాణ నష్టం జరగకుండా కాపాడగలిగామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ఆదివారం ఖమ్మం నయాబజార్ ప్రభుత్వ పాఠశాలలో మున్నేరు బాధిత 1718 కుటుంబాలకు కోటి 50 లక్షల రూపాయల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వరద బాధితులకు సహాయం చేయాలన్న విజ్ఞప్తి మేరకు రాజ్యసభ సభ్యులు బండి పార్థసారథి రెడ్డి కోటి రూపాయలు, పువ్వాడ అపర్ణ 50 లక్షల రూపాయలను మొత్తం రూ. 1.50 కోట్లు కలెక్టర్ అకౌంట్ కు బదలాయించి, అ మొత్తం పంపిణీ చేస్తున్నామని అన్నారు. జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ మున్నేరు వరద ముంపు కుటుంబాలు 1,718 లలో ఒక్కో కుటుంబానికి 8,463 వేల రూపాయల చొప్పున అందరికీ సమానంగా పంపిణీ చేశామన్నారు. వరదల సమయంలో నష్టపోయిన వారికి ఎంతో కొంత సహాయం చేయాలని మంత్రి అజయ్ కుమార్ ఎంతో కృషి చేశారని, నష్టపోయిన వరద బాధితులను సర్వే చేయమని చెప్పడంతో వెంటనే సర్వే ప్రక్రియ పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఎక్కువగా నష్టపోయిన బొక్కలగడ్డ ప్రాంతం వారు 615 మందికి 51 లక్షల 90 వేల 600 రూపాయలు అందజేసినట్లు కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఖమ్మం ఆర్డీవో జి. గణేష్, కార్పొరేటర్ లు కమర్తపు మురళి, మాటేటి అరుణ, పగడాల నాగరాజు కన్నం వైష్ణవిప్రసన్న కృష్ణ, ఆర్జేసి కృష్ణ, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సిహెచ్. స్వామి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులకు బెదరం

- సమస్యలు పరిష్కరించాల్సిందే - అంగన్‌వాడీ జేఏసీ

నవతెలంగాణ-కారేపల్లి

పనికి తగిన వేతనం ఇవ్వకుండా సమస్యలపై సోమవారం నుంచి సమ్మెకు వెళున్న అంగన్‌వాడీలను అధికారులతో బెదిరింపులకు ప్రభుత్వం పాల్పడుతుందని బెదిరింపులకు బెదిరేది లేదని సీఐటీయు మండల కన్వీనర్ కే.నరేంద్ర అన్నారు. కారేపల్లిలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం ఆదివారం ఎస్.నాగమణి, విజయకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కే.నరేంద్ర మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని పనిభారం తగ్గించాలని, పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచిన స్పందన లేదన్నారు. 14 రోజుల క్రితమే అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెకు వెళ్తామని ఐసీడీఎస్ కమిషనర్‌కు నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. సమస్యలు పరిష్కరించక పోగా సమ్మెను విచ్చినం చేయటానికి బెదిరింపులకు దిగుతున్నారని విమర్శించారు. ఉద్యోగుల పట్ల నిరంకుశంగా వ్యవహరించిన ప్రభుత్వాలు ప్రజాగ్రహంకు గురైన సంగతిని ప్రభుత్వాధినేతలు గుర్తెరగాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు రోజామణి, సుధావర్షిని, రఘుపతి, లక్ష్మి, బేబీ, శాంతి తదితరులు పాల్గొన్నారు.












తెలంగాణ రైతాంగ సాయుధపోరాట వార్షికోత్సవ సభకు ముందు ప్రదర్శన

హిమాచల్ వరదలను 'జాతీయ విపత్తు'గా ప్రకటించాలి

- ప్రధాని మోడీకి ముఖ్యమంత్రి సుఖవీందర్ సింగ్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ : హిమాచల్ ప్రదేశ్ ఎదుర్కొంటున్న వరదలను జాతీయ విపత్తును ప్రకటించాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత వర్షాకాలంలో భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడ్డం, పిడుగులు పడ్డం వంటి సంఘటనలతో రూ. 12 వేల కోట్ల నష్టాన్ని రాష్ట్రం చవిచూస్తున్నందున జాతీయ విపత్తుగా ప్రకటించాలని కోరారు. న్యూఢిల్లీలో జరుగుతున్న జి-20 సదస్సు సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏర్పాటు చేసిన విందుకు హాజరైన ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ ప్రధానితో సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. వర్షాల కారణంగా ఇప్పటి వరకూ 400 మందికి పైగా మరణించారని, 13 వేలకు పైగా ఇళ్లు నాశనమయ్యాయని, వేలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యాయని మోడీకి తెలిపారు. హిమాచల్ ప్రదేశ్ పునర్నిర్మాణానికి కేంద్రం విశేష సహాయం అందించాలని కోరారు.

వియత్నాం బయలుదేరిన బైడెన్




న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షులు జో బైడెన్ జి20 సదస్సును ముగించుకొని వియత్నాం బయల్దేరి వెళ్లారు. ఆదివారం ఉదయం రాజ్‌ఘాట్‌లో మహాత్మ గాంధీ సమాధి వద్ద బైడెన్ నివాళి అర్పించారు. అనంతరం విమానాశ్రయానికి చేరుకొన్నారు. అక్కడి నుంచి తన ఎయిర్ ఫోర్స్‌వన్ విమానంలో వియత్నాంకు బయల్దేరి వెళ్లారు. జి20 సమావేశాల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడిగా బైడెన్ అధికారం చేపట్టిన తర్వాత భారత్‌లో తొలిసారి పర్యటించారు. శుక్రవారం మొదలైన బైడెన్ పర్యటనలో తొలి రోజు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. తరువాత జి20 సమావేశాల్లో పాల్గొన్నారు.ా వియత్నాం పర్యటనలో కూడా ఆయన ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై ఎక్కువ దృష్టి సారించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఆది, సోమవారాలు బైడెన్ వియత్నాంలో ఉంటారు. వియత్నాం కార్యకలాపాల్లో కూడా బైడెన్ మాస్క్ ధరించే పాల్గొననున్నారు.

భద్రతా దళాల అదుపులో బైడెన్ కాన్వాయ్‌లోని డ్రైవర్

కాగా, బైడెన్ కాన్వాయ్‌లో ఓ డ్రైవర్‌ను శనివారం రాత్రి భద్రతా దళాలు అదుపులోకి తీసుకొన్నాయి. డ్రైవర్ కదలికలు అనుమానాస్పదంగా ఉండటంతో అతడిని దళాలు ప్రశ్నించాయి. బైడెన్ కాన్వాయ్‌లోని కొన్ని వాహనాలు అమెరికా నుంచి రాగా.. మరికొన్నింటిని భారత్‌లోనే కేటాయించారు. వీటిల్లో అద్దెకు తీసుకొన్న కారు ఒకటి ఉంది. బైడెన్ బసచేసే హెూటల్ ఐటీసీ మౌర్యా వద్ద అది ఉండాల్సి ఉండగా.. యుఎఇ పాలకుడు అల్ నహ్యాన్ బస చేస్తున్న తాజ్ హెూటల్ వద్ద అది కనిపించింది. ఒక వ్యాపారవేత్తను అక్కడ డ్రాప్ చేసేందుకు తాను వచ్చానని ఆ డ్రైవర్ అధికారులకు చెప్పాడు. ప్రొటోకాల్ గురించి తనకు తెలియదన్నాడు. కొన్ని గంటలు ప్రశ్నించిన తర్వాత సంతృప్తి చెందిన భద్రతా దళాలు అతడిని వదిలిపెట్టాయి.

జైసల్మేర్‌లో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు



జైపూర్: వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్నారు. వాతావరణ మార్పులతో ఎండలు మండిపోతున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దేశంలో ఎక్కువ ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకుంది. ముఖ్యంగా రాజస్థాన్‌లోని ఎడారి ప్రాంతమైన జైసల్మేర్‌లో శనివారం రికార్డు స్థాయిలో 43.5 డిగ్రీల సెల్సీయస్ నమోదయింది. సెప్టెంబర్ నెలలో ఇంత ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవడం గత 74 సంవత్సరాల్లో ఇదే మొదటిసారి. సాధారణ ఉష్ణోగ్రతలకు ఇది 6.9 డిగ్రీలు అధికం.జైసల్మేర్‌లో 1949, సెప్టెంబర్ 10న 43.3 డ్రిగీలు రికార్డయింది. ఎడారిలోని పలు ప్రాంతాల్లో వేడి గాలులు వీచాయని అధికారులు ఆదివారం తెలిపారు. బర్మేర్‌లో 40.3 డిగ్రీలు, బికనేర్‌లో 40 డిగ్రీలు, జోధ్‌పూర్‌లో 39.5 డిగ్రీలు, జాలోర్‌లో 38.7 డిగ్రీలు, గంగానగర్‌లో 38.5 డిగ్రీలు, ఇక జైపూర్‌లో 32 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న నెలలు కూడా రాష్ట్రంలో ఇదే విధంగా ఉష్ణోగ్రతలు ఉంటాయని అధికారులు చెప్పారు.

నిమ్స్‌లో చిన్నారులకు ఉచిత గుండె ఆపరేషన్లు

- వారం రోజులపాటు నిర్వహించనున్న బ్రిటన్ వైద్య బృందం
- చార్లీస్ హార్ట్ హీరోస్ క్యాంప్ పేరుతో నిర్వహణ
- ఈ నెల 24-30వ తేదీ వరకు మిలీనియం బ్లాక్‌లో ప్రత్యేక శిబిరం ఏర్పాటు

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లోని పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో చిన్నారులకు ఉచితంగా వారం రోజుల పాటు గుండె ఆపరేషన్లు చేయనున్నట్టు ఆస్పత్రి డైరెక్టర్ బీరప్ప ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అప్పుడే పుట్టిన వారి నుంచి, ఐదేండ్లలోపు చిన్నారులకు గుండెలో రంధ్రం, ఇతర గుండె సంబంధిత వ్యాధులు ఉంటే చికిత్స అందించనున్నట్టు తెలిపారు. బ్రిటన్ డాక్టర్ రమణ దన్నపునేని ఆధ్వర్యంలో 10 మంది వైద్య బృందంతోపాటు నిమ్స్ కార్డియో థోరాసిక్ విభాగాధిపతి అమరేశ్వరరావు, వైద్య బృందంతో పాటు నిలోఫర్ హాస్పిటల్ వైద్యులు కూడా ఈ ప్రత్యేక శిబిరంలో పాలుపంచుకోనున్నట్టు తెలిపారు. చార్లీస్ హార్ట్ హీరోస్ క్యాంప్ పేరుతో ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు నిమ్స్ హాస్పిటల్‌లోని మిలీనియం బ్లాక్‌లో బ్రిటన్‌కు చెందిన వైద్య బృందం ప్రత్యేక శిబిరంలో ఆపరేషన్లు చేయనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 040-23489025 నెంబర్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సంప్రదించొచ్చని పేర్కొన్నారు.

సీబీఐ రిమాండ్ రిపోర్ట్‌లో ఏముంది?



అమరావతి : ఏపీ.ముఖ్యమంత్రి స్థాయిలో ప్రజల సొమ్మును కొల్లగొట్టేలా చంద్రబాబునాయడు కుట్ర పూరితంగా వ్యవహరించారని సిఐడి కోర్టుకు నివేదించిన రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొంది. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో నిబంధనలేవీ పాటించలేదని తెలిపింది. ఏపీ సీఐడీ రూపొందించిన 28 పేజీల రిమాండ్ రిపోర్ట్‌ను ఆదివారం ఏసీబీ కోర్టుకు నివేదించింది. తెలంగాణకు చెందిన ఇల్లెందు రమేష్ ద్వారా చంద్రబాబును కలిసిన డిజిటెక్ కంపెనీ ప్రతినిధి సంజయ్ దాగా ఈ ప్రాజెక్టును రూపొందించారని తెలిపింది. స్కిల్ ప్రాజెక్టుపై ఇల్లెందు రమేష్ ఇచ్చిన లేఖను చంద్రబాబు ఉన్నత విద్యాశాఖకు పంపారని పేర్కొంది. 2014 ఆగస్టు 22న సచివాలయంలో చంద్రబాబును డిజిటెక్ ప్రతినిధి సంజయ్‌దాగా, ఇల్లెందు రమేష్ కలిసి ప్రాజెక్టు గురించి చర్చించినట్లు వివరించింది. ఆ తర్వాత 2014 సెప్టెంబర్ 20న కేబినెట్ అనుమతి లేకుండానే ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారని తెలిపింది. స్కిల్ డెవలప్‌మెంట్ ఎమ్‌డి, సిఇఒగా గంటా సుబ్బారావును, డైరెక్టర్‌గా కె లక్ష్మీనారాయణను నియమించినట్లు పేర్కొంది. ఎపి బిజినెస్ రూల్స్ ప్రకారం తప్పనిసరిగా క్యాబినెట్ అనుమతి తీసుకోవాల్సి ఉన్నా ఆ అనుమతి లేకుండానే కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారని తెలిపింది. చంద్రబాబు మార్గదర్శకత్వంలో మంత్రి అచ్చెన్నాయుడు ద్వారా డిజిటెక్, సీమెన్స్‌తో కుమ్మక్కై నిధుల స్వాహాకు పథకం వేశారని పేర్కొంది. 2014 అక్టోబరు 20న తమ మనిషి జె వెంకటేశ్వర్లును స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు ఆడిటర్‌గా నియమించారని తెలిపింది. అక్టోబరు 7నాటికి గంటా సుబ్బారావును ఉన్నత విద్యాశాఖ ఎక్స్ అఫీషియోగా నియమించి నిధులను పక్కదారి పట్టించడంలో కీలకపాత్ర పోషించారని తెలిపింది. చంద్రబాబు ఆదేశాల మేరకు స్కిల్‌డెవలప్‌మెంట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, సీమెన్స్ ఇండియా ఎమ్‌డీ సౌమ్యాద్రి శేఖర్‌బోస్ అలియాస్ సుమన్ బోస్, స్కిల్ డిపార్ట్‌మెంట్ సిఎఫ్ఓ ప్రతాప్‌కుమార్, పుణె కంపెనీ డిజైన్‌టెక్ ఛైర్మన్ వినయ్ కాన్విల్కర్ తదితరులతో గంటా సుబ్బారావు కుమ్మక్కై ఎలాంటి బిల్లులు, కొటేషన్స్, డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు లేకుండా కేబినెట్ ముందుకు ప్రాజెక్టు ప్రతిపాదన పెట్టారని తెలిపింది. క్యాబినెట్ సమావేశానికి ఒకరోజు ముందుగా ప్రతిపాదన పెట్టి 2015 ఫిబ్రవరి 16న ఆగమేఘాల మీద ఆమోదించుకున్నారని పేర్కొంది. రూ 546.84 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఖర్చుకు ఆమోదం చేసుకున్నారని తెలిపింది. వాస్తవాలను నిర్ధారించుకోకుండా, ప్రాజెక్ట్ కాస్ట్ ఎస్టిమేషన్ లేకుండా, థర్డ్ పార్టీ ఎవల్యూషన్ లేకుండానే క్యాబినెట్ ఆమోదం పొందడం వెనుక చంద్రబాబు కీలకంగా వ్యవహరించారని పేర్కొంది. టెండర్ల పద్ధతిని కూడా అనుసరించలేదని, గంటా సుబ్బారావు సిఫార్సులతో రూ.370 కోట్లు విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిపింది. సీమెన్స్ ప్రాజెక్టుకు నిధుల విడుదలలో హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ అభ్యంతరాలు, జోక్యాలు ఉండకూడదని గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసుకున్నారని సిఐడి రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొంది.

2 వేలు దాటిన మొరాకో భూకంప మృతుల సంఖ్య



మరకేష్: ఉత్తర ఆఫ్రికా దేశమైన మొరాకోను భూకంపం కకావికలం చేసింది. పర్యాటక ప్రాంతమైన మరకేశ్‌కు 70 కిలోమీటర్ల దూరంలోని అట్లాస్ పర్వత ప్రాంతంలో శుక్రవారం రాత్రి 6.8 తీవ్రతతో భారీ భూకంపం సంభవించింది వచ్చింది. భూకంపం ధాటికి భారీ సంఖ్యలో భవనాలు నేలమట్టమయ్యాయి. దీంతో ఇప్పటివరకు 2 వేల మందికిపైగా మరణించారు. మరో 2,059 మంది గాయపడ్డారు. దేశంలో గత ఆరు దశాబ్దాల్లో సంభవించిన అతిపెద్ద విపత్తు ఇదేనని అధికారులు తెలిపారు. మరకేష్-సఫి ప్రాంతంలో ప్రాణ, ఆస్తి నష్టాలు అధికంగా ఉన్నాయి. భూకంప దాటికి దాదాపు 45 లక్షల మంది ప్రభావితులయ్యారు.రెండు రోజుల గడిచినా శిథిలాల కింది చిక్కుకుపోయినవారిని రక్షించేందుకు ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

అయితే రహదారులపై వాహనాలు చిక్కుకోవడం, భవన శిథిలాలు పేరుకుపోవడంతో సహాయక కార్యక్రమాలకు ఆటకంగా మారుతున్నాయి. రోడ్లపై పెద్ద పెద్ద రాళ్ల పోగుపడటంతో సహాయక బృందాలు సంఘటనాస్థలాలు, బాధితుల వద్దకు చేరుకోవడం ఆలస్యమవుతున్నదని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. భూకంపం నేపథ్యంలో మొరాకోకు సహాయం చేయడానికి అనేక దేశాలు ముందుకు వస్తున్నాయి.

రెండు దశాబ్దాల క్రితం మొరాకోతో సంబంధాలు తెంచుకున్న పొరుగు దేశం అల్జీరియా కూడా ఈ విపత్తు వేళ సహయం చేయడానికి సిద్ధమైంది. తన మిలటరీని సహాయక చర్యల్లో పాల్గొనేందుకు పంపించింది. విద్రోహ చర్యలకు పాల్పడుతుందనే ఆరోపణలతో మొరాకోతో సరిహద్దులను అల్జీరియా మూసివేసింది. దీంతో 1994లోనే ఇరుదేశాల సరిహద్దులు మూతపడ్డాయి. 2021లో ఆకాశ మర్గాన్ని కూడా మూసివేశారు.

దెబ్బతిన్న చారిత్రక కట్టడాలు

భూకంపంతో మొరాకోలో అనేక చారిత్రక కట్టడాలు ధ్వంసమయ్యాయి. పన్నెండో శతాబ్దంనాటి కౌటౌబియా మసీదు దెబ్బతింది. మరకేష్ పాత నగరంలోని యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశమైన రెడ్ వాల్స్ కూడా దెబ్బతిన్నాయి. ఉత్తర ఆఫ్రికాలో భూకంపాలు చాలా అరుదు అని, ఈ పర్వత ప్రాంతంలో నమోదైన భూకంపాల్లో ఇది చాలా తీవ్రమైనదని అధికారులు తెలిపారు. అగడిర్ పట్టణంలో 1960లో సంభవించిన భూకంపం తీవ్రత భూకంప లేఖినిపై 5.8గా నమోదైందని, అప్పట్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారని అధికారులు చెప్పారు.

ఆ హక్కు తల్లిదండ్రులకు ఉంటుంది మద్రాస్ హైకోర్టు



చెన్నై : తల్లిదండ్రుల పోషణ, పిల్లలకు ఆస్తుల పంపకాలపై మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు చెప్పింది. తమ పోషణను సరిగ్గా పట్టించుకోకుంటే పిల్లలకు కేటాయించిన ఆస్తులను వెనక్కు తీసుకునే హక్కు తల్లిదండ్రులకు ఉంటుందని ఆ తీర్పులో తేల్చి చెప్పింది. పిల్లలకు ఆస్తుల పంపకాలపై తలెత్తిన కీలక ప్రశ్నలకు సమాధానం చెప్పింది. 'ఒకవేళ పిల్లలు తమకు ప్రేమ, ఆప్యాయత సరిగ్గా పంచక పోతే తల్లిదండ్రులు తమ ఆస్తులను ఏకపక్షంగా వెనక్కి తీసేసుకోవచ్చు' అని జస్టిస్ ఎస్ఎం సుబ్రమణ్యం నేతృత్వంలోని బెంచ్ పేర్కొంది. తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అండ్ మెయింటెనెన్స్ యాక్ట్ కింద తల్లిదండ్రులను పిల్లలు సంతృప్తి పర్చాల్సి ఉంటుందని వెల్లడించింది.

'ప్రేమ, ఆప్యాయతల కింద తల్లిదండ్రులు తమ పిల్లలకు గిఫ్ట్ లేదా సెటిల్‌మెంట్ డీడ్ రూపంలో ఆస్తులు ఇవ్వవచ్చు. ఇందులో ఏ ఉల్లంఘన జరిగినా తల్లిదండ్రులు-సీనియర్ సిటిజన్స్ యాక్ట్ అమల్లోకి వస్తుంది. సబ్ రిజిస్ట్రార్ ఇచ్చిన ఆదేశాల్లో ఎటువంటి బలహీనతలు లేవు' అని అని హైకోర్టు తెలిపింది.

'పెద్దల పట్ల మానవీయ కోణంలోనే వ్యవహరించాలన్నదే ఈ చట్టం ఉద్దేశం. సీనియర్ సిటిజన్ల భద్రత, గౌరవాన్ని రక్షించకపోతే ఈ చట్టం అమల్లోకి వస్తుంది' అని అని జస్టిస్ సుబ్రమణ్యం తెలిపారు.

ఇండియా పేరును భారత్‌గా మార్చడం

ఇష్టం లేకపోతే దేశం విడిచి వెళ్లిపోండి

- బీజేపీ ఎంపీ వివాదస్పద వ్యాఖ్యలు
- కోల్‌కతాలో విదేశీయుల విగ్రహాలు తొలగిస్తాం



కోల్‌కతా: 'ఇండియా' పేరును 'భారత్'గా మార్చడం ఇష్టంలేని వాళ్లు దేశం విడిచి వెళ్లిపోవచ్చని బీజేపీ ఎంపీ దిలీప్ ఘోష్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అలాగే, పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కోల్‌కతాలో విదేశీయుల విగ్రహాలను తొలగిస్తామని చెప్పారు. ఆదివారం ఖరగపూర్‌లో కార్యకర్తలతో ఏర్పాటు చేసిన 'ఛాయ్ పే చర్చా' కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయుకులు, మేదినిపూర్ ఎంపీ దిలీప్ ఘోష్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కోల్‌కతాలో వలసవాదానికి ప్రతీకగా నిలిచిన విదేశీ విగ్రహాలన్నింటినీ తొలగిస్తాం. ఇండియా పేరును భారత్‌గా మార్చడం నచ్చని వాళ్లు దేశం వదిలి వెళ్లిపోవచ్చు' అని అన్నారు. మరో బీజేపీ నాయకుడు రాహుల్ సిన్హా మాట్లాడుతూ.. 'దేశానికి రెండు పేర్లు ఉండవు. ఢిల్లీ వేదికగా ప్రతిష్ఠాత్మక జీ20 సదస్సు జరుగుతోంది. పేరు మార్చడానికి ఇదే సరైన సమయం' అని వ్యాఖ్యానించారు. జీ20 దేశాధినేతలను విందుకు ఆహ్వానిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' పేరుతో ఆహ్వానాలు పంపడం వివాదాస్పదంగా మారిన సంగతి తెలిసిందే. దీనిపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దేశం పేరును 'ఇండియా'గా కాకుండా భారత్‌గా పేర్కొనడం దారుణమని మండిపడుతున్నాయి.

పవర్ పాయింట్ సృష్టికర్త అస్టిన్ మృతి

న్యూయార్క్ : విశేష ప్రాచుర్యం పొందిన పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ సహసృష్టికర్త డెన్నిస్ అస్టిన్ (76) ఆదివారం మృతి చెందారు. కొంతకాలంగా ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో బాధపడుతున్న అస్టిన్ కాలిఫోర్నియాలో మరణించారని ఆయన కుమారుడు మైఖేల్ అస్టిన్ మీడియాకు వెల్లడించారు. ఎంఐటిలో ఇంజనీరింగ్ పూర్తిచేసిన అస్టిన్ ఫోర్‌థాట్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేశారు.

టెక్నాలజీ రంగంలో విశేష సేవలందించిన అస్టిన్ పవర్‌పాయిట్ కో డెవలపర్‌గా గుర్తింపు పొందారు. ఫోర్‌థాట్‌కు చెందిన రాబర్ట్ గస్కిన్స్‌తో కలిసి అస్టిన్ పవర్‌పాయింట్‌పై పనిచేశారు. ఫోర్‌థాట్ సంస్థను తరువాత మైక్రోసాఫ్ట్ కొనుగోలు చేసింది. 1985 నుంచి 1996లో రిటైరయ్యే వరకూ పవర్‌పాయింట్ ప్రైమరీ డెవలపర్‌గా అస్టిన్ సేవలందించారు. 1993 నాటికి పవర్‌పాయింట్ ఏకంగా పది కోట్ల సేల్స్ నమోదు చేసింది.

ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పవర్‌పాయింట్‌ను సులభంగా నిర్వహించేలా అస్టిన్ సరళతరం చేశారు. కేవలం స్లైడ్స్ కాకుండా ప్రెజెంటేషన్స్‌ను పకడ్బందీగా ఇచ్చేలా పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌ను అస్టిన్ డెవలప్ చేశారు. అస్టిన్ పవర్‌పాయింట్‌ను డిజైన్ చేయకుంటే దాని గురించి ఏ ఒక్కరూ వినిఉండేవారు కాదని, అది ఇంతగా ప్రాచుర్యం పొందేదని కాదని తన పుస్తకంలో గస్కిన్స్ రాసుకొచ్చారు. పవర్‌పాయింట్‌పై ప్రతిరోజూ 5 కోట్ల ప్రెజంటేషన్స్ క్రియేట్ అవుతున్నాయి. కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్‌లు, బిజినెస్ స్కూల్స్, ప్రొఫెసర్లు, మిలటరీ జనరల్స్ ఈ సాఫ్ట్‌వేర్‌ను విరివిగా వాడుతున్నారు.

పుతిన్‌ను అరెస్టు చేయం : బ్రెజిల్ అధ్యక్షులు

న్యూఢిల్లీ: తాను అధ్యక్ష పదవిలో ఉన్నంత వరకు బ్రెజిల్‌లో రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ అరెస్ట్ జరగదని ఆ దేశ అధ్యక్షులు లూయిజ్ ఇనాసియో లూలా డి సిల్వా తెలిపారు. వచ్చే ఏడాది జి20 సమావేశాలు బ్రెజిల్‌లో జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో 2024లో తమ దేశంలో జరిగే జి20 సమావేశాలకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ హాజరవుతారని, అక్కడ పుతిన్ అరెస్టయ్యే అవకాశమే లేదని ఆయన తేల్చి చెప్పారు.

ఉక్రెయిన్- రష్యా వివాదం నేపథ్యంలో యుద్ధ నేరాల చట్టం కింద అంతర్జాతీయ న్యాయస్థానం రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్‌కు అరెస్ట్ వారెంట్ జారీచేసి సంగతి తెలిసిందే. ఈ ఏడాది మార్చిలో పుతిన్‌కు అరెస్ట్ వారెంట్ జారీ అయినప్పటి నుంచి పుతిన్ విదేశాల్లో పర్యటించడం లేదు. భారత్‌లో ముగిసిన జి20 సమావేశాలకు కూడా పుతిన్ హాజరుకాలేదు. ఈ నేపథ్యంలో బ్రెజిల్ అధ్యక్షుడి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

2024 ఎన్నికల్లో 'ఇండియా' గెలిస్తేనే దేశానికి రక్షణ : స్టాలిన్



చెన్నై : 2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీల కూటమి 'ఇండియా' గెలిస్తేనే దేశాన్ని రక్షించుకోగలమని తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షులు ఎంకె స్టాలిన్ తెలిపారు. నెవైల్లిలో తమ పార్టీ కార్యకర్త, శాసనసభ్యులు రాజేంద్రన్‌కు సంబంధించిన ఒక కుటుంబ కార్యక్రమం సందర్భంగా స్టాలిన్ వర్చువల్‌గా ప్రసంగించారు. 2024 ఎన్నికల్లో తమిళనాడు, పుదుచ్చేరిలోని మొత్తం 40 పార్లమెంట్ స్థానాలను డీఎంకే పార్టీ గెలుచుకోవాల్సిన ఆవశ్యకతను స్టాలిన్ తన ప్రసంగంలో వివరించారు. 'మనం ఆ స్థాయిలో ఘన విజయం సాధిస్తేనే.. తదుపరి అధికారంలోకి వచ్చే కేంద్ర ప్రభుత్వంలో మనం కీలక పాత్ర పోషించగలం' అని స్టాలిన్ తెలిపారు. మొత్తం 40 స్థానాల్లోనూ డీఎంకే విజయం సాధించాలని పార్టీ కార్యకర్తలకు స్టాలిన్ పిలుపునిచ్చారు.

ప్రణాళిక వుంటే చాలు

కొన్నిసార్లు చెయ్యాలనుకునే పనుల లిస్టు పెరుగుతూ ఉంటుంది. ఆ సమయంలో టెన్షన్ వస్తుంది. ఆదరబాదరాగా పని చేయబోతే కొన్ని ఎదురు పనులు అవుతాయి కూడా. అయితే కొన్ని చిట్కాలు పాటిస్తే చాలు, పనులన్నీ చకచకా అయిపోయి టెన్షన్‌ని దూరం అవుతుంది. అవేంటో ఓ సారి చూద్దామా..!

ముందుగా చెయ్యాలనుకున్న పనుల జాబితా బుర్రలో కాకుండా ఓ పేపరుపై వరుసగా రాసుకోవాలి. అందులో ఇంటికి సంబంధించినవి ఓ వైపు, బయటకెళ్ళి చెయ్యాల్సినవి మరో వైపు, అలాగే ఇంట్లో వాళ్ళ సాయంతో చేసేవి ఇంకోవైపు చక్కగా డివైడ్ చేసి పెట్టుకోవాలి. ఇలా డివైడ్ చేసుకోవటం వల్ల చెయ్యాల్సిన పనుల పట్ల ఒక అవగాహన ఏర్పడుతుంది. దేనికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలనుకుంటున్నారో ముందుగా దాని మీద దృష్టి పెట్టాలి. ఇలా ప్రాధాన్యతకు అనుగుణంగా పనుల లిస్టులో కాస్త మార్పులు చేర్పులు చేసు కోవటం వల్ల పనులు తొందరగా అయిపోయిన ఫీలింగ్ కలుగుతుంది. పనులన్నీ ఒకే సారి తలచుకోవటం వల్ల వచ్చే అలజడి తగ్గి, పనులు చకచకా అయిపోతాయి.



– బయట చెయ్యాల్సిన పనుల లిస్టులో.. ఆ పనుల కోసం వెళ్ళాల్సిన ప్లేస్ పేరు పక్కన రాసుకోవాలి. ఎక్కువగా ఏ ప్లేస్‌కి వెళితే చాలా పనులు పూర్తి చెయ్యొచ్చో స్పష్టత వస్తుంది. దానికి తగ్గట్టుగా వెళితే లిస్టులో పనులూ తగ్గుతాయి. పనులకి ఇంట్లో వాళ్ళ సాయం కూడా తోడయితే ఇంకా త్వరగా అయిపోతాయి. అందుకే మొహమాటం కాస్త ఆప్యాయంగా అడిగి పూర్తి చేసుకుంటే మంచిది. ఇలా చేస్తే ఎన్ని పనులు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నా గందరగోళ పడకుండా పూర్తి చేసుకోవచ్చు.

ముప్పు తప్పదు



కంటి నిండా నిద్ర ఆరోగ్యానికి ఎంతో మంచిదనే సంగతి తెలిసిందే. ముఖ్యంగా రోజుకు కనీసం 8 గంటలైనా నిద్రపోవాలి. లేకపోతే అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు పదే పదే హెచ్చరిస్తున్నారు. అయితే ఈ బిజీ లైఫ్.. స్మార్ట్‌ఫోన్ యుగంలో నిద్ర క్రమేణా ఐదు నుంచి ఆరు గంటలకు తగ్గిపోతోంది. ఈ అంశంపై పరిశోధకుల అధ్యయనంలో కొన్ని కొత్త విషయాలు తెలిశాయి. అవేంటంటే...

ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న టైప్-2 డయబెటీస్ నిద్రలేమి వల్ల ఎక్కువగా గురయ్యే ప్రమాదం ఉందని అధ్యయనంలో తేలింది. కొన్ని ఆర్టికల్స్ పరిశీలించిన నిర్వహించిన రివ్యూలో మెండెలియన్ రాండమైజేషన్ (ఎంఆర్) విధానంలో 97 రకాల రిస్క్ ఫ్యాక్టర్స్‌ను తెలుసుకున్నారట.

పగటి వేళ్లలో నిద్రపోవడం, బ్రేక్‌ఫాస్ట్ తినకపోవడం, కోడి నిద్ర, యురినరీ సోడియం లెవెల్స్, అమీనో యాసిడ్స్ తదితర కారణాలు టైప్-2 డయబెటీస్‌కు దారి తీయొచ్చని విశ్లేషించారు. ఈ పరిశోధనలో భాగంగా 34 అంశాలను కనుగొన్నారు. వీటిలో 19 రిస్క్ ఫ్యాక్టర్స్, 15 ప్రొటెక్టీవ్ ఫ్యాక్టర్స్‌లను తెలుసుకున్నారు. నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నవారిలో టైప్-2 డయబెటీస్ వచ్చే అవకాశాలు 17 శాతం ఉన్నట్లు పరిశోధనల్లో తేలింది. డయబెటీస్ ముప్పు దరిచేరకూడదంటే.. కంటి నిండా నిద్ర, బరువును అదుపులో ఉంచుకోవడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. అందుకే ఇకనైనా స్మార్ట్‌ఫోన్.. టీవీలు చూస్తూ విలువైన నిద్రను చెడగొట్టుకోకుండా హాయిగా నిద్రించి ఆరోగ్యంగా ఉండండి.

సహజ శక్తిని వనరుగా మార్చి

'మహిళలు లేని రంగమంటూ లేదు. మనకంటూ ఓ గుర్తింపు రావాలంటే నిరంతరం మనల్ని మనం చెక్కుకుంటూ ఉండాలి... గెలిస్తే అందమైన శిల్పం అవుతాం... ఓడితే శిల్పాలు చెక్కే శిల్పి అవుతాం... ఏమీ ప్రయత్నించక పోతే బండరాయిగా మిగిలి పోతాం... అయితే మనం చేసే పని పర్యావరణహితంగా ఉండాలి. మనకు ఉపాధి కల్పించాలి' అంటారు రాధిక. సౌర విద్యుత్ సంస్థతో దేశవిదేశాల్లో తమ సేవలను అందిస్తున్నారు ఆమె. అమెరికాలో ఉద్యోగం వదిలి హైదరాబాద్‌లో డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఒక సాధారణ ఉద్యోగి నుంచి మహిళా పారిశ్రామికవేత్తగా ఉన్నత స్థానానికి చేరిన ఆమె విజయ గాథ నేటి మానవిలో...





చాలామంది మహిళలు పిల్లలు కాస్త పెద్దయ్యాక ఉద్యోగానికి వెళదాం అనుకుంటారు. కాని సాధ్యమైనంత వరకు పిల్లలు చిన్నగా ఉన్నపుడే తిరిగి ఉద్యోగం మొదలు పెట్టాలి అంటారు రాధిక. ఆమె సోలార్ సిస్టం ఉత్పత్తులను చేసే ఫ్రెయర్ ఎనర్జీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపనీ సహా వ్యవస్థాపకురాలు. ఇప్పుడిప్పుడే సౌర విద్యుత్ వాడకం ఊపందుకుంటుంది. కానీ ఎనిమిదేండ్ల కిందటే ఈ పరిస్థితిని ఊహించిన రాధిక సౌర విద్యుత్ సంస్థను ప్రారంభించారు. సంస్థ స్థాపించటం ఓ సవాలయితే, దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లటం మరో సవాలు. ఊహ వేరు వాస్తవికత వేరు. ఈ రెంటిని సుసాధ్యం చేయాలి. పెట్టుబడి, ప్రణాళికలు, లక్ష్యాలు ఇవన్నీ వ్యాపారానికి చాలా అవసరం. అంతే కాదు వేసే ప్రతి అడుగు ఆచి తూచి వేయాలి అంటారు ఆమె.

ఇండియా వచ్చేసి...

హైదరాబాద్‌లో పుట్టిపెరిగిన రాధికకి చిన్నతనం నుండి సైన్సు అంటే మక్కువ. తల్లి గృహిణి. తండ్రి వ్యాపారవేత్త. రాధిక చదువుతో పాటు ఆటల్లోనూ తన ప్రతిభ కనపరిచారు. బాస్కెట్ బాల్, టెన్నిస్ ఆటల్లో ఆరితేరిన రాధిక నేషనల్ స్విమ్మర్ కూడా. 'ఆడపిల్లలకు నాయకత్వ లక్షణాలు అనేవి చిన్నతనం నుంచి అలవాడాలి అవి నాకు నా క్రీడల ద్వారా, నా తల్లిదండ్రుల పెంపకం ద్వారా అలవడ్డాయి. అవే నేను ఈ రోజు ఉన్నత స్థాయిలో ఉండటానికి కారణం' అంటారు ఆమె. ఇంజినీరింగ్ పూర్తి చేసిన తర్వాత అమెరికాలో పర్డ్యూ యూనివర్సిటీలో న్యూక్లియర్ ఇంజినీరింగ్‌లో ఎం.ఎస్సీ చేసారు. చదువు పూర్తి కాగానే ప్రతిష్టాత్మకమైన నాసా ప్రాజెక్టులో పనిచేసే అవకాశం వచ్చింది. తర్వాత మరో సంస్థలో విండ్ ఎనర్జి (పవన విద్యుత్) విభాగంలో పనిచేసారు. ఆ సమయంలోనే పావన్‌ను పెండ్లి చేసుకున్నారు. మూడేండ్లు ఇద్దరూ అమెరికాలోనే ఉద్యోగం చేశారు. రాధికకు ఇద్దరు పిల్లలు. బాబు ఆయుష్మాన్, పాప సహన్యా. భర్తకు హైద్రాబాదులో మంచి ఉద్యోగ అవకాశం రావటంతో ఇండియా వచ్చేసారు. ఇక్కడ రాధిక ల్యాంకో సంస్థల్లో డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా చేరారు.



ఎన్నో అధ్యయనాల తర్వాత...

2008లో డిప్యూటీ జనరల్ మేనేజర్ స్థాయిలో మహిళలు అరుదు. అలాంటి సమయంలోనే విండ్ ప్రాజెక్ట్ మరింతగా విస్తరించటంలో రాధిక ముఖ్య పాత్ర పోషించారు. తర్వాత కాలంలో ఎన్నో అధ్యయనాలు చేసిన రాధిక ఫ్రెయర్ ఎనర్జి అనే పేరుతో అంకుర పరిశ్రమ స్థాపించారు. అమెరికాలో ఆమె ఉద్యోగానుభవం దీనికి బాగా ఉపయోగపడింది. భవిష్యత్తులో సౌర విద్యుత్‌కి పెరగనున్న ఆదరణను గుర్తించి సహజ శక్తిని వనరుగా మార్చటం సులభం అని గ్రహించారు. అది పర్యావరణహితం కాబట్టి నేనే ఒక సంస్థని ప్రారంభిస్తే బాగుంటుంది కదా అనే ఆలోచన వచ్చింది. ఆ ఆలోచనని కుటుంబంతో పంచుకున్నారు. స్నేహితులు, సౌరబ్ మర్థ భాగస్వామ్యంతో ఈ రోజు ఫ్రెయర్ ఎనర్జి అనే సంస్థతో ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు.

ప్రజలకు మరింత చేరువై...

ఎన్నో గ్రామాల్లో సౌర విద్యుత్‌తో వెలుగులు నింపుతున్నారు రాధిక. మార్కెటింగ్‌లో తమ సంస్థ ముందు ఉండటం కోసం ఓ యాప్‌ని కూడా ఏర్పాటు చేసారు. దాని పేరు సన్ ప్రో ప్లస్. ఇది ప్లే స్టోర్‌లో ఎవరైనా డౌన్ లోడ్ చేసుకుని సోలార్ ఉత్పత్తుల గురించి, వాడకం గురించి తెలుసుకోవచ్చు. అలాగే ఫ్రేయర్ ఎనర్జీ మొదటి ప్రాజెక్టుగా పాడేరులోని 40 గ్రామాలకు వెలుగునిచ్చిన రాధిక తెలంగాణా, ఆంధ్ర ప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, ఛత్తీస్ ఘడ్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, మణిపూర్ ఇలా 26 రాష్ట్రాలతో పాటు ఘానా, నైజీరియా లాంటి దేశాల్లోనూ తన సేవలు అందిస్తున్నారు. మొదట ఇద్దరితో మొదలై నేడు 120 మందికి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ఎందరికో స్ఫూర్తి దాయకంగా మారిన మహిళా పారిశ్రామికవేత్త రాధికా. రాబోయే రోజుల్లో తమ సంస్థ సేవలను ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు చేరవేయటమే తన లక్ష్యం అని చెప్తున్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

'మనకు వస్తున్న అవకాశాలను వినియోగించు కునేందుకు వీలుగా మన ఆలోచనలను మార్చు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పట్టుదల, అంకితభావం, ఎదగాలనే తపన ఇవన్నీ ముఖ్యం. ఒక మహిళగా ఉన్నత స్థానంలో పనిచేసేప్పుడు ఇబ్బందులు ఉంటాయి. 23 ఏండ్ల వయసులో డిప్యూటీ మేనేజర్ హోదాలో పనిచేసినప్పుడు నా సబార్డినేటర్స్ అంత నాకన్నా పెద్దవాళ్లు. కానీ వారితో నాకెలాంటి సమస్య రాలేదు. ఇతరులతో మనం ఎలా కనెక్ట్ అవుతాం? అజమాయిషీ చలాయించకుండా కలిసి పనిచేసే దృక్పథంతో ముందుకు వెళ్తే ఇది సాధ్యమే. పారిశ్రామికవేత్తగా, ఇద్దరు పిల్లల తల్లిగా నా బాధ్యతలను నిర్వహిస్తున్నాను. పని ఒత్తిడిని తట్టుకోవటానికి రోజూ వ్యాయమం చేస్తాను. ఇదే నాకు శక్తినిస్తుంది. మహిళ తనకోసం కూడా రోజులో ఒక 30నిముషాలు కేటాయించుకోవాలి. ప్రతి మహిళా తనలో ఉన్న శక్తి సామర్థ్యాలను వెలికి తీయాలి. అవకాశాలని అందిపుచ్చుకుని ముందడుగువేయాలి. అది ఉద్యోమైనా, వ్యాపారమైనా నిరంతరం మనల్ని మనం పరిశోధించుకుంటూ ఉండాలి. అప్పుడే మనం చేయాల్సిన పనికి సరైన ఫలితం దక్కుతుంది' అంటున్నారు రాధిక.



– రేణుక బెజవాడ

బీజేపీ, దాని మిత్రపక్షాలను ఓడించడమే సీపీఐ(ఎం) లక్ష్యం

చేశారు. బీజేపీ, దాని మిత్రపక్షాలను ఓడించగలిగే వాళ్లతో సీపీఐ(ఎం) స్నేహం కొనసాగుతుందని, పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని స్పష్టంచేశారు. ఎర్రజెండా ఆధ్వర్యంలో పేదలు భూ పోరాటాలు చేసి భూములను సాధించుకుంటే రాష్ట్ర ప్రభుత్వం పేదల భూములను లాక్కుంటున్నదని విమర్శించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత ఎర్రజెండాదేనని స్పష్టం చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పాలకుర్తి కేంద్ర బిందువు అని, విసునూర్ దేశ్‌ముఖ్ గుండాల నుంచి ఐలమ్మ పంటను ఎర్రజెండా కాపాడిందన్నారు. పేదలకు భూములు కావాలని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చేస్తే, నేటి అధికార పార్టీ పాలకులు వందల ఎకరాల భూములను కాజేస్తున్నారని విమర్శించారు. మంచుప్పుల భూ పోరాట సమస్యను పరిష్కరించాలని కోరుతూ సీఎం కేసీఆర్‌కు లేఖ రాస్తానని తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ నేటికీ ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు, రాష్ట్ర ప్రభుత్వం పేదలకిచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజా ఉద్యమాలు చేపడతామని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టును ఖండించారు. తప్పు చేసిన వారిని క్షమించరాదని, కానీ, ఎలాంటి నోటీసులు, హెచ్చరికలు జారీ చేయకుండా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో మరో భూ పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రావర్తి రాజు, ఇర్రి అహల్య, సింగారపు రమేష్, చందు నాయక్, జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల సోమన్న, మండల నాయకులు బెల్లీ సంపత్, మాసంపెల్లి నాగయ్య, అశోక్ బాబు, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఏదునూరి మదర్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ల దురాశకు బీజేపీ అండదండలు

(మొదటిపేజీ తరువాయి)

జాతుల మధ్య ఘర్షణలకు ప్రధాన కారణమని సీపీఐ పార్లమెంటరీ పార్టీ నేత, బినొయ్ విశ్వం అన్నారు. మణిపూర్ తల్లులు, సోదరీమణులతో దేశమంతా ఉన్నదని ప్రధాని మోడీ పార్లమెంటులో ప్రగల్భాలు పలికారని, కాని ఇప్పటి వరకు ఆ రాష్ట్రంలో ఒక్కసారైనా పర్యటించలేదని విమర్శించారు. బీజేపీ కుటిల, సంకుచిత రాజకీయాలకు మణిపూర్ ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారని, అక్కడ హింసకు ముగింపు ఎప్పుడో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విశాలాంధ్ర పూర్వ సంపాదకులు సి.రాఘవాచారి జయంతిని పురస్కరించుకొని రాఘవాచారి ట్రస్ట్, నీలం రాజశేఖర్ రెడ్డి పరిశోధనా కేంద్రం, సీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో శనివారం 'మణిపూర్-ఒక రాజకీయ విశ్లేషణ' అనే అంశంపై సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైన సదస్సులో బినొయ్ విశ్వం మాట్లాడుతూ మణిపూర్ ఘర్షణలు ప్రారంభమైనప్పటి నుంచి ప్రధాని మోడీ అనేక దేశాలలో పర్యటించారే తప్ప మణిపూర్ మాత్రం వెళ్ళలేదన్నారు. చివరకు పార్లమెంటులో అవిశ్వాస పరీక్షపై చర్చకు మోడీ సమాధానమిస్తూ మణిపూర్ కోసం భారతదేశం ఉన్నదని ప్రకటించారని, కనీసం ప్రచారం కోసమైన పార్లమెంటు సమావేశాల మరుసటి రోజు మణిపూర్ వెళ్ళి వస్తారని భావించామని, కాని వెళ్ళలేదన్నారు. మణిపూర్ జరుగుతున్నది కేవలం ఆర్థిక, సాంస్కృతిక, జాతుల సంఘర్షణ మాత్రమే కాదని, వీటి వెనుక కార్పొరేట్ ధన దాహం ఉన్నదని విమర్శించారు. ఆదివాసీ ప్రాంతాలైన మణిపూర్ కొండల్లో ఉన్న అపారమైన ఖనిజ సంపదపై అదానీ కన్నుపడిందన్నారు. అందుకే ఆయనకు లాభం చేకూర్చేందుకు బీజేపీ ప్రభుత్వాలు జాతుల ఘర్షణకు తెరలేపాయన్నారు. ఆ రాష్ట్రం గాయాలతో రక్తమోడతున్నదనీ, ఇవి ఎప్పుడు అంతమవుతాయో అనేది ఇప్పటికీ ప్రశ్నలాగే మిగిలిపోయిందన్నారు. ఇరు జాతులు కూడా బీజేపీపై విశ్వాసం కోల్పోయారని అన్నారు. బిజెపి ప్రభుత్వం మోసం చేసిందని, సీఎం ఘర్షణలను నిరోధించడంలో విఫలమయ్యారని ప్రజలు భావిస్తున్నట్లు తెలిపారు. గతంలో కుకీలు, మైతీలు ఘర్షణ పడినా , కొద్ది రోజులకు సమసి పోయి కలిసిపోయేవారనీ, ఇప్పుడు బీజేపీ కుటిలత్వం కారణంగా ఘర్షణలకు ఎప్పుడు ముగింపో కూడా తెలియడం లేదని విశ్వం అన్నారు. మణిపూర్ ప్రభుత్వం నడుపుతున్నది సహాయక శిబిరాలు కావని, శరణార్థుల శిబిరాలు అని, స్వంత దేశంలోనే మణిపూర్ వాసులు శరణార్థులలాగా దుర్భరంగా బతుకులీడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.దేశానికి మణిపూర్ ఒక హెచ్చరిక లాంటిదని, ప్రజలంతా ఏకమై దేశ ఐక్యతను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకతను చెబుతున్నదన్నారు.

ప్రతిపక్షాల ఐక్యతతోనే తెరపైకి 'భారత్'

బీజేపీకి విచ్ఛిన్నకర విధానాలకు వ్యతిరేకంగా 28 రాజకీయ పార్టీలు 'ఇండియా' పేరుతో కూటమిగా ఏర్పడ్డాయని, దీంతో బీజేపీ ప్రభుత్వం ఏకంగా భారతదేశ పేరును ఇండియా నుండి భారత్ మార్చాలని చూస్తున్నది బినొయ్ విశ్వం విమర్శించారు. దశాబ్దాలుగా భారతదేశాన్ని ఇండియా అని పిలుస్తున్నారని, అదే సమయంలో భారత్ అని కూడా అంటున్నారని, ఈ రెండు పేర్లలో దేనితోనైనా పిలవొచ్చన్నారు. ప్రతిపక్ష కూటమి పేరు ఇండియా ఉండడంతో పాటు సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు ఇష్టానుసారం భారత్ అని మార్చేందుకు ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు.

సురవరం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ డబుల్ ఇంజిన్ సర్కార్ ఉన్న మణిపూర్ నిత్యం ఘర్షణ మంటలు ఆరడం లేదని విమర్శించారు. మణిపూర్ నుండి, బర్మ, నేపాల్ సరిహద్దుల మధ్య కంచలు కూడా లేవన్నారు. గతంలో తాను మణిపూర్‌కు వెళ్లినప్పుడు అక్కడి పరిస్థితులను చూసి నిర్ఘాంతపోయానని తెలిపారు. కనీసం రవాణ, రహదారుల సౌకర్యం లేదని, పరిశ్రమలు కూడా లేవని వివరించారు. గతంలో అక్కడ వ్యక్తిగతంగా మాత్రమే ఘర్షణ వాతావరణం ఉండేదని, ఇప్పుడు రెండు జాతుల మధ్య ఘర్షణలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాఘవాచారి సంపాదకీయాలు అద్భుతంగా, విశ్లేషణాత్మకంగా ఉండేవని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ అధ్యక్షులు కె.శ్రీనివాస్ రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఇండియన్ డాక్టర్స్ ఫర్ పీస్ అండ్ డెవలప్‌మెంట్ (ఐడీపీడీ) ఉపాధ్యక్షులు డాక్టర్ రజనీ తదితరులు పాల్గొన్నారు. సభకు రాఘవాచారి ట్రస్టు ట్రస్టీ బుడ్డిగ జమిందార్ అధ్యక్షత వహించగా, డాక్టర్ అనుపమ ట్రస్టు కార్యకలాపాలను వివరించారు. మాజీ ఎమ్మెల్సీ పీ.జే.చంద్రశేఖర్ రావు వందన సమర్పణ చేశారు.

బ్రెజిల్‌కు జీ-20 అధ్యక్ష బాధ్యతలు

(మొదటిపేజీ తరువాయి)

స్థాయి చర్చలు కొనసాగుతాయని రష్యా విదేశాంగ మంత్రి లవ్‌రోవ్ చెప్పారు. పర్యావరణంపై ప్రజలలో అవగాహన కలిగించేందుకు సభ్య దేశాల నేతలు భారత్ మండపంలో మొక్కలు నాటారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ సహా పలువురు నేతలు రాజ్‌ఘాట్‌ను సందర్శించి జాతిపిత మహాత్మా గాంధీకి నివాళులు అర్పించారు. సదస్సు చివరి సమావేశానికి బైడెన్ హాజరు కాలేదు. ఆయన వియత్నాం బయలుదేరి వెళ్లారు. సునాక్, ఆయన సతీమణి అక్షత మూర్తి రాజధానిలోని స్వామినారాయణ్ అక్షరధామ్‌ను సందర్శించారు. జీ-20 డిక్లరేషన్‌పై ఏకాభిప్రాయం కోసం భారత దౌత్యవేత్తలు 200 గంటల పాటు నిర్విరామంగా సభ్య దేశాలతో చర్చలు జరిపారు. ఉక్రెయిన్‌పై పదిహేను ముసాయిదాలను రూపొందించి, చివరికి ఏకాభిప్రాయానికి వచ్చారు.

17న కాంగ్రెస్‌లోకి మైనంపల్లి

(మొదటిపేజీ తరువాయి)

విషయాలను పరిగణలోకి తీసుకున్న బీఆర్‌ఎస్ అధిష్టానం, 'మర్రి'నే మల్కాజిగిరి బరిలో నిలిపేందుకు సిద్ధమైనట్టు సమాచారం. వారం రోజుల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి మనసు మార్చుకుని పార్టీలో ఉండి మల్కాజిగిరి బరిలో నిలుస్తారా..? లేక పార్టీ మారుతారా..? అనే విషయంపై క్లారిటీ వచ్చిన వెంటనే రాజశేఖర్‌రెడ్డి పేరు ప్రకటించే ఛాన్స్ ఉంది. రాజశేఖర్‌రెడ్డి 2019లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. అదే సమయంలో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకర్గం నుంచి బీఆర్‌ఎస్ తరుపున ఎంపీగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు విధేయుడిగా ఉంటూ వస్తున్నారు. కరోనా ముందు ఎమ్మెల్సీ పదవి వస్తుందని ప్రచారం జరిగినా అవకాశం దక్కలేదు. అనూహ్యంగా ఇప్పుడు మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి వ్యవహారంతో రాజశేఖర్‌రెడ్డి పేరు మళ్లీ తెరపైకి వచ్చింది.

రేసులో మరికొందరు..

బీఆర్‌ఎస్ మల్కాజిగిరి అసెంబ్లీ సీటు కోసం పోటీ బాగానే ఉంది. మర్రి రాజశేఖర్‌రెడ్డితోపాటు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, అల్వాల్ కార్పొరేటర్ విజయశాంతి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. వీరందరూ మల్కాజిగిరి సీటు కోసం అధిష్టానం వద్ద అర్జీలు పెట్టినట్టు సమాచారం. మైనంపల్లి వ్యవహారం తేలకముందే తమకే సీటు కేటాయించాలని ఒత్తిడి చేస్తుండటంతో ఒకరిద్దరు నాయకులను మంత్రి కేటీఆర్ ఇటీవల సున్నితంగా హెచ్చరించినట్టు తెలుస్తోంది. అన్ని విధాలుగా ఆలోచించిన బీఆర్‌ఎస్ అధిష్టానం మర్రి రాజశేఖర్‌రెడ్డి పేరు ఖరారు చేసినట్టు సమాచారం. ఇప్పటికే రాజశేఖర్‌రెడ్డి, మంత్రి మల్లారెడ్డి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ను కలిసి చర్చించారు.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం అజరామరం...

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట ఘట్టాలను తెలియజేసే ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. మొత్తం 100కు పైగా ఫొటోలను, పోరాట ఘట్టాలను కండ్లకు కట్టినట్టుగా వీక్షకులను ఆకర్షించే విధంగా ఏర్పాటు చేశారు. రజాకార్ల అకృత్యాలు, సర్దార్ వల్లభాయి పటేల్ సైన్యాల దారుణాలు, వీరుల పోరాట పటిమను ఆ చిత్రాలు సాక్షాత్కరింపచేశాచాయి. కుల, మతాలకు అతీతంగా భూమి, భుక్తి, విముక్తి పోరాటంలో అసువులు బాసిన వీరనారి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య బందగి, మఖ్దూం మోహినుద్దీన్, షోయబుల్లాఖాన్, బీమిరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, దేవులపల్లి వెంకటేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య, రావి నారాయణ రెడ్డి లాంటి యోధులు..రాచరికంపై మట్టి మనుషులతో తుపాకులు పట్టించిన తీరు ఆ చిత్రాలద్వారా విధితమవుతున్నది. ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన విద్యాసాగర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతటి మహత్తర పోరాటానికి సంబంధమే లేని మతతత్వ శక్తులు దానికి మతం రంగు పులమాలని ప్రయత్నించటం శోచనీయమన్నారు. చరిత్రను వక్రీకరించే వారు నిజాలంటే భయపడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నర్సింహారావు, సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, నగర కార్యదర్శి ఎం శ్రీనివాస్, సీనియర్ నాయకులు జి రఘుపాల్, ఎం దశరథ్, మారన్న తదితరులు పాల్గొన్నారు.


చరిత్రకు మసిపూయలేరు

(మొదటిపేజీ తరువాయి)

భాగమేనని వివరించారు. బీజేపీ దాని అనుబంధ సంఘాలు, ఆపార్టీ ప్రజా ప్రతినిధులు ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టి, విభజన రాజకీయాలు చేస్తున్నారనీ, కానీ ఢిల్లీలో జరుగుతున్న జీ-20 అంతర్జాతీయ సదస్సులో 'విద్వేషాలు వద్దు' అనే తీర్మానాన్ని ప్రధాని నరేంద్రమోడీ ప్రవేశపెట్టి, ఆమోదించుకున్నారని ఎద్దేవా చేశారు. చెప్పే మాటకు, చేసే పనికి సంబంధమే ఉండదని అన్నారు. బ్రిటీషర్లకు సలాం కొట్టిన ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్‌పరివార్ శక్తులు ఇప్పుడు తెలంగాణ విమోచన దినం జరుపుతామని బయల్దేరాయన్నారు. సీపీఐ(ఎం) హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రం పార్కు వద్ద 'తెలంగాణ సాయుధ పోరాట (2946-51) వార్షికోత్సవాలు నిర్వహించారు. దీనికి బృందాకరత్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టులు ఆనాడు బ్రిటీషర్లు, నిజాం, దేశ్‌ముఖ్‌లకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చేశారనీ, దాని ఫలితంగానే హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం అయ్యిందని వివరించారు. అనేక త్యాగాలతో కులమతాలకు అతీతంగా ఐక్యంగా జరిగిన పోరాట చరిత్రను మత ఘర్షణలుగా చిత్రీకరిస్తూ ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ దాని అనుబంధ సంస్థలు ప్రచారం చేస్తున్నాయనీ, అలాంటి చర్యల్ని సహించబోమని హెచ్చరించారు. ప్రజాపోరాటం ఉధృతంగా ఉన్న సమయంలో హైదరాబాద్‌లో ఆర్య సమాజ్ పేరుతో, జమ్మూ కాశ్మీర్‌లో ప్రజా పరిషత్ పేరుతో రాజులు, రాచరికాలకు అనుకూలంగా ప్రజల్లో విభజన తెచ్చే చర్యలకు పాల్పడ్డారని తెలిపారు. కానీ భూమి మాది...దేశం మాది అనే కమ్యూనిస్టుల నినాదానికి తలవంచక తప్పలేదన్నారు. మణిపూర్‌లోని 'డబుల్ ఇంజిన్ సర్కార్' గ్రామాల్లో ఉద్రిక్తతలు సృష్టించి, అమాయక గిరిజనుల్ని ఊచకోత కోస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడి మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారనీ, కండ్ల ముందే తండ్రిని, సోదరుడిని చంపి, నగ్నంగా ఊరేగిస్తూ, సమూహిక అత్యాచారాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ అల్లర్లకు డబుల్ ఇంజిన్ సర్కారే కారణమనీ, అల్లర్ల నియంత్రణలో చేతులెత్తేసి, చోద్యం చూస్తున్నారని విమర్శించారు. మరోవైపు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థను అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నదనీ, రాత్రికి రాత్రే వాళ్లు లక్షల కోట్లకు అధిపతులు అవుతున్నారని అన్నారు. గ్రామీణంలోని పేదలు మాత్రం సరైన ఉపాధి లేక పనికి ఆహారం పథకం (నరేగా) ద్వారా రోజువారీ ఆదాయంతో బతుకులు ఈడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణలో



కేంద్రం ఘోరంగా విఫలమైందని చెప్పారు. కమ్యూనిస్టు యోధులు పుచ్చలపల్లి సుందరయ్య, మల్లు స్వరాజ్యం వంటి నేతల ఆదర్శాలు, స్ఫూర్తితో... మతోన్మాద శక్తులు, ప్రజాకంటక ప్రభుత్వాల బుల్డోజర్ రాజకీయాలను అడ్డుకుంటామనీ, ఎర్రజెండా ఎప్పుడూ పేదల పక్షానే నిలుస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం ప్రభుత్వాలతో కొట్లాడుతున్నామనీ, అంతిమ విజయం సాధించేదాకా విశ్రమించేది లేదని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య మాట్లాడుతూ తెలంగాణ విమోచన దినంలో పాల్గొనేందుకు అమిత్‌షా, రాహుల్‌గాంధీలకు ఉన్న అర్హత ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలకు ద్రోహం చేసిన వారే సెప్టెంబర్ 17న హైదరాబాద్ వచ్చి వేడుకలు నిర్వహిస్తామని చెప్తున్నారనీ, ఇంతకంటే సిగ్గుచేటు ఇంకేముందని ప్రశ్నించారు. ఆ పోరాటం కమ్యూనిస్టుల సొత్తు, హక్కు అని నినదించారు. పుచ్చలపల్లి సుందరయ్య నేతృత్వంలో జరిగిన ప్రజా సాయుధపోరాటం వల్లే భారతదేశంలో హైదరాబాద్ స్టేట్ విలీనం సాధ్యమైందని తెలిపారు. దొడ్డి కొమురయ్య, బందగీ, షోయబుల్లాఖాన్, మగ్దూం మొహియుద్దీన్ వంటి సాయుధ పోరాట యోధులు ప్రజల కోసం బలిదానాలు చేశారని గుర్తుచేశారు. ఆనాడు సర్దార్ పటేల్, నెహ్రూ ప్రజల్ని పీడించిన నిజాంను జైల్లో పెట్టకుండా, రాజ్‌ప్రముఖ్ పేరుతో సత్కరించి, ప్రజా పోరాటాన్ని అవమానపరిచారని అన్నారు. పటేల్ నేతృత్వంలో హైదరాబాద్ వచ్చిన సైన్యాన్ని ఇక్కడి కమ్యూనిస్టు ప్రజలపైకి ఉసిగొల్పి, దారుణ మారణకాండకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి చరిత్ర ఉన్న నేతలు ఇప్పుడు విలీన దినోత్సవాలంటూ నాటకాలాడుతున్నారని అన్నారు. సాయుధ పోరాటం కమ్యూనిస్టుల వారసత్వమనీ, భారతదేశానికి భవిష్యత్ దిశానిర్దేశం వారితోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమానికి సీపీఐ(ఎం) హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎమ్ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నర్సింహారావు, టీ జ్యోతి, సీనియర్ నాయకులు ఎస్ మల్లారెడ్డి, రఘుపాల్, పీఎస్ఎన్ మూర్తి, నంద్యాల నర్సింహారెడ్డి, సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు నాగలక్ష్మి, ఎమ్ మహేందర్,ఎం.దశరథ, కేఎన్ రాజు, శ్రీనివాస్, వెంకటేష్,మారన్న తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు వీరనారి చిట్యాల ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని ఐలమ్మ ఆర్ట్ గ్యాలరీలో సాయుధ పోరాట చరిత్రను తెలుపుతూ ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. బహిరంగ సభ అనంతరం సుందరయ్య పార్కు నుంచి చిక్కడపల్లి మీదుగా ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ వరకు ఎర్రజెండాలు, ప్లకార్డులు పట్టుకొని భారీ ర్యాలీ నిర్వహించారు.


ప్రభాస్

భక్త కన్నప్పలో ప్రభాస్

మంచు విష్ణు నటిస్తూ నిర్మిస్తున్న చిత్రం 'భక్త కన్నప్ప'. ఈ సినిమాపై స్పెషల్ కేర్ తీసుకుంటున్న ఆయన.. ఇందులో బిగ్ స్టార్స్‌ని ఎంపిక చేసుకుంటున్నారు. ఈ ఏడాది రెగ్యులర్ షూట్ ప్రారంభం కాబోతున్న ఈ సినిమా కోసం ఇప్పటికే ఆయన అన్ని పనులు మొదలు పెట్టారు. ఇందులో భాగంగా తన మిత్రుడు, టాలీవుడ్ టాప్ హీరోల్లో ఒకరైన ప్రభాస్‌ని భాగం చేస్తున్నారు. ఈ విషయాన్ని విష్ణు స్వయంగా అధికారికంగా వెల్లడిస్తూ ట్వీట్ చేశారు.
గతంలో విష్ణు నటించిన 'దేనికైనా రెడీ' చిత్రం కోసం వాయిస్ ఓవర్ ఇచ్చిన ప్రభాస్, ఇప్పుడు ఈ సినిమాలో ఒక కీలకమైన పాత్రలో నటించేందుకు అంగీకారం తెలిపారు. ఈ సరికొత్త అప్‌డేట్‌తో ఈ ప్రాజెక్ట్ పై ఒక్కసారిగా హైప్ నెలకొంది. అవా ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్‌లపై విష్ణు మంచు ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, 'మహాభారత్' సిరీస్ ఫేమ్ ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించనున్నారు. పరుచూరి గోపాలకృష్ణ, బుర్రా సాయి మాధవ్, తోట ప్రసాద్ ఈ చిత్రానికి రచయితలు.

నవచిత్రం

సిత్తరాల సిత్రావతి సందడి షురూ..


పంజా వైష్ణవ్ తేజ్, శ్రీలీల

పంజా వైష్ణవ్ తేజ్ లేటెస్ట్‌గా నటిస్తున్న యాక్షన్ చిత్రం 'ఆదికేశవ'. శ్రీలీల కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంతో అపర్ణా దాస్, జోజు జార్జ్ తెలుగు చిత్రసీమలోకి అడుగుపెడుతున్నారు.
సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది.
నవంబర్ 10న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంతో శ్రీకాంత్ ఎన్ రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుండి 'సిత్తరాల సిత్రావతి' అంటూ సాగే మొదటి పాటను తాజాగా చిత్ర బృందం విడుదల చేసింది.
నాయకానాయికల మధ్య సాగే ఈ మెలోడీ పాటను గేయ రచయిత సరస్వతి పుత్ర రామజోగయ్య శాస్త్రి అందమైన పదాల అమరికతో పాటకు ప్రాణం పోశారు. రాహుల్ సిప్లిగంజ్ ఈ పాటకి తన గాత్రంతో విభిన్నమైన జానపద రుచిని అందించారు. గాయని రమ్య బెహరా పాటలోని అనుభూతిని తన స్వరంలో చక్కగా పలికించారు.
'ఈ పాట వైరల్ అవుతుందని, పార్టీలలో మారుమ్రోగి పోవడం ఖాయమని అప్పుడే శ్రోతల నుంచి ప్రశంసలు కురుస్తున్నాయి. థియేటర్లలో ప్రేక్షకులకు మంచి యాక్షన్ ఎంటర్‌టైనర్‌ని అందించడానికి ఆదికేశవ టీమ్ కసరత్తు చేస్తోంది. ఈ చిత్రం పట్ల ఎంతో సంతృప్తిగా ఉన్న నిర్మాతలు, ఈ దీపావళికి బాక్సాఫీస్ దగ్గర విజయ ఢంకా మోగిస్తామని నమ్మకం వ్యక్తం చేస్తున్నారు' అని చిత్ర బృందం తెలిపింది. నవీన్ నూలి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి డడ్లీ, ఆర్థర్ ఎ.విల్సన్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు.

శ్రీనువైట్ల దర్శకత్వంలో నయా సినిమా


గోపీచంద్

గోపీచంద్ హీరోగా శ్రీనువైట్ల దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనుంది. ఈ చిత్రాన్ని చిత్రాలయం స్టూడియోస్ పతాకంపై ప్రొడక్షన్ నెం.1గా నిర్మాత వేణు దోనేపూడి నిర్మిస్తున్నారు. సూపర్‌స్టార్ కృష్ణ ఆశీస్సులతో కొత్త ప్రొడక్షన్ బ్యానర్ చిత్రాలయం స్టూడియోస్ ప్రారంభమైంది. ఈ ప్రొడక్షన్ హౌస్ నుండి వస్తున్న మొదటి సినిమా ఇది. సినిమాలోని చాలా భాగం విదేశాల్లోని కొన్ని అద్భుతమైన లొకేషన్లలో చిత్రీకరించనున్నారు.
భారీ బడ్జెట్‌తో లావిష్‌గా రూపొందనున్న ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో గ్రాండ్‌గా లాంచ్ అయింది. ముహూర్తం షాట్‌కు మైత్రి నవీన్ కెమెరా స్విచాన్ చేయగా, దర్శకేంద్రుడు కె. రాఘవేంద్రరావు క్లాప్ కొట్టారు. శ్రీను వైట్ల స్వయంగా తొలి షాట్‌కి దర్శకత్వం వహించారు. రమేష్ ప్రసాద్, ఆదిశేషగిరిరావు, సురేష్ బాబుతోపాటు పలువురు సినీ ప్రముఖులు ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభం కానుంది. గోపీచంద్ హీరోగా నటిస్తున్న 32వ చిత్రమిది. ఇంతకు ముందు చేయని పూర్తి భిన్నమైన పాత్రలో గోపీచంద్‌ని చూపించడానికి ఒక హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను దర్శకుడు శ్రీనువైట్ల రూపొందించనున్నారు. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: శ్రీను వైట్ల, స్క్రీన్ ప్లే: గోపీ మోహన్, సినిమాటోగ్రఫీ: కేవీ గుహన్, సంగీతం: చైతన్ భరద్వాజ్.

చలం నవల సుశీల ఆధారంగా సిగ్గు



జాతీయ అవార్డు గ్రహీత నరసింహనంది దర్శకత్వంలో భీమవరం టాకీస్ పతాకంపై రూపొందనున్న 116వ చిత్రం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి జేడీ లక్ష్మీనారాయణ క్లాప్ ఇవ్వగా, రచయిత, దర్శకుడు కె.విజయేంద్ర ప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు వి.వి.వినాయక్ గౌరవ దర్శకత్వం వహించగా, నిర్మాతలు సి.కళ్యాణ్, దామోదర ప్రసాద్ స్క్రిప్ట్‌ను దర్శక, నిర్మాతలకు అందించారు.
ఈ సందర్భంగా నిర్మాత రామ సత్యనారాయణ మాట్లాడుతూ, 'పరిశ్రమకి వచ్చి 20 ఏండ్లు పూర్తయ్యాయి. మొదటి నుంచి నన్ను అభిమానించి అక్కున చేర్చుకున్న వ్యక్తి సి.కళ్యాణ్. ఆయన సపోర్ట్‌తో ముందుకెళ్తున్నాను. ఓ మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాం' అని అన్నారు. 'సామాజిక స్పృహ కలిగిన సినిమాలు తీయాలని, సమాజాన్ని పాడు చేసే సినిమాలు తీయకూడదు అని నేను క్లాప్ కొట్టాను. కాబట్టి మంచి సినిమా తీయించే బాధ్యత ఈ బృందంపై ఉంది' అని జేడీ లక్ష్మీనారాయణ చెప్పారు. దర్శకుడు నరసింహ నంది మాట్లాడుతూ, 'చలం నవల సుశీల ఆధారంగా ఈ సినిమా చేస్తున్నా. నటీనటుల ఎంపిక పూర్తయిన తర్వాత ఇతర వివరాలు వెల్లడిస్తాం' అని తెలిపారు. ప్రసన్నకుమార్, వంశీ రామరాజు, రేలంగి నరసింహరావు, ధర్మారావు, సతీష్ వర్మ, గుడా రామకృష్ణ తదితరులు ఈ చిత్ర ప్రారంభోత్సవంలో పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

ద్రోహి రిలీజ్‌కి రెడీ


విజయ్ పెందుర్తి, క్రిష్

సందీప్ కుమార్ బొడ్డపాటి, దీప్తి వర్మ జంటగా గుడ్ ఫెల్లోస్ మీడియా ప్రొడక్షన్స్, సఫైరస్ మీడియా, వెడ్‌నెస్‌డే ఎంటర్టైన్మెంట్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'ద్రోహి'. ది క్రిమినల్ అనేది ఉపశీర్షిక. క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రానికి విజయ్ పెందుర్తి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకాంత్ రెడ్డి, విజయ్ పెందుర్తి, రాజ శేఖర్ అర్ నిర్మాతలు.
ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను దర్శకుడు క్రిష్ జాగర్లమూడి విడుదల చేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'సినిమాకు సంబంధించిన లుక్, గ్లింప్స్ చూశాను. చాలా ప్రామిసింగ్‌గా ఉంది. ఈ సినిమా మంచి విజయాన్ని సాధించాలని ఆశిస్తున్నాను' అని చెప్పారు.
'చక్కని థ్రిల్లర్ కథాంశంతో రూపొందుతున్న చిత్రమిది. ప్రేక్షకులు మెచ్చే అన్ని అంశాలు ఇందులో ఉంటాయి. ఇదే నెలలో సినిమాను విడుదల చేస్తాం' అని దర్శక, నిర్మాతలు అన్నారు.


ఆనంద్ దేవరకొండ

గం..గం..గణేశా

ఆనంద్ దేవరకొండ హీరోగా నటిస్తున్న కొత్త చిత్రం 'గం..గం..గణేశా'. హై-లైఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఉదయ్‌శెట్టి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను హీరో ఆనంద్ దేవరకొండ తన సోషల్ మీడియా అక్కౌంట్స్ ద్వారా రిలీజ్ చేశారు. ఈ చిత్ర పోస్టర్‌ని ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తూ రన్-ఫన్-గన్ అంటూ అగ్ర నాయిక సమంత చిత్ర బృందానికి బెస్ట్ విషెస్ తెలిపారు. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. త్వరలోనే సినిమా రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేస్తామని మేకర్స్ ప్రకటించారు.

వినాయక చవితి కానుకగా రిలీజ్


కమల్ కామరాజు

నూతన దర్శకుడు రఘుపతి రెడ్డి గుండ రచన, దర్శకత్వంలో కమల్ కామరాజు, అపర్ణాదేవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'సోదర సోదరీమణులారా...'. 9 ఈఎమ్ ఎంటర్టైన్మెంట్స్, ఐఆర్ మూవీస్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి విజయ్ కుమార్ పైండ్ల నిర్మాత.
హార్ట్ టచింగ్ ఫ్యామిలీ డ్రామాగా ప్రేక్షకులను అలరించనున్న ఈ చిత్రం విడుదలకు సిద్ధమైన నేపథ్యంలో ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఆసక్తికరంగా కట్ చేసిన ఈ ట్రైలర్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటి పెంచుతోంది. టైటిల్, పోస్టర్‌తోనే అందరూ అన్వయించుకొనే పాత్రలతో రియాలిస్టిక్ డ్రామాగా ఈ సినిమా ఉండనుంది అనే ఫీలింగ్ కలిగింది. ఈ చిత్రాన్ని వినాయక చవితి సందర్భంగా 500 థియేటర్లలో ఈనెల 15న విడుదల చేయనున్నారు అని చిత్ర బృందం తెలిపింది.

గ్రేటర్‌పై కాంగ్రెస్ ఫోకస్!

- 24 అసెంబ్లీ సెగ్మెంట్‌లలో గెలుపే లక్ష్యం
- బీఆర్ఎస్, ఎంఐఎంను ఏకకాలంలో ఎదుర్కొనేలా వ్యూహరచన
- సికింద్రాబాద్ బరిలో వైఎస్ షర్మిలను దింపే యోచనలో అధిష్టానం?



నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లో కాంగ్రెస్ పూర్వవైభవం దిశగా పావులు కదుపుతోంది. వైఎస్ షర్మిలను నగరంలోని ఏదో ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేయించి.. తద్వారా గ్రేటర్‌లో పార్టీ బలోపేతంతో పాటు రానున్న ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకునేలా వ్యూహ రచన చేస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మొత్తం 29 శాసనసభ నియోజకవర్గాలున్నాయి. ఇందులో హైదరాబాద్‌లోనే 15 అసెంబ్లీ స్థానాలుండగా.. మేడ్చల్‌లో 5, రంగారెడ్డిలోని తొమ్మిదింటిలో రాజేంద్రనగర్, ఎల్బీనగర్, శేరిలింగంపల్లి, మహేశ్వరం స్థానాలున్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో 2004, 2009లో కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగింది.. 2014లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ బలహీనపడింది. అయితే నాయకులు వెళ్లిపోతున్నా.. క్యాడర్ మాత్రం పార్టీని అట్టిపెట్టుకొనే ఉన్నారు. వారే ఇప్పుడు ఆ పార్టీకి బలం, బలగంగా మారారు. అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర, కర్నాటకలో పార్టీ గెలుపుతో మళ్లీ తెలంగాణతో పాటు గ్రేటర్‌లో కాంగ్రెస్‌కు పునర్ వైభవం దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పుంజుకుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. నాంపల్లి, ముషీరాబాద్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, ఎల్బీనగర్, మహేశ్వరం నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌కు దీటుగా కాంగ్రెస్‌కు బలమైన అభ్యర్థులున్నారు. అదే సమయంలో గోషామహల్, అంబర్‌పేట్, రాజేంద్రనగర్, ఉప్పల్, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లో పార్టీ పటిష్టంగా ఉన్నా.. టికెట్ కోసం ఇద్దరు ముగ్గురు పోటీ పడుతున్నారు. ఇక ఎంఐఎం బలంగా ఉన్న ఏడు నియోజకవర్గాల్లోనే బలమైన అభ్యర్థులు కరువయ్యారు. ప్రతి ఎన్నికల్లో ఎంఐఎం అభ్యర్థుల గెలుపులో కీలకంగా ఉన్న మైనార్టీల ఓట్లు ఈసారి కాంగ్రెస్ వైపునకు మళ్లే అవకాశమున్నా.. వారిని ఆకర్షించడానికి గట్టి నాయకత్వం లేదు. ఈ మధ్యకాలంలో ఆ పార్టీ ప్రకటిస్తున్న డిక్లరేషన్స్ ప్రజల్లోకి తీసుకుపోయి పార్టీని విజయతీరాలకు చేర్చే నాయకుల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. దీన్నుంచి బయటపడేందుకు కాంగ్రెస్ అధిష్టానం వైఎస్ షర్మిల వైపు చూస్తోంది. వైఎస్సార్‌టీపీని కాంగ్రెస్‌లో విలీనం చేసుకుని.. ఆమెకు గ్రేటర్ ఎన్నికలు బాధ్యతలు అప్పగించే అవకాశముందని తెలుస్తోంది. అదేవిధంగా షర్మిలను సికింద్రాబాద్ నుంచి పోటీ చేయించడంతో పాటు పార్టీ అభ్యర్థులను గెలిపించే బరువు బాధ్యత కూడా ఆమెపై పెట్టనున్నారు.

అన్ని కలిసొస్తే.. ఆమె గెలుపు ఖాయం!

వైస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో (2009 ఎన్నికల్లో) సికింద్రాబాద్ అసెంబ్లీ స్థానం నుంచి సినీనటి జయసుధ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఇక్కడ ఇప్పటికీ వైఎస్ అభిమానులు, కార్యకర్తలతో పాటు ఓ గ్రూపు ఓట్లు కీలకంగా ఉన్నాయి. ఇక్కడి నుంచి వైఎస్ షర్మిలను బరిలోకి దింపితే సునాయాసంగా గెలిచే అవకాశం ఉందని ఆ పార్టీ ముఖ్య నేతలు చెబుతున్నారు. అంతేగాక ఆమె సేవలను పాతబస్తీతో పాటు ఇతర అసెంబ్లీ స్థానాల్లోని అభ్యర్థుల గెలుపు కోసం ఉపయోగించుకోవచ్చని అంటున్నారు. కాంగ్రెస్ హైకమాండ్ కూడా అదే ఆలోచనలో ఉన్నట్టు పార్టీ నాయకులు ద్వారా తెలుస్తోంది.

క్వీన్ కొకో గాఫ్



- మహిళల సింగిల్స్ చాంపియన్ గాఫ్
- ఫైనల్లో 19 ఏండ్ల టీనేజర్ సంచలనం

యు.ఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

యుఎస్ ఓపెన్‌కు సరికొత్త రాణి. మహిళల సింగిల్స్ కిరీటం 19 ఏండ్ల కొకో గాఫ్ దక్కించుకుంది. కెరీర్ తొలి గ్రాండ్‌స్లామ్ సాధించిన కొకో గాఫ్.. సెరెనా విలియమ్స్ తర్వాత పిన్న వయసులోనే న్యూయార్క్‌లో చాంపియన్‌గా నిలిచిన రెండో అమెరికన్‌గా చరిత్ర సృష్టించింది. మహిళల సింగిల్స్ టైటిల్ పోరులో రెండో సీడ్ సబలెంకపై మూడు సెట్ల పోరులో గెలుపొందిన గాఫ్.. న్యూయార్క్ న్యూ క్వీన్‌గా అవతరించింది.

నవతెలంగాణ- న్యూయార్క్

యుఎస్ ఓపెన్‌లో యువరాణికి పట్టాభిషేకం జరిగింది. 19 ఏండ్ల అమెరికా యువ సంచలనం, మహిళల సింగిల్స్ సర్క్యూట్ నయా స్టార్ కొకో గాఫ్ యుఎస్ ఓపెన్ చాంపియన్‌గా అవతరించింది. టైటిల్ పోరులో రెండో సీడ్, వచ్చే వారం వరల్డ్ నం.1 ర్యాంక్ అందుకోనున్న బెలారస్ భామ సబలెంకపై మూడు సెట్ల మహా పోరులో కొకో గాఫ్ ఘన విజయం సాధించింది. రెండు గంటలకు పైగా సాగిన టైటిల్ ఫైట్‌లో 2-6, 6-3, 6-2తో కొకో గాఫ్ పైచేయి సాధించింది. 1999లో సెరెనా విలియమ్స్ 17 ఏండ్ల ప్రాయంలోనే యుఎస్ ఓపెన్ విజేతగా అవతరించి నయా చరిత్ర సృష్టించగా.. తాజాగా ఆమె సరసన కొకో గాఫ్ నిలిచింది. సెరెనా విలియమ్స్‌తో పాటు ట్రాసీ ఆస్టిన్, స్టెఫానీ గ్రాఫ్, మోనిక సీల్స్, మార్టినా హింగిస్, స్విట్లోనా కుజనోత్సవ, మరియ షరపోవ, బియాంక అండ్రుస్కూ, ఎమ్మా రెడాకానులు న్యూయార్క్‌లో టైటిల్ సాధించిన అండర్-20 క్వీన్స్ కావటం గమనార్హం.

గాఫ్ గర్జన

మహిళల సింగిల్స్ ఫైనల్. ప్రత్యర్థి రెండో సీడ్, త్వరలో వరల్డ్ నం.1 కానున్న సబలెంక. సమీకరణాలు సబలెంకకు అనుకూలం. అందుకు తగినట్టుగానే తొలి సెట్‌లో కొకో గాఫ్ పరాజయం పాలైంది. తొలి సెట్‌లో మూడు సార్లు గాఫ్ సర్వ్‌ను బ్రేక్ చేసిన సబలెంక.. అలవోకగా 6-2తో తొలి సెట్‌ను సొంతం చేసుకుంది. దీంతో, సబలెంక గెలుపు లాంఛనమే అనిపించింది. కానీ రెండో సెట్‌లో కొకో గాఫ్ తన గేమ్ బయటపెట్టింది. వరల్డ్ క్లాస్ డిఫెన్స్‌తో చెలరేగిన గాఫ్.. రెండో సీడ్ సబలెంకను ఇరకాటంలో పడేసింది. గాఫ్ డిఫెన్స్‌తో వ్యూహం మార్చిన సబలెంక.. ఎక్కువగా గ్రౌండ్ షాట్లు, ఓవర్‌హెడ్ స్మాష్‌లపై దృష్టి నిలిపింది. ఆరంభంలోనే రెండు సార్లు సబలెంక సర్వ్‌ను బ్రేక్ చేసిన గాఫ్ 3-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అదే జోరులో 6-3తో రెండో సెట్‌ను సొంతం చేసుకుంది. టైటిల్ పోరును నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లింది. డిసైడర్‌లో సమవుజ్జీలుగా నిలిచిన తరుణంలో.. 11 గేముల్లో ఏకంగా తొమ్మిది నెగ్గిన గాఫ్ 4-0తో తిరుగులేని ఆధిక్యం దక్కించుకుంది. గాఫ్ జోరుకు అడ్డుకట్ట వేయటంలో సబలెంక తేలిపోయింది. దీంతో 6-2తో మూడోసెట్‌ను కొకో గాఫ్ సొంతం చేసుకుంది. 19 ఏండ్ల వయసులోనే యుఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ చాంపియన్‌గా నిలిచింది.

సబలెంకతో టైటిల్ ఫైట్‌లో కొకో గాఫ్ అన్నింటా ఆధిపత్యం చెలాయించింది. సబలెంక నాలుగు ఏస్‌లు సంధించినా.. గాఫ్ రెండు ఏస్‌లతోనే టైటిల్ ఎగరేసుకుపోయింది. గాఫ్ ఐదు డబుల్ ఫాల్ట్స్‌కు పాల్పడగా.. సబలెంక ఆరు డబుల్ ఫాల్ట్స్ చేసింది. గాఫ్ ఐదు బ్రేక్ పాయింట్లు సాధించగా.. సబలెంక నాలుగు బ్రేక్ పాయింట్లే నెగ్గింది. పాయింట్ల పరంగా 83-74 తో గాఫ్ ముందంజ వేయగా.. గేముల పరంగా 14-11తో గాఫ్ దుమ్మురేపింది. ఇక సబ లెంక 25 విన్నర్లు కొట్టగా.. గాఫ్ 13 విన్నర్లే కొట్టింది. గాఫ్ 19 అనవసర తప్పిదాలు చేయగా.. సబలెంక 46 అనవసర తప్పిదాలతో భారీ మూల్యం చెల్లించుకుంది.

కాంగ్రెస్‌తోనే కొడంగల్ అభివృద్ధి

- నియోజకవర్గానికి బీఆర్ఎస్ చేసిందేంటి?
- ఎందుకు రెవెన్యూ డివిజన్ చేయలేదు
- విజయభేరి సభకు భారీగా తరలిరండి : టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి
- కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేతలు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్న బీఆర్ఎస్ నేతలు ఐదేండ్లలో ఏం చేశారని ప్రశ్నించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కొడంగల్ నియోజకవర్గం బొమ్రాస్‌పేట్, దౌల్తాబాద్ మండలాలకు చెందిన పలువురు బీజేపీ, బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరారు. కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ కొడంగల్‌ను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని చెప్పిన మంత్రి కేటీఆర్... నియోజకవర్గ ప్రజలను మోసం చేశారని విమర్శించారు. తన హయాంలో తీసుకొచ్చిన ఏ ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. నారాయణపేట్-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పడావు పెట్టారనీ, బొమ్రాస్‌పేట్, దౌల్తాబాద్ మండలాల్లో జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. వికారాబాద్-తాండూర్ రైల్వే లైన్‌కు ఇప్పటికీ మోక్షం లభించలేదని ఎద్దేవా చేశారు. కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి మాట అటుంచితే నియోజకవర్గాన్ని రెండు ముక్కలు చేసి రెండు జిల్లాల్లో కలిపారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న, చిన్న ప్రాంతాలను రెవెన్యూ డివిజన్లుగా మార్చిన ప్రభుత్వం...కొడంగల్‌ను ఎందుకు రెవెన్యూ డివిజన్ చేయలేదని ప్రశ్నించారు. ఓట్ల కోసం వచ్చే బీఆర్ఎస్ నేతలను కొడంగల్‌కు ఏం చేశారో నిలదీయాలన్నారు. సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్ నియోజకవర్గాకే ఎక్కువ నిధులు కేటాయించి అభివృద్ధి చేసుకుంటున్నారని చెప్పారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు కేవలం ఆ మూడు నియోజకవర్గాలకే సీఎం, మంత్రులుగా పనిచేస్తున్నారని విమర్శించారు. కొడంగల్ రాష్ట్రంలో భాగం కాదా? అని ప్రశ్నించారు. కొడంగల్‌గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేయాలనీ, అప్పుడే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించే గౌరవం కొడంగల్‌కు దక్కిందని చెప్పారు. ఈనెల 17న సోనియాగాంధీ తుక్కుగూడ రాజీవ్‌గాంధీ ప్రాంగణంలో జరిగే విజయభేరిలో ఐదు గ్యారంటీలను ప్రకటించనున్నదని తెలిపారు. విజయభేరి సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని రేవంత్ పిలుపునిచ్చారు.

ఓపెనర్ల మెరుపుల్

- రోహిత్, గిల్ అర్థ సెంచరీలు
- వర్షంతో మ్యాచ్‌కు అంతరాయం
- నేడు కొనసాగనున్న దాయాదుల పోరు

నవతెలంగాణ-కొలంబో

భారత్, పాకిస్థాన్ పోరుకు వరుణుడు మళ్లీ అడ్డు తగిలాడు. ఆసియా కప్ సూపర్ 4 దశలో దాయాదులు తలపడగా.. ఆటకు వర్షం అంతరాయం కలిగించింది. భారత్ ఇన్నింగ్స్‌లో 24.1 ఓవర్ల సమయంలో వర్షం రంగ ప్రవేశం చేసింది. పలుమార్లు ఫీల్డ్ అంపైర్లు పిచ్‌ను తనిఖీ చేసినా.. ఆదివారం మ్యాచ్ జరిగే అవకాశాలు కనిపించలేదు. దీంతో అంపైర్లు మ్యాచ్‌ను రిజర్వ్ డేకు వాయిదా వేశారు. నేడు మధ్యాహ్నం 3 గంటలకు పున ప్రారంభం కానున్న భారత్, పాక్.. యథాతథంగా భారత ఇన్నింగ్స్‌లో 24.1 ఓవర్ల నుంచి ఆరంభం కానుంది. భారత్, పాక్ గ్రూప్ దశ మ్యాచ్ వర్షార్పణమైన సంగతి తెలిసిందే.

గిల్, రోహిత్ దూకుడు

పేసర్లకు అనుకూలించే పరిస్థితుల్లో తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన భారత్‌కు ఓపెనర్లు అదిరే ఆరంభం అందించారు. కెప్టెన్ రోహిత్ శర్మ (56, 49 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సులు), శుభ్‌మన్ గిల్ (58, 52 బంతుల్లో 10 ఫోర్లు) అర్థ సెంచరీలతో మెరిశారు. కొత్త బంతితో పాక్ పేస్ త్రయం షహీన్, రవూఫ్, నసీం నిప్పులు చెరిగినా యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ వారి భరతం పట్టాడు. పవర్‌ప్లేలో బౌండరీల మోత మోగించిన గిల్ వేగంగా పరుగులు పిండుకున్నాడు. మరో ఎండ్‌లో రోహిత్ శర్మ నెమ్మదిగా ఆడాడు. పది ఫోర్లతో దండెత్తిన గిల్ 35 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించాడు. పేసర్లపై గిల్ విరుచుకుపడగా.. స్పిన్నర్లపై రోహిత్ దండెత్తాడు. షహీన్‌పై సిక్సర్‌తో ఇన్నింగ్స్ ఆరంభించిన రోహిత్.. షాదాబ్ ఖాన్‌పై రెండు సిక్సర్లు, ఓ ఫోర్‌తో జోరందు కున్నాడు. ఐదు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 42 బంతుల్లోనే రోహిత్ అర్థ సెంచరీ నమోదు చేశాడు. తొలి వికెట్‌కు ఓపెనర్లు 121 పరుగుల భారీ స్కోరు నమోదు చేసి భారీ స్కోరుకు గట్టి పునాది వేశారు. స్వల్ప విరామంలో ఓపెనర్లు ఇద్దరు నిష్క్రమించగా.. విరాట్ కోహ్లి (8 నాటౌట్), కెఎల్ రాహుల్ (17 నాటౌట్) అజేయంగా క్రీజులో నిలిచారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886

'జమిలి' విధానం... ప్రజాస్వామ్య మౌలికతత్వానికి వ్యతిరేకం!

సార్వత్రిక ఎన్నికలకు సమయం సమీపిస్తుండగా కేంద్ర ప్రభుత్వం సరికొత్త ప్రతిపాదన తీసుకొచ్చింది. అధికార, ప్రతిపక్ష కూటములు రెండూ సార్వత్రిక సమరానికి సన్నాహాలు చేసుకుంటున్న సమయంలో అనూహ్య నిర్ణయం తీసుకుంది మోదీ ప్రభుత్వం. 2014 ఎన్నికల్లో బీజేపీ మేనిఫెస్టోలో ప్రధాన అంశమైన జమిలి ఎన్నికలకు 2016 నుంచి ప్రధాని మోదీ ప్రతిపాదిస్తున్నప్పటికీ ఎట్టకేలకు కీలక అడుగు వేసింది కేంద్రం. అమృత్‌కాల్ సమావేశాలంటూ పార్లమెంట్ ప్రత్యేక భేటీకి ముహూర్తం ఫిక్స్ చేసిన తర్వాత వన్ నేషన్-వన్ ఎలక్షన్ పై సెప్టెంబర్ 02 శనివారం జమిలి ఎన్నికల కమిటీపై న్యాయశాఖ ఎనిమిది మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఛైర్మన్‌గా మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను నియమించింది. కేంద్ర మంత్రి అమిత్‌షా, లోక్‌సభలో విపక్ష నేత అధిర్ రంజన్ చౌదరి, గులాం నబీ ఆజాద్,15వ ఆర్థిక సంఘం మాజీ ఛైర్మన్ ఎన్‌కే సింగ్, లోక్‌సభ మాజీ సెక్రెటరీ జనరల్ సుభాష్ కశ్యప్, సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే, మాజీ చీఫ్ విజిలెన్స్ కమిషనర్ సంజయ్ కొఠారీలను కమిటీలో సభ్యులుగా చేర్చింది. ప్రత్యేక ఆహ్వానితుడిగా కేంద్రమంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్,కమిటీ సెక్రటరీగా కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి నితిన్ చంద్రలకు బాధ్యతలు అప్పగించింది.ప్రతి ఐదేండ్లకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు ఎన్నికలు నిర్వహించడం మన రాజ్యాంగ విధానం.అలా అని రెండింటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న నిబంధనేమీ లేదు. మన రాజ్యాం గంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలనే నిబంధన లేకపోయినా 1967 వరకు జమిలి ఎన్నికలే జరిగేవి. 1968,69ల్లో కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూలిపోవడం 1970లో ఏడాదికి ముందే లోక్‌సభ ఎన్నికలు నిర్వహించాల్సి రావడంతో అంతవరకు కొనసాగిన ఆనవాయితీకి ఫుల్‌స్టాప్ పడింది. కేంద్రానికి, రాష్ట్రానికి వేర్వేరుగా ఎన్నికలు జరిగే పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే 1983లో కేంద్ర ఎన్నికల సంఘం మళ్లీ ఏకకాల ఎన్నికల విధానం ప్రవేశపెట్టాలని ప్రతిపాదించింది. అయితే అప్పటి ప్రభుత్వం ఈ ప్రతిపాదనను వ్యతిరేకించగా, 1999లో లాకమిషన్ కూడా జమిలికి జై కొడుతూ ఓ నివేదిక అందజేసింది. అయితే ఎప్పుడూ చర్చలకే పరిమితమైన జమిలి ఎన్నికల విధానం కేంద్రం తాజా నిర్ణయంతో మళ్ళీ చర్చలోకి వచ్చింది.



నాదెండ్ల శ్రీనివాస్
9676407140

అయితే ప్రధాని మోదీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వన్ నేషన్-వన్ ఎలక్షన్ ఆచరణ సాధ్యమా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం ఉన్న పళంగా ఎన్నికలకు వెళ్లాలన్నా సార్వత్రిక ఎన్నికల సమయంలో కేంద్రంతో పాటు రాష్ట్రాలకు ఎన్నికలు నిర్వహించాలన్నా రాజ్యాంగ సవరణ చేయాల్సివుంటుంది.మరీ ముఖ్యంగా మొత్తం ఎన్నికల విధానాన్నే సంస్కరించాల్సి వుంటుంది.వీటిలో ముఖ్యమైనవి ఆర్టికల్ 356: రాష్ట్రాల అసెంబ్లీలను రద్దుచేసే అధికారం కేంద్రానికి ఉన్నది. రాష్ట్రంలో రాజ్యాంగబద్ధ యంత్రాంగం విఫలమైనప్పుడు మాత్రమే ఈ ఆర్టికల్‌ను ఉపయోగించి కేంద్రం ఈ చర్యకు దిగాల్సి ఉంటుంది.ఒకవేళ వేరే సందర్భంలో చట్టసభ రద్దుకు నిర్ణయిస్తే, అది రాజ్యాంగ విరుద్ధమే అనిపించుకొంటుంది.ఆర్టికల్ 172 (1): అసెంబ్లీ కాలవ్యవధి ఐదేండ్లుగా కొనసాగుతుంది. అత్యయిక స్థితిలో తప్పించి అసెంబ్లీ కాలవ్యవధిని మరే ఇతర సందర్భాల్లో పొడిగించకూడదు. సభ తొలిసారిగా సమావేశమైన నాటినుంచి కాలపరిమితి మొదలవుతుంది. ఆర్టికల్ 324: రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, లోక్‌సభ, రాజ్యసభ, శాసనసభ,శాసనమండలి ఎన్నికలు కేంద్ర ఎన్నికల సంఘం పర్యవేక్షణలో జరుగుతాయి. సమయాను సారం, రాజ్యాంగ నిబంధనలకు లోబడి ఈ ఎన్నికలు జరుగుతాయి. పార్లమెంట్, శాసనసభ ఎన్నికలు ఒకేసారి నిర్వహించాలంటే చట్టసభ కాలవ్యవధిని సహేతుక కారణాలతో సవరించాల్సి ఉంటుంది. ఆర్టికల్ 83(2): ప్రజాతీర్పుతో కొలువుదీరిన లోక్‌సభ కాలవ్యవధి ఐదేండ్లు. ప్రత్యేక సందర్భాల్లో మినహాయించి దిగువ సభను రద్దు చేయడానికి వీలులేదు. ఆర్టికల్ 83: పెద్దల సభ కాలపరిమితికి సంబంధించి ఆర్టికల్ 83 సూచిస్తుంది.దీంతో పాటు రాజ్యాంగంలోని 2, 3 చాప్టర్స్,పార్ట్-15లోని పలు అంశాలను,ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని కొన్ని నిబంధనలను జమిలి బిల్లు కోసం సవరించాల్సి ఉంటుంది. అయితే రెండు దశాబ్దాల క్రితమే లా కమిషన్ ముందుకు తెచ్చిన ఈ అంశం సమాఖ్య వ్యవస్థ, రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యతిరేకమని అనేక పార్టీలు, నిపుణులు తిరస్కరించినప్పటికీ 2014 నుంచీ ఒకే దేశం ఒకే ఎన్నికలంటూ వదలకుండా చెబుతున్నారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ ఈ ప్రతిపాదన ఆలోచన కాదు దేశానికి అవసరం అని, ప్రతి నిర్ణయం జాతీయ ప్రయోజనాల లక్ష్యంగా ఉండాలని చెప్పారు. విడి విడిగా ఎన్నికలు జరగటం వలన అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం కలుగుతున్నందున ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి చర్చించాలని కోరారు. చట్టసభలతో పాటు స్థానిక సంస్థలకూ ఉపయోగపడే ఒకే ఓటర్ల జాబితా తయారు చేస్తే సమయం, నిధులు ఆదా అవుతాయన్నారు. జనం మీద రాజకీయాలే పైచేయి సాధిస్తే జాతి ప్రతికూల మూల్యం చెల్లించాల్సి ఉంటుందన్నారు. నిజానికి ఇప్పుడు కావాల్సింది ఒకేసారి ఎన్నికలు కాదు.ప్రజాస్వామ్యం మరింతగా వర్ధిల్లే విధంగా, ధన ప్రలోభాలను గణనీయంగా తగ్గించి, ప్రజాభిప్రాయానికి చట్టసభల్లో తగు ప్రాతినిధ్యం లభించేందుకు ఉన్నంతలో మెరుగైన దామాషా పద్ధతి ఎన్నికల సంస్కరణలు కావాలి.

అమెరికాలో దేశాధ్యక్ష ఎన్నికల్లో 50 రాష్ట్రాల్లో రెండు చోట్ల తప్ప మిగిలిన చోట్ల మెజారిటీ ఓట్లు తెచ్చుకున్న పార్టీకి అధ్యక్షుడిని ఎన్నుకొనే ఎలక్టరల్ కాలేజీ ప్రతినిధులను మొత్తంగా కేటాయిస్తారు.మన మాదిరి నియోజకవర్గాల ప్రాతిపదిక విధానంలో డబ్బున్న పార్టీలే ప్రాతినిధ్యం పొందగలుగు తున్నాయి. కొన్ని పార్టీలకు వచ్చిన ఓట్ల మేరకు ప్రాతినిధ్యం ఉండటం లేదు.దామాషా ప్రాతినిధ్య విధానంలో డబ్బుతో ఓట్లు కొన్నప్పటికీ అలాంటివారు ఎన్నికయ్యే అవకాశం ఉండదు కనుక ఎవరూ డబ్బు పెట్టరు, నిజమైన ప్రజాభిప్రాయం వెల్లడి కావటానికి అవకాశాలు ఎక్కువ.ఇప్పుడు అధికారమే పరమావధిగా ఉన్న పార్టీలు, వ్యక్తులు డబ్బున్న వారికే పెద్దపీట వేస్తూ అధికారాన్ని కొనుగోలు చేస్తున్నాయి. అందుకే ఏ పార్టీకి ఎంత శాతం ఓట్లు వస్తే అన్ని సీట్లు కేటాయించే దామాషా ప్రాతినిధ్యం గురించి ఒక్క వామపక్షాలు తప్ప మిగిలిన పార్టీలేవీ మాట్లాడవు.తరచూ ఎన్నికల వలన ప్రభుత్వాలు దీర్ఘకాలిక విధానాలను రూపొందించే అవకాశాలకు ఆటంకం కలుగతుందని, ఒకేసారి ఎన్నికలు జరిగితే ఇలాంటి అవకాశం ఉండదనేది కేంద్రంలో బీజేపీ వాదన. పాలకులు మారినా లక్ష్యాల నిర్దేశం, పథకాలు కొనసాగేందుకు ఏర్పాటు చేసిన ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసిన పెద్దలు దీర్ఘకాలిక విధానాల గురించి మాట్లాడటం హాస్యాస్పదం, జనాన్ని తప్పుదారి పట్టించే వ్యవహారమే. ప్రతి దానికీ ప్రజాస్వామ్య జపం చేసే వ్యక్తులు, శక్తులూ అభివృద్ధి, ఖర్చు తగ్గించాలనే పేరుతో ప్రజాస్వామిక సూత్రాలకే విఘాతం కలిగించే ప్రతిపాదనను ముందుకు తెస్తున్నారు.ఇది ఫెడరల్ సూత్రాలకు, రాజ్యాంగ మౌలిక స్వభావానికే విరుద్ధం. ఇది ఏక వ్యక్తి ఆధిపత్యానికి దారి తీస్తుంది. అందువలన ఇది ఇక్కడికే పరిమితం అవుతుందన్న హామీ ఏముంది? అసలు బీజేపీ ఈ ప్రతిపాదనను పదే పదే ఎందుకు ముందుకు తెస్తున్నది? పాలకపార్టీ, అధికార యంత్రాం గంలో జరుగుతున్న ఈ చర్చ, కదలికల కారణంగానే అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలు తమ జాగ్రత్తలు తాము తీసుకుంటున్నాయి.దేశ అభివృద్ధి,ప్రయోజనాల గురించి తమకు తప్ప మరొకరికి పట్టవని, అలాగే దేశభక్తి ఇతరులకు లేనట్లుగా,దేశద్రోహులకు మద్దతు ఇస్తున్నట్లు గత తొమ్మిదేండ్లుగా ఒక పథకం ప్రకారం ప్రచారం చేస్తున్నారు.ఏదైనా సరే బీజేపీ తలుచుకుంటే లోక్‌సభలో బిల్లు పాస్ అవ్వడం పెద్ద పనేమీ కాదు. కానీ రాజ్యసభ ఆమోదం పొందడమే కష్టం. ఇక విపక్షాలు పాలిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తాయా లేదా? అన్నదే ప్రధాన ప్రశ్న.ప్రస్తుతం బీజేపీ, కాంగ్రెస్ మాత్రమే జాతీయ స్థాయి పార్టీలుగా ఉన్నాయి. సీపీఐ, సీపీఐ(ఎం) జాతీయ పార్టీలుగా ఉన్నప్పటికీ శక్తి చాలినంత సరిపోవడం లేదు. బీఎస్పీ, సమాజ్‌వాది, ఆప్ ఏవో ఒక రాష్ట్రానికి పరిమితం అవుతున్నాయి. ముఖ్యంగా దేశంలో రెండు జాతీయ పార్టీలకన్నా బలంగా ప్రాంతీయ పార్టీల హవా నడుస్తోంది. లోక్‌సభ ఎన్నికలతో పాటు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, వీలైతే స్థానిక సంస్థల ఎన్నికలు కూడా కలిపి ఒకేసారి నిర్వహించడమే జమిలి ఎన్నికలు.



ప్రజా ఉద్యమాలతో పాటు రాష్ట్రాలలో మామూలు పద్ధతుల్లో ఎన్నికలు జరుగుతూ ఉంటే ప్రజాస్వామ్య భావాలు వ్యక్తం చేయడానికి వీలుంటుంది.ప్రజాస్వామ్యానికి ఇది చాలా అవసరం. నిజానికి ఎన్నికల నిర్వహణ అంటే ప్రజల కార్య కలాపాల,అభిప్రాయాల వ్యక్తీకరణకు అవకాశం ఇవ్వడమే. ప్రజాస్వామ్య మనుగడకు ఇది అవసరం.జమిలి ఎన్నికల ప్రతిపాదనను ముందుకు తోయడం అంటే జనాభిప్రాయ వ్యక్తీకరణకు అవకాశం లేకుండా చేయడమే అవుతుంది.

ఇలా చేయడానికి మనకు చాలా అడ్డంకులున్నాయి. ఎందుకంటే ఒక్కో రాష్ట్రానికి ఒక్కోసారి అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఉదాహరణకు తెలంగాణ,ఛత్తీస్‌గఢ్ సహా ఐదు రాష్ట్రాలకు ఈ ఏడాది చివరిలోగా ఎన్నికలు జరగాలి. అదే ఆంధ్రప్రదేశ్‌కి 2024 మే వరకు సమయం ఉంది.మరికొన్ని రాష్ట్రాలకు 2025, ఇంకొన్ని రాష్ట్రాలకు 2026 వరకు కూడా టైమ్ ఉంది.కానీ లోక్‌సభ ఎన్నికలకు ఉన్న సమయం 2024 ఏప్రిల్ వరకే.అంటే ఒకేసారి అన్నింటికీ ఎన్నికలు జరగాలంటే తెలంగాణ లాంటి రాష్ట్రాలకు ఆరు నెలలు ఆలస్యంగా గానీ,2024, 2025న ముగిసే శాసనసభల పదవీ కాలాన్ని ముందే ముగించడం గానీ చేయాలి. నిజంగా కేంద్ర ప్రభుత్వం చెబుతున్నట్లు జమిలి ఎన్నికలు పెట్టాలంటే ఏకంగా ఆరు రాజ్యాంగ సవరణలు చేయాలి.ఇంత పెద్ద రాజ్యాంగ సవరణలు చేయాలంటే జమిలి ఎన్నికలకు కనీసం 14 రాష్ట్రాలయినా ఒప్పుకోవాలి. పార్లమెంట్ ఉభయ సభల్లో ఉన్న మెజారిటీ,దేన్నయినా బలపరిచే ఇతర పార్టీలు కూడా ఉన్నందున ఒక్క రోజులోనే కశ్మీర్ రాష్ట్రాన్నే రద్దు చేసినట్లు ఒకేసారి ఎన్నికల కోసం జనాభిప్రాయాన్ని తోసిపుచ్చి రాజ్యాంగ సవరణలు చేయటం నరేంద్ర మోడీకి ఒక పెద్ద సమస్య కాదు.అలాంటి పరిణామం జరిగినా ఆశ్చర్యం లేదు.కాబట్టి జమిలి ఎన్నికల విధానాన్ని అనుసరించడం అంటే ప్రజా స్వామ్య మౌలికతత్వానికి వ్యతిరేకమే అవుతుంది. సార్వభౌమాధికారం ప్రజలకు లేకుండా ఎన్నికలను కేవలం ఒక ప్రక్రియలా,తంతులా భావించినట్టు అవుతుంది.ఈ పద్ధతి అనుసరించడం అంటే ప్రజల బాధ్యత కేవలం అయిదేండ్లకు ఒకసారి ఓటు వేయడానికే పరిమితం చేసి ఆ తరవాత ప్రజలకు ఏ పాత్రా లేకుండా చేయడమే అవుతుంది.ఆ తర్వాత వ్యవహారం అంతా కార్యనిర్వాహక వర్గం చేతిలోనే ఉంటుంది. క్రియాశీలంగా ఉండే ప్రజలు అయిదేళ్ల పాటు వేచి ఉండలేరు అని డాక్టర్ రామ్ మనోహర్ లోహియా చెప్పిన మాటను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి.ప్రజా ఉద్యమాలతో పాటు రాష్ట్రాలలో మామూలు పద్ధతుల్లో ఎన్నికలు జరుగుతూ ఉంటే ప్రజాస్వామ్య భావాలు వ్యక్తం చేయడానికి వీలుంటుంది. ప్రజాస్వామ్యానికి ఇది చాలా అవసరం. నిజానికి ఎన్నికల నిర్వహణ అంటే ప్రజల కార్యకలాపాల,అభిప్రాయాల వ్యక్తీకరణకు అవకాశం ఇవ్వడమే. ప్రజాస్వామ్య మనుగడకు ఇది అవసరం.జమిలి ఎన్నికల ప్రతిపాదనను ముందుకు తోయడం అంటే జనాభిప్రాయ వ్యక్తీకరణకు అవకాశం లేకుండా చేయడమే అవుతుంది. ■

ఆరెస్సెస్ 1925 సంవత్సరంలో పుట్టి రానున్న 2025కి వంద సంవత్సరాలు పూర్తి చేసు కుంటున్న సమయంలో ఈ దేశాన్ని "హిందుత్వ రాష్ట్రంగా" మార్చే కుట్ర లో భాగమే ఈ పేరు మార్పు ఆలోచన దుశ్చర్య కావచ్చు! ఈ మధ్యకాలంలో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఒక సమావేశంలో ప్రజలను ఉద్దేశించి రెండు అంశాలను వెల్లడించారు. ఈ దేశ ప్రజలు ఇండియా అని పిలవకూడదు భారత్‌గా పిలవాలని మరి ఈ దేశంలోని భారతీయులందరూ హిందువులు అనే కొత్త నినాదాన్ని ఇవ్వడం అంటే ఈ దేశాన్ని మత కొట్లాటలతో విచ్ఛిన్నం చేయబోతుందనే అనుమానం రాకమానదు. దీన్నిబట్టి చూస్తే కేంద్రంలోని బీజేపీ ఆరెస్సెస్ కనుసైగల్లోనే నడుస్తుందని మరోసారి తేటతెల్లమైంది.



రాచకొండ విగ్నేష్
6302246641

దేశం పేరు మారిస్తే బతుకులు మారుతాయా?

ఇండియాను విదేశీపేరుగా, భారత్ స్వదేశీ పేరుగా బీజేపీ కొత్త రాజకీయాలకు తెరదీసింది. 2023 జూలై 18న బెంగళూరులో ప్రతిపక్ష పార్టీలన్నీ సమావేశం ఏర్పాటు చేసుకొని "ఇండియా" (ఇండియా అనగా ది ఇండియన్ నేషనల్ డెవలప్మెంటల్ ఇంక్లూజివ్ అలయన్స్ కూటమిని) ఏర్పాటు చేసిన విషయం అందరికీ తెలిసిందే. ఈ దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపది ముర్ము ఈ దేశంలో జీ20 శిఖరాగ్ర సమావేశాలు సెప్టెంబర్ 8 నుండి 10వ తేదీల్లో జరగబోయే సమావేశాల ముందు "ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా" ను గెజిట్లో మార్పు చేసి లిప్రెసిడెంట్ ఆఫ్ భారత్" గా విడుదల చేయడమంటే దేశ ప్రజలందరికీ ఆశ్చర్యం కలగచేసిన అంశంగా పరిగణించాలి. బీజేపీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత నుండి ఉత్తరప్రదేశ్ పాలిత యోగి ప్రభుత్వం మొదటగా అలహాబాద్ ప్రాంతం పేరును ప్రయాగ్రాజ్ గాను, ఫైజాబాద్‌నీ అయోధ్యగా నామకరణం చేసింది. బీజేపీ ప్రభుత్వానికి ప్రాంతాల పేర్లను రాష్ట్రాల పేర్లను దేశానికి సంబంధించిన పేర్లను మార్చడం "వెన్నతో పెట్టిన విద్య'గా భావించాలి. ఎందుకంటే మోడీ స్వయానా తన గుజరాత్ రాష్ట్రంలో మోతేర క్రికెట్ స్టేడియానికి నరేంద్ర మోడీ స్టేడియంగా నామ కరణం చేయడం అంటే "బతికున్న పుడే తన సమాధికి తానే పేరు పెట్టు కున్నట్టుగా' ఉందన్న మాట. రాజీవ్ ఖేల్ రత్నను ధ్యాన్‌చంద్ ఖేల్ రత్నగా మార్చడం ఓ జిత్తుల మారిగా మోడీ గారిని అభివర్ణించవచ్చు.



బ్రిటిష్ ప్రభుత్వం బెంగాల్ ప్రజలను "విభజించు- పాలించు" అన్న చందంగా మోడీ ప్రభుత్వం ఈ దేశాన్ని విభజించడానికి పావులు కదుపుతోంది. భారత రాజ్యాంగం ప్రకరణ -1 ద్వారా ఈ దేశం రాష్ట్రాల కలయిక తో ఏర్పడింది అని అనగా ఈ దేశాన్ని ఎవరు విడగొట్టలేరని అర్థం. ఈ మౌలిక సూత్రాన్ని మోడీ ప్రభుత్వం మరవడం ఆందోళనకరం. 1949 నవంబర్ 18న జరిగిన రాజ్యాంగ ముసాయిదా కమిటీ ఈ దేశానికి అనేక పేర్లను సూచిం చారు. హిందుస్థాన్ అని ,భారతదేశం అని భారత్ వర్ష్‌గా ఇలా అనేక పేర్లను ప్రతిపాదించిన తర్వాత ప్లేబిసైట్ ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా "ఇండియా దట్ ఈజ్ భారత్" ప్రకరణ -1 ద్వారా ప్రవేశికలో పొందుపరిచి రాజ్యాంగ పరిషత్ ఆమోదం తెలిపింది. కానీ బీజేపీ ప్రభుత్వం చరిత్రను వక్రీకరించడమే కాకుండా పాఠ్యాంశాల్లో డార్విన్ సిద్ధాంతాన్ని, భగత్‌సింగ్, అంబేద్కర్ పాఠాలను సైతం తొలగించడం చూసాం. మరి ఇతర మతాల మధ్య వైశ్యామ్యాలు పెంచుతూ ప్రజలను విభజించడమే పనిగా బీజేపీ కంకణం కట్టుకుందని తేటతెల్లమయింది. అయితే పేరు మార్చ డంతో ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయా అంటే అదీ లేదు. 2011 దేశ జనాభా లెక్కల ప్రకారం సుమారు ఒక లక్ష 21 వేల కోట్లు నిత్యం ఈ జనాభా పేదరికంతో, నిరుద్యోగితతో, ప్రాంతీయ అసమానతలతో బాధ పడుతున్న వీటిని పట్టించుకోకుండా దేశం పేరును మారిస్తే కీర్తి వస్తుందా అని అందరిలో రేకెత్తించే ప్రశ్న. దేశంలో మణిపూర్ రాష్ట్రంలో మరణహోమాలు, హత్యలు మానభంగాలు అనేక సంఘటనలు జరుగుతున్న వాటిపైన మన ప్రధాని పార్లమెంట్లో నోరు మెదపకపోవడం యావత్తు దేశం నిబ్బరపోయేటట్టుగా మోడీ పరిపాలన సాగుతుంది.

ఆరెస్సెస్ 1925 సంవత్సరంలో పుట్టి రానున్న 2025కి వంద సంవత్సరాలు పూర్తి చేసు కుంటున్న సమయంలో ఈ దేశాన్ని "హిందుత్వ రాష్ట్రంగా" మార్చే కుట్ర లో భాగమే ఈ పేరు మార్పు ఆలోచన దుశ్చర్య కావచ్చు! ఈ మధ్యకాలంలో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఒక సమావేశంలో ప్రజలను ఉద్దేశించి రెండు అంశాలను వెల్లడించారు. ఈ దేశ ప్రజలు ఇండియా అని పిలవకూడదు భారత్‌గా పిలవాలని మరి ఈ దేశంలోని భారతీయులందరూ హిందువులు అనే కొత్త నినాదాన్ని ఇవ్వడం అంటే ఈ దేశాన్ని మత కొట్లాటలతో విచ్ఛిన్నం చేయబోతుందనే అనుమానం రాకమానదు. దీన్నిబట్టి చూస్తే కేంద్రంలోని బీజేపీ ఆరెస్సెస్ కనుసైగల్లోనే నడుస్తుందని మరోసారి తేటతెల్లమైంది. ఆర్‌ఎస్‌ఎస్ కుహన మేధావులు ఈ భారత్ అని కాకుండా "హిందుస్థాన్" అని నామకరణం చేయడానికి వచ్చిన అడ్డంకులను ప్రజలకు సూటిగా తెలియజేయాలి. వాటి ప్రశ్నలకు సమాధానాలు లేవని స్పష్టంగా ప్రజలకు అర్థమవుతుంది. కాబట్టి దేశ ప్రజలందరూ ఈ దేశ ఐక్యత కోసం ప్రజాస్వామ్యవాదులు, లౌకికవాదులు, మేధావులు, ప్రజలంతా కలిసికట్టుగా ముందుకు సాగి ఆర్‌ఎస్‌ఎస్ భ్రమను పటాపంచలు చేసి 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ముక్తకంఠంతో ముక్త్ బీజేపీ-విముక్త భారత్ అని నినదించాలి. ■

జింకల వేట కేసులో సల్మాన్ ఖాన్ మీద కేసు పెట్టింది ఎవరు?

- డా॥ కె.శశిధర్,
పర్యావరణ నిపుణులు
94919 91918



మానవాళి మనుగడలో ఎంతో కీలకమయిన పాత్ర పోషించిన ప్రకృతి, పర్యావరణం, సహజవనరులని రక్షించుకోడానికి ఎంతోమంది తమ ప్రాణాల్ని పణంగా పెట్టి పోరాడారు. ఆ త్యాగాల చరిత్రే భారత దేశ పర్యావరణ ఉద్యమాల చరిత్ర. పర్యావరణం పై ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో, దేశ సహజ వనరులను పరిరక్షించడంలో, వారి బాధ్యతని గుర్తు చేయటంలో భారత పర్యావరణ ఉద్యమాలు కీలక పాత్ర పోషించాయి. ఈ ఉద్యమాలు అటవీ నిర్మూలన మరియు కాలుష్యం నుండి వన్యప్రాణుల సంరక్షణ మరియు స్థిరమైన అభివృద్ధి వరకు అనేక పర్యావరణ సమస్యలను పరిష్కరించాయి. ఈ ఉద్యమాలు మార్పును ప్రేరేపిస్తాయి. ఇంకా భారతదేశంలో మరింత పర్యావరణ స్పృహ కలిగిన సమాజాన్ని ప్రోత్సహిస్తాయి. పర్యావరణం పట్ల భారతీయ పౌరులలో పెరుగుతున్న ఆందోళనను, భవిష్యత్ తరాల కోసం దానిని రక్షించాల్సిన అవసరాన్ని అవి నిరంతరం గుర్తు చేస్తాయి .

1. చిప్కో ఉద్యమం యొక్క ముఖ్య లక్ష్యం ఏమిటి?
ఎ) పవిత్రమైన తోటలను రక్షించడం
బి) నీటి కాలుష్యాన్ని నివారించడం
సి) అటవీ నిర్మూలనను అడ్డుకోవటం
డి) వన్యప్రాణి పర్యాటకాన్ని ప్రోత్సహించడం

2. 'వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా' అని పిలువబడే భారతీయ పర్యావరణవేత్త ఎవరు?
ఎ) మేధా పాట్కర్ బి) సుందర్‌లాల్ బహుగుణ
సి) రాజేంద్ర సింగ్ డి) చండీ ప్రసాద్ భట్

3. కేరళలోని సైలెంట్ వ్యాలీ ఉద్యమం యొక్క లక్ష్యం ఏమిటి?
ఎ) పురాతన బౌద్ధ ప్రదేశాన్ని సంరక్షించండి
బి) ఆదివాసీల హక్కులను పరిరక్షించడం
సి) ఉష్ణమండల వర్షారణ్యం యొక్క జీవవైవిధ్యాన్ని సంరక్షించడం
డి) పర్యాటకాన్ని ప్రోత్సహించండి

4. నర్మదా బచావ్ ఆందోళన్ ఉద్యమానికి నాయకత్వం వహించింది ఎవరు ?
ఎ) మేధా పాట్కర్ బి) సుందర్‌లాల్ బహుగుణ
సి) రాజేంద్ర సింగ్ డి) చండీ ప్రసాద్ భట్

5. చిప్కో ఉద్యమానికి నాయకత్వం వహించింది ఎవరు?
ఎ) మేధా పాట్కర్ బి) సుందర్‌లాల్ బహుగుణ
సి) రాజేంద్ర సింగ్ డి) చండీ ప్రసాద్ భట్

6. అప్పికో ఉద్యమం ఏ రాష్ట్రంలో జరిగింది?
ఎ) కేరళ బి) తమిళనాడు
సి) కర్ణాటక డి) ఆంధ్ర

7. అప్పికో ఉద్యమానికి నాయకత్వం వహించింది ఎవరు?
ఎ) గౌరీ దేవి బి) సుందర్‌లాల్ బహుగుణ
సి) చండీ ప్రసాద్ భట్ డి) పాండురంగ హెగ్డే

8. బిష్ణోయి ఉద్యమం ఏ రాష్ట్రంలో జరిగింది?
ఎ) కేరళ బి) తమిళనాడు
సి) రాజస్థాన్ డి) కర్ణాటక

9. భారతదేశంలో పర్యావరణ ఉద్యమాలకి మాతృకగా భావించే బిష్ణోయి ఉద్యమానికి నాయకత్వం వహించింది ఎవరు?
ఎ) సరళా దేవి బి) అమృతా దేవి
సి) మేధా పాట్కర్ డి) వందన శివ

10. జింకల వేట కేసులో సల్మాన్‌ఖాన్ మీద కేసు పెట్టింది ఎవరు?
ఎ) రాజస్థాన్ కి చెందిన బిష్ణోయి తెగ ప్రజలు
బి) తమిళనాడు కి చెందిన గిరిజనులు
సి) కేరళ కి చెందిన ఆదివాసీలు
డి) బీహార్ కి చెందిన సింగ్భుం తెగ ప్రజలు

11. జంగిల్ బచావో ఆందోళన్ ఏ రాష్ట్రానికి చెందినది?
ఎ) కేరళ బి) తమిళనాడు
సి) రాజస్థాన్ డి) బీహార్

12. నర్మదా బచావో ఆందోళన్ దేని నిర్మాణానికి వ్యతిరేకంగా జరిగింది?
ఎ) భాక్రానంగల్ ప్రాజెక్ట్ బి) హీరాకుడ్ డ్యాం
సి) సర్దార్ సరోవర్ డ్యాం ప్రాజెక్ట్ డి) నాగార్జున సాగర్ డ్యాం



13. సైలెంట్ వ్యాలిని నేషనల్ పార్క్‌గా ప్రకటించింది ఎవరు?
ఎ) రాజీవ్ గాంధీ బి) శ్రీమతి ఇందిరా గాంధీ
సి) ఆటలబిహరి వాజపేయి డి) మన్మోహన్ సింగ్

14. 'సేవ్ ఆరావళి ఉద్యమం' ఈ కింది వాటిలో దేనికి సంబంధించినది?
ఎ) చిత్తడి నేలలు సంరక్షణ బి) ఎడారులు సంరక్షణ
సి) పర్వతాలు సంరక్షణ డి) నదుల పరిరక్షణ

15. 'సేవ్ సైలెంట్ వ్యాలీ' ఉద్యమం ఏ రాష్ట్రంలో జరిగింది?
ఎ) కర్ణాటక బి) కేరళ
సి) తమిళనాడు డి) ఆంధ్రప్రదేశ్

16. భారతదేశంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (NGT) ఏర్పాటు చేయటం యొక్క ప్రధాన లక్ష్యం ఏమిటి?
ఎ) పారిశ్రామిక వృద్ధిని ప్రోత్సహించడం
బి) రాజకీయ పార్టీల మధ్య వివాదాలను పరిష్కరించడం
సి) పర్యావరణ కేసులను పరిష్కరించడం
డి) వన్యప్రాణుల పరిశోధన నిర్వహించడం

17. 'అలప్పుజా డిక్లరేషన్' ఈ క్రింది వాటిలో దేనికి సంబందించినది?
ఎ) ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ
బి) వాయు కాలుష్య నియంత్రణ
సి) ఎడారీకరణ డి) సముద్ర సంరక్షణ

18. భారతదేశంలో 'సేవ్ అవర్ టైగర్స్' ప్రచారం లక్ష్యం:
ఎ) పులుల వేటను ప్రోత్సహించండి
బి) పులుల జనాభాను రక్షించడం మరియు సంరక్షించడం
సి) పులుల పెంపకాన్ని ప్రోత్సహించండి
డి) టైగర్ టూరిజంను ప్రోత్సహించండి

19. 'సేవ్ ది వెస్టర్న్ ఘాట్స్ మార్చ్' ప్రాముఖ్యత ఏమిటి?
ఎ) అటవీ సంరక్షణ బి) నీటి సంరక్షణ
సి) తీర ప్రాంతాలను రక్షించడం
డి) పశ్చిమ కనుమలలో జీవవైవిధ్యాన్ని పరిరక్షించడం

20. పులుల ఆవాసాలకు నెలవైన సుందర్బన్స్ మడ అడవులు ఏ రాష్ట్రంలో ఉన్నాయి?
ఎ) పశ్చిమ బెంగాల్ బి) కేరళ
సి) రాజస్థాన్ డి) ఉత్తరాఖండ్

21. 'సేవ్ ది ఆరే ఫారెస్ట్' ఉద్యమం భారతదేశంలోని ఏ నగరంలో ప్రారంభమయింది?
ఎ) ముంబై బి) కోల్‌కతా సి) ఢిల్లీ డి) చెన్నై

22. 'అరవాలిస్' ఉద్యమం ఈ క్రింది వాటిలో ఏ పర్యావరణ సమస్యకి సంబంధించింది ?
ఎ) వాయు కాలుష్యం బి) అటవీ నిర్మూలన
సి) ఎడారీకరణ డి) నేల కోత

23. 'సేవ్ ద నియమగిరి హిల్స్' ఉద్యమం దేనికి వ్యతిరేకంగా జరుగుతుంది?
ఎ) బాక్సైట్ తవ్వకం బి) పవన శక్తి ప్రాజెక్టులు
సి) చమురు డ్రిల్లింగ్ డి) ఆనకట్ట నిర్మాణం

24. గోవాలో 'సేవ్ మోలెం' ఉద్యమం లక్ష్యం ఏమిటి ?
ఎ) పగడపు దిబ్బలను రక్షించడం
బి) చమురు చిందటం నిరోధించడం
సి) బయోడైవర్సిటీ హాట్‌స్పాట్‌లో మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నిర్మాణాన్ని వ్యతిరేకించటం
డి) ఎకో-టూరిజంను ప్రోత్సహించడం

25. 'సేవ్ ది వెస్టర్న్ ఘాట్స్' ఉద్యమం పశ్చిమ కనుమలను దీని నుండి రక్షించడం లక్ష్యంగా పెట్టుకుంది:
ఎ) పారిశ్రామిక కాలుష్యం బి) పట్టణీకరణ
సి) అటవీ నిర్మూలన డి) పైవన్నీ

26. చిలక బచావ్ ఆందోళన్ ప్రచారం వీటి పరిరక్షణకు సంబంధించినది?
ఎ) ఉష్ణమండల వర్షారణ్యం
బి) సముద్ర మరియు ఉప్పునీటి మడుగుల పర్యావరణ వ్యవస్థ పరిరక్షణ
సి) పట్టణ హరిత ప్రదేశం డి) శుష్క ఎడారి ప్రాంతం

27. భారతదేశంలో 'సేవ్ ది చంబల్' ఉద్యమం లక్ష్యం ఏమిటి?
ఎ) పవిత్ర నదిని రక్షించడం
బి) చంబల్ నది, దాని ప్రత్యేక జీవవైవిధ్యం పరిరక్షణ
సి) చంబల్ వెంబడి పారిశ్రామిక కాలుష్యాన్ని ప్రోత్సహించడం
డి) చంబల్ వెంట పట్టణీకరణను ప్రోత్సహించడం

28. 'సేవ్ ది సలీం అలీ బర్డ్ శాంక్చురీ' ఉద్యమం ఈ కింది వాటిలో వేటి ఆవాసాలను రక్షించడానికి ప్రయత్నిస్తుంది.
ఎ) పులులు బి) ఏనుగులు
సి) వలస పక్షులు డి) మొసళ్ళు

29. 'సేవ్ ది ఆలివ్ రిడ్లీ తాబేళ్లు' ప్రచారం ఏ రాష్ట్రానికి సంబంధించినది?
ఎ) కేరళ బి) గోవా
సి) ఒడిశా డి) తమిళనాడు

30. 'సేవ్ ది ఘరియాల్' అంతరించిపోతున్న ఏ జీవులని రక్షించే లక్ష్యంతో పనిచేస్తుంది?
ఎ) మొసలి బి) ఏనుగు సి) పులి డి) తాబేలు

సమాధానాలు

			13.బి	14.సి	15.బి
			16.సి	17.ఎ	18.బి
1.సి	2.సి	3.సి	19.డి	20.ఎ	21.ఎ
4.ఎ	5.బి	6.సి	22.బి	23.ఎ	24.సి
7.డి	8.సి	9.బి	25.డి	26.బి	27.బి
10.ఎ	11.డి	12.సి	28.సి	29.సి	30.ఎ

కరెంట్ అఫైర్స్

- కె. నాగార్జున
కరెంట్ ఎఫైర్స్ సీనియర్ ఫ్యాకల్టీ
9490352545



ఎడాప్ట్ ఎ హెరిటేజ్ 2.0 కార్యక్రమం : భారతదేశ సాంస్కృతిక వారసత్వాన్ని, దాని అమూల్యమైన సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడానికి ఎ.ఎస్.ఐ (ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా) 2023 సెప్టెంబర్ 4 న అంటే ఈ రోజు న్యూ ఢిల్లీలో ఐ.డి.ఎస్.సి.ఎ. లోని ఆడిటోరియంలో 'అడాప్ట్ ఎ హెరిటేజ్ 2.0' కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఇదే రోజు 'ఇండియన్ హెరిటేజ్' పేరుతో మొబైల్ యాప్‌ను ప్రారంభించనున్నారు.




బ్రిక్స్ కూటమిలో మరో 6 దేశాలు : అర్జెంటినా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లకు పూర్తి స్థాయి సభ్యత్వం ఇవ్వాలని కూటమి నిర్ణయించింది. దక్షిణాఫ్రికాలో జొహన్నెస్ బర్గ్ లో జరుగుతున్న 3 రోజుల శిఖరాగ్ర భేటీలో ఆఖరు రోజైన సిరిల్ రమఫోసా ప్రకటించారు. 2024 జనవరి 1 వ తేదీ నుంచి 6 దేశాల సభ్యత్వం అమలులోకి వస్తుందని తెలిపారు. ఇక నుంచి బ్రిక్స్ బలం 5 నుంచి 11 కు పెరగనుంది.



అత్యుత్తమ కేంద్ర బ్యాంకర్ - శక్తికాంత దాస్ : అంతర్జాతీయంగా అత్యుత్తమ కేంద్రబ్యాంకర్‌గా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్.బి.ఐ) గవర్నర్ శక్తికాంత్ దాస్ నిలిచారు. అమెరికాకు చెందిన గ్లోబల్ ఫైనాన్స్ మ్యాగజైన్ ఇచ్చిన ర్యాంకుల్లో ఆయనకు అగ్రస్థానం దక్కింది. 'గ్లోబల్ ఫైనాన్స్ సెంట్రల్ బ్యాంకర్ రిపోర్ట్ కార్డ్స్ 2023 లో శక్తికాంత దాస్‌కు 'ఎ +' రేటింగ్ లభించింది. ఈ ఎ + రేటింగ్ ముగ్గురు కేంద్ర బ్యాంక్ గవర్నర్స్‌కు ఇవ్వగా అందుకు శక్తికాంత దాస్ అగ్రస్థానం పొందారు. తరువాతి స్థానం స్విట్జర్లాండ్ (స్విస్ సెంట్రల్ బ్యాంక్) గవర్నర్ థామస్ జె.బోర్డాన్, వియత్నాం కేంద్ర బ్యాంకు అధిపతి ఎన్‌గుయెన్ థిహంగ్ వున్నారు.


జార్జియాలో 'హిందూ వారసత్వ' నెలగా అక్టోబర్ : మహాత్మాగాంధీ జయంతి తో పాటు శరన్నవరాత్రులు, దీపావళి వంటి ప్రముఖ పండుగలు వున్న అక్టోబర్‌ను అమెరికాలో జార్జియా రాష్ట్రం హిందూ వారతస్వ నెలగా ప్రకటించింది. ప్రతిభావంతులైన హిందూ - అమెరికన్లను గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు గవర్నర్ బ్రయాన్ కెంప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెలలో హిందు సాంప్రదాయ ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణపై దృష్టి పెడతామని పేర్కొన్నారు.



మట్టి అరటి రకానికి జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్ : కన్యాకుమారి జిల్లాకు చెందిన మట్టి అరటి రకానికి ఇటీవల భౌగోళిక సూచిక (జి.1) ట్యాగ్ లభించింది. ఈ మట్టి అరటి రకాలను 'బేబీ బనానా' అని పిలుస్తారు. ఈ రకం శిశువు ఆహారంగా సిఫార్సు చేయడం జరిగింది. ఈ జి1 ట్యాగ్ 10 సంవత్సరాల వరకు చెల్లుబాటులో వుంటుంది.



గబోన్ లో సైనిక తిరుగుబాటు : ఆఫ్రికాలో మరో సైనిక తిరుగుబాటు జరిగింది. అధ్యక్షుడు ఆలీ బాంగోను గబోన్‌లో సైనికులు గృహనిర్బంధంలో పెట్టి అధికారాన్ని హస్తగతం చేసుకున్నారు. దేశ సరిహద్దులను మూసివేశారు. కొత్త పాలకుడిగా జనరల్ బ్రైస్ క్లొటైర్ ఒలిగు గుయేమాను ఎన్నుకొన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆలీ బాంగో 64 శాతం ఓట్లతో నెగ్గారు. అయితే ఈ ఎన్నికలు స్వేచ్ఛగా జరగలేదని సైనిక తిరుగుబాటుతో ఆరోపించింది. సైనికులు జాతీయ టెలివిజన్‌లో ఈ విషయం ప్రకటించగానే ప్రజలు వీధుల్లోకి వచ్చి సంఘీభావం తెలిపారు.



ఇండోనేషియాలో 7 దేశాల సైనిక విన్యాసాలు : ఇండోనేషియా ప్రధాన దీవి జావాలో అమెరికాతో సహా 7 దేశాల సైనికుల వార్షిక విన్యాసాలు మొదలయ్యాయి. అమెరికా ఇండోనేషియా దేశాలు సైనిక వార్షిక విన్యాసాలను 2009 నుంచి నిర్వహిస్తున్నాయి. గత ఏడాది ఆస్ట్రేలియా, జపాన్, సింగపూర్ జత కలిశాయి. 2 వారాల పాటు జరగనున్న ఈ విన్యాసాలకు భారత సహా 12 దేశాలు తమ పరిశీలకులను పంపాయి. మొత్తం 19 దేశాలు భాగస్వామ్యం వున్న ఈ శిక్షణ విన్యాసాలు ఇండో - పసిఫిక్ ప్రాంత రక్షణకు సంఘీభావ ప్రదర్శన గా పేర్కొంటారు.



భారతదేశపు మొట్టమొదటి యు.పి.ఐ - ఎ.టి.ఎమ్ : జపాన్ ఆధారిత హిటాచి లిమిటెడ్ అనుబంధ సంస్థ అయిన హిటాచి పేమెంట్ సర్వీస్. నేషనల్ పేపెంట్స్ కార్పొరేషన్‌తో కలిసి హిటాచి మని స్పాట్ (యు.పి.ఐ ఎ.టి.ఎమ్) పేరుతో భారతదేశపు మొట్టమొదటి యు.పి.ఐ - ఎ.టి.ఎమ్ ను వైట్ లేబుల్ ఎ.టి.ఎమ్ (డబ్ల్యు.ఎల్.ఎ) గా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఇదికార్డ్‌లెస్ నగదు ఉపసంహరణలను అందిస్తుంది. యు.పి.ఐ -ఎ.టి.ఎమ్ వినియోగదారులు యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ ఫేస్ (యు.పి.ఐ) యాప్‌ని ఉపయోగించి నగదు ఉపసంహరణ చేసుకోవచ్చును.